Pubilshed from Ananthapuramu
PRGI NO : APTEL/2023/90641

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




అనంతపురము ANATHAPURAMU | సంపుటి : 03 Vol.No : 03 | సంచిక : 109 Issue No : 109 | బుధవారం Wednesday | డిసెంబర్ 17, 2025 17 December 2025 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

## నో హెల్మెట్ నో పెట్రోల్..

# సీఎం క్లాప్స్!

ప్రజాభూమి రీజనల్ బ్యూరో వల్లిపి విద్యాసాగర్ ప్రత్యేక కథనం

రోడ్డు మీద దూసుకెళ్లే ద్విచక్ర వాహనం క్షణం ఆలస్యం ఒక చిన్న నిర్లక్ష్యం ప్రాణాల మీద ప్రశ్నార్థకం. ప్రతిరోజూ ఏదో ఒక మూల రోడ్డు ప్రమాద వార్త. ఎవరో ఒక కుటుంబం కళ్లముందే చీకటి. ఈ పరిస్థితికి బ్రేక్ వేయాలనే సంకల్పంతో తిరుపతి జిల్లాలో పోలీసులు తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది.... హెల్మెట్ ధరించకుండా పెట్రోల్ కూడా కాదు ... ఈ ఒక్క లైన్ వెనుక ఉన్న ఉద్దేశం ప్రజల ప్రాణ భద్రత. ఈ ఆలోచనను ఆచరణలోకి తీసుకువచ్చి, ప్రజల ముందు నిలబెట్టిన విధానం తిరుపతి జిల్లా పోలీస్ శాఖకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది.



### రాష్ట్రంలోనే తొలిసారి తిరుపతి జిల్లాలో కఠిన అమలు

- అవగాహన కాదు అమలే మార్పు
- నో హెల్మెట్ నో పెట్రోల్ పై ఎస్పీ సుబ్బరాయుడు
- 700 మంది పోలీసులతో హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ
- కలెక్టర్ వెంకటేశ్వర్ ఎస్పీ నాయకత్వానికి ముఖ్యమంత్రి ప్రశంసలు
- ప్రజల భద్రతే లక్ష్యంగా విధాన నిర్ణయం

ఇంకా వివరాలకు వెళ్తే...

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ బాస్ సుబ్బరాయుడు చేపట్టిన నో హెల్మెట్ నో పెట్రోల్ విధానం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ద్విచక్ర వాహనదారుల ప్రాణ భద్రతే లక్ష్యంగా ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించగా, ద్విచక్ర వాహనదారుల ప్రాణ భద్రత కోసం తీసుకున్న ఈ కఠిన నిర్ణయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బహిరంగంగా ప్రశంసలు తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా ఇది స్ఫూర్తిదాయక చర్యగా అభివర్ణించారు.

2లో

## బీమా రంగంలో వంద శాతం

# ఎఫ్‌డిఐలు

- బీమా చట్టాలు (సవరణ) బిల్లును ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ : మంగళవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'సబ్కా బీమా సబ్కి రక్ష' పేరుతో బీమా చట్టాలు (సవరణ) బిల్లు 2025ను ప్రవేశపెట్టారు. పాలసీదారుల రక్షణను బలోపేతం చేయడం, బీమా వ్యాప్తిని మరింతగా పెంచడం, దేశంలో బీమా రంగం వృద్ధిని వేగవంతం చేయడమే ఈ బిల్లు లక్ష్యంగా ఉంది.

కాగా, ఈ బిల్లు 1938 బీమా చట్టం, 1956 జీవిత బీమా కార్పొరేషన్ చట్టం, 1999 భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డిఎఐ) చట్టం వంటి కీలక చట్టాలను సవరిస్తూ తెచ్చిన బిల్లు ఇది. 2047 నాటికి అందరికీ బీమా సౌకర్యం కల్పించడం, అలాగే ఈ రంగంలో వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరిచే దిశగా కేంద్రం ఈ బీమా చట్టాలకు సవరణ బిల్లు తెచ్చింది. మరో ముఖ్యమైనదేమిటంటే..

2 పేజీలో..

## ఆక్వా కల్చర్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- రైతుల ఆదాయం పెంపే లక్ష్యం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఆక్వా రంగం కీలకమైన ఆధారంగా మారిందని, ఆక్వా కల్చర్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం కృష్ణా జిల్లా పెనమలూరులోని మత్స్య శాఖ కార్యాలయంలో రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి అధికార సంస్థ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

2 పేజీలో..



## పరకామణిలో టీటీడీ ఆధునిక టెక్నాలజీ

# వినియోగించాలి

- ఏపీ హైకోర్టు

అమరావతి : టీటీడీ పరకామణి కేసులో ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మంగళవారం విచారణ చేపట్టిన హైకోర్టు టీటీడీ ఆధునిక టెక్నాలజీ, కత్రిమ మేధ వినియోగించాలని తెలిపింది.

2 పేజీలో..



## ఐసిడిఎస్‌లో మూడు లక్షల

# ఖాళీలున్నాయి

సోనియా గాంధీ

న్యూఢిల్లీ : నేడు రాజ్యసభలో దేశంలో మహిళా ఫ్రంట్‌లైన్ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియాగాంధీ లేవనెత్తారు. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసిడిఎస్)లో దాదాపు మూడు లక్షలు ఖాళీలున్నాయి.

## ప్రతి ఇల్లు ఆరోగ్యంతో

# ఉండాలి

- త్వరలో ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులు
- ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గేలా కార్యాచరణ
- ప్రివెంటివ్ హెల్త్ విధానాలపై ప్రత్యేక దృష్టి
- వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు
- ప్రజారోగ్యంపై గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యున్నతస్థాయి వైద్య సలహా బృందంతో సీఎం తొలి సమావేశం



ప్రజాభూమిప్రతినిధి,అమరావతి : ప్రజారోగ్య పరిరక్షణకు మెరుగైన విధానాలను అవలంబిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవడం తోపాటు... నిపుణుల సలహాలను తీసుకోవాలని సీఎం సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సమీక్షించారు.

- మిగతా 2లో..

## ఆ ఇళ్ల కూల్చివేతకు

# సీఎం, ఆయన కుమారుడే కారణం

స్థానిక ఎంపీ, స్థానిక కార్పొరేటర్ సోదరుడే కూడా

- పేదలకు ఏ ప్రభుత్వమైనా అండగా నిలబడాలి
- కానీ, ఇక్కడ ప్రభుత్వమే వారికి వ్యతిరేకంగా పిటిషన్లు
- జోజినగర్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి
- లేని పక్షంలో మా ప్రభుత్వం రాగానే విచారణ తథ్యం
- ఈ ఘటనకు బాధ్యులను బోనులో నిలబెట్టి తీరుతాం
- జోజినగర్ బాధితులకు పూర్తి అండగా నిలబడతాం
- వారి న్యాయ పోరాటానికి పార్టీ తోడుగా ఉంటుంది
- వైసీపీ అధినేత వైయస్ జగన్



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ : విజయవాడ, భవానీపురం జోజినగర్ ఇళ్లు కూల్చివేతపై సీబీఐ విచారణ జరగాలని మాజీ సీఎం, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ డిమాండ్ చేశారు. అప్పుడే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. జోజినగర్ బాధితుల బ్యాంక్ రుణాలు ప్రభుత్వం చెల్లించాలని, కూల్చివేతలో ఇళ్లు కోల్పోయిన ఆ 42 కుటుంబాలకు తిరిగి ఇళ్లన్నీ కట్టించి ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో తమ ప్రభుత్వం రాగానే విచారణ జరిపించి, ఈ ఘటనకు బాధ్యులను బోనులో నిలబెట్టి తీరుతామని వెల్లడించారు.

2 పేజీలో..



## వైజాగ్ వస్తున్న వరల్డ్ ఛాంపియన్లు ఎవరో వెల్లడించిన

# మంత్రి నారా లోకేశ్

డిసెంబరు 21 నుంచి భారత్, శ్రీలంక మహిళల టీ20 సిరీస్

- తొలి రెండు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్న వైజాగ్
- టీమిండియాకు స్వాగతం పలుకుతూ మంత్రి లోకేశ్ ట్వీట్
- వరల్డ్ కప్ ప్రయాణం ఇక్కడి నుంచే మొదలైందని వెల్లడి

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి : మహిళల ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిన భారత జట్టు, ఆ ఘనత తర్వాత తమ తొలి సిరీస్‌ను ఆడేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌లకు విశాఖపట్నం వేదిక కానుంది. ఈ నేపథ్యంలో ఏపీ మంత్రి నారా లోకేశ్ భారత జట్టుకు స్వాగతం పలుకుతూ సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్ చేశారు.భారత్, శ్రీలంక మహిళల జట్ల మధ్య ఈ నెల 21 నుంచి 30 వరకు టీ20 సిరీస్ జరగనుంది. ఇందులో తొలి రెండు మ్యాచ్‌లు డిసెంబర్ 21, 23 తేదీల్లో విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్నాయి.

2 పేజీలో..

# సంపాదకీయం

## ఎన్నికల సంస్కరణలపై ఆసక్తిలేని కాంగ్రెస్ ?



కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోవడంతో నానా తంటాలు పడుతోంది. పదేళ్లపాటు యూపిఎ ద్వారా ఓ వెలుగు వెలిగి నానా అరాచకాలకు పాల్పడింది. ఆనాడు పదేళ్లు ఎలా అధికారంలోకి వచ్చిందన్నది చెప్పడం లేదు. కేవలం ఓటు చోరీపైనే అధికారంలోకి వచ్చారా అన్నది ప్రజలకు చెప్పాలి. స్వాతంత్ర్యానం తరం అనేక ఏళ్లపాటు అధికారంలో ఉంది. అప్పుడు మరి ఓటు చోరీ చేశారా అన్నది చెప్పాలి. పార్లమెంటు లో ఓటు చోరీ సందర్భంగా కొన్ని మౌళిక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. వాటికి కాంగ్రెస్ పార్టీ, విపక్ష నేత రాహుల్ సమాధానం చెప్పలేక పోయారు. హోంమంత్రి అమిత్ షా అనేక విషయాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్యానంతరం ఎవరు ప్రధానిగా ఉండాలని ఓటింగ్ జరిగితే అంతా సర్దార్ పటేల్ పేరు చెప్పారు. కానీ నెహ్రూ మత్రమే ప్రధాని అయ్యారు. ఇందిర హయాంలె అలహాబాద్ హైకోర్టు, ఆమె ఎన్నిక చెల్లదని తీర్పు చెప్పింది. అలాగే ప్రధాన న్యాయమూర్తుల సీనియారిటీని కాదని ఐదో స్థానంలో ఉన్న వ్యవక్తిని చీఫ్ జడ్జిగా నియమించారు.ఇలా అనేక అంశాలను అమిత్ షా ప్రస్తావించారు. ఇవన్నీ ఎందుకు చర్చించాలంటే ... కాంగ్రెస్ అధికారం కోల్పోతే ఓట్ చోరీ జరగిందని ఇటీవల రాహుల్ రంకెలు వేస్తున్నారు. ఢిల్లీలో ర్యాలీలు తీసి నానా హంగామా చేశారు. నిజానికి సర్‌పై చర్చలో ప్రధాన అంశాలేవీ చర్చకు రాలేదు. ఎన్నికల సంస్కరణలపై చర్చలో కాంగ్రెస్‌కు పెద్దగా ఆసక్తి లేదు. కేవలం ఓట్ల తొలగింపుపైనే కాంగ్రెస్ మండిపడుతోంది. అయితే పాక్, బంగ్లాదేశ్‌ల నుంచి అక్రమంగా వసలవచ్చిన వారి ఓట్లను తొలగించడం ద్వారా ఎన్నికల సంఘం తన విధిని తాను చేసుకుంటూ పోతోంది. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘాన్ని తప్పపట్టడం ద్వారా రాహుల్ రాజ్యాంగ ద్రోహానికి పాల్పడ్డారనే భావించాలి. అలాగే భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో పేర్కొన్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దాఖలైన ఫిర్యాదులపై చట్టసభల స్పీకర్ ఉత్తర్వులు వెలువరించటానికి కాలవ్యవధిని నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు గత తీర్పుల్లో ప్రకటించింది. కోర్టు ధిక్కార ఉత్తర్వుల దాకా వెళ్లిన దాఖలాలూ ఉన్నాయి. అయినా, రాజ్యాంగం ప్రసాదించిన విచక్షణ హక్కును సభాపతి సహేతుకమైన సమయంలో ఉపయోగించట్లేదనేది వాస్తవం. దీనిని ఎక్కడా రాహుల్ ప్రస్తావించలేదు. పార్లమెంట్ చర్చలో ఎక్కడా ఫిరాయింపులపై మాట్లాడడం లేదు. ఎందుకంటే ఒక రాజకీయ పార్టీ టికెట్‌పై ఎన్నికల్లో గెలిచిన ఒక సభ్యుడు ఎన్నికల తర్వాత అధికార పార్టీలో చేరడం అలవాటు చేసుకున్నాడు. దేశవ్యాప్తంగా ఇది జరుగుతోంది. గెలిచిన వారు మరో రాజకీయ పార్టీలో చేరటం ఆనవాయితీగా మారింది. ఒక రాజకీయ పార్టీ ప్రతినిధిగా ఎన్నుకోబడిన సభ్యుడు ఆ ఓటర్ల తీర్పును కాలరాచి తన ఇష్టానుసారంగా అధికారంలో ఉన్న పార్టీలోకి మారిపోతున్నారు. పార్టీలు మారే ఈ విధానం మొట్టమొదటగా హర్యానాలో 'ఆయారామ్ గయారామ్'గా, ప్రచారంలోకి వచ్చింది. అధికారంలో ఉన్న పార్టీలో ఉంటే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఎక్కువగా తెచ్చుకునే అవకాశం ఉంటుందని చెప్పడం ద్వారా రాజకీయ పార్టీలు ప్రజలను వంచిస్తున్నాయి. అంటే విపక్షంలో ఉంటే నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోక పోవడం అధికార పార్టీ తప్పిదంగా గుర్తించాలి. ఇలా పార్టీలు మారడం తెలుగు రాష్ట్రాల్లో చూశాం. తన నియోజక వర్గంలోని ఓటర్ల అభీష్టం మేరకే అధికార పార్టీ కండువా కప్పకొన్నట్టు చెప్పకోవటం సాకు మాత్రమే. అక్రమంగా వెనుకేసుకున్న ఆస్తులను సీబీఐ లేదా ఇతర దర్యాప్తు సంస్థల నుంచి కాపాడుకునేందుకు, దర్యాప్తులు జరగకుండా చూసుకునేందుకు చేస్తున్న విన్యాసాలు తప్ప మరోటి కాదు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. దీనిపై పార్లమెంటులో చర్చించడం రాహుల్‌కు ఇష్టం ఉండదు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ ఇవన్నీ ప్రోత్సహించింది. ఇలా చర్చిస్తే తమ బండారం ఎక్కడ బయట పడుతుందో అన్న భయం. అందుకే అక్రమంగా ఉన్న ఓట్లను తొలగించడం రాహుల్‌కు నచ్చదు. ఓట్ చోరీ అంటూ ప్రచారం చేసి బీహార్‌లో బొక్కబోర్లా పడ్డారు. కాంగ్రెస్ ఓట్ చోరీకి ఇండియా కూటమితో సంబంధం లేదని కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా తాజాగా చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు కనువిప్ప కావాలి. ఇండియా కూటమిలో దీనిపై స్పష్టత లేదా ఏకాభిప్రాయం లేదని అర్థం అవుతోంది. 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' అనేది ఒకటి ఉన్నదని, దానికి కట్టుబడి ఉండాలనే నియమం చాలామంది చట్టసభల సభ్యుల్లో కనపడడం లేదు. ప్రతిపక్షం నుంచి అధికార పార్టీలో చేరిన సభ్యుల సభ్యత్వం రద్దు ఫిర్యాదులు ఎంతకాలానికి పరిష్కారమవుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. ఐదేండ్ల సభ కాలపరిమితి కూడా ముగిసిపోతోంది. కోర్టుల్లో కూడా కేసులు తేలడం లేదు. తెలంగాణలో వేములవాడ ఎమ్మెల్యేగా ఉన్న చెన్నమనేని రమేశ్ పౌరసత్వ వివాదం దాదాపు ఓ దశాబ్ద కాలం నడిచింది. ఆయన భారత పౌరుడా కాదా అన్నది కూడా తేల్చడంలో ఏళ్లు పడితే ఎలా. ఇవన్నీ కూడా ఎన్నికల సంస్కరణలో చర్చించాల్సిన అంశాలే. ఎన్నికల అంశాలన్నింటిని చర్చించి పారదర్శక విధానాలు అవలంబించాలి. అప్పడే మన ఎన్నికల వ్యవస్థ పటిష్టగా ఉంటుంది. అది చేయకుండా కేవలం ఓట్ చోరీ అంటూ అక్రమ వలసదారులకు అండగా దేశంలో స్థానం కల్పించడం దేశద్రోహమే అవుతుంది. అందువల్ల సమగ్ర ఎన్నికల సంస్కరణలపై చర్చ జరగాలి. తద్వారా రాహుల్ మంచి ఇమేజ్ సంపాదించుకోవచ్చు. అందుకు కాంగ్రెస్ పూనుంటే బాగుండేది. కానీ ఎన్నికల సంస్కరణలకు ఎవరు కూడా సిద్ధంగా లేరని అర్థం అవుతోంది. అందుకే చర్చ అసమగ్రంగానే సాగింది.

## నో హెల్మెట్ నో పెట్రోల్..

# సీఎం క్లాప్స్!

**రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అమలు...**రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తిరుపతి జిల్లాలో 'నో హెల్మెట్ నో పెట్రోల్' నిబంధనను కఠినంగా అమలు చేయడం ప్రత్యేకతగా నిలిచింది. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ సరఫరా నిలిపివేయడం ద్వారా ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంచే ప్రయత్నం ఫలితాన్నిస్తోంది.

**700 మంది పోలీసులతో భారీ బైక్ ర్యాలీ**

ఈ నిబంధనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 700 మంది పోలీస్ సిబ్బందితో భారీ ఎత్తున హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు స్వయంగా పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఉన్నతాధికారుల భాగస్వామ్యం ప్రజలకు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందని సీఎం ప్రశంసించారు.

**ఎస్పీ సుబ్బరాయుడు టెక్నాలజీతో పోలీసింగ్ :** 2013 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి ఎల్. సుబ్బరాయుడు తెలంగాణ కేడర్‌కు చెందినవారు. ప్రస్తుతం జూలై 2024 నుండి మూడేళ్ల పాటు ఇంటర్-కేడర్ డిప్యుటేషన్‌పై ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పోగొట్టుకున్న వందలాది మొబైల్ ఫోన్‌లను తిరిగి పొందేలా టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌ను అమలు చేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో డ్రోన్ నిఘా వంటి చర్యలు ఆయన పనితీరుకు ఉదాహరణలు.

**అనుభవంతో కూడిన సేవా ప్రస్థానం :** మునుపు కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా, రెడ్ సాండర్స్ యాంటీ%-%స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ ఎస్పీగా కీలక బాధ్యతలు నిర్వహించారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ఓఎస్ డి గా కూడా పనిచేశారు.

**ప్రజలకు సీఎం విజ్ఞప్తి :** ప్రజల భద్రత కోసం ప్రభుత్వం తీసుకువచ్చే నిబంధనలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. 'నో హెల్మెట్ నో పెట్రోల్' వంటి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

**తిరుపతికి భద్రతా బ్రాండ్..** రోడ్డు ప్రమాదాల తగ్గుదల, ప్రజల్లో మారుతున్న దృక్పథం, పోలీస్ శాఖపై పెరుగుతున్న విశ్వాసం ఈ విధానంతో తిరుపతి జిల్లా భద్రతకు బ్రాండ్ ఇమేజ్గా నిలుస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఏది ఏమైనా..** ప్రజల ప్రాణాలే ముఖ్యమని భావించి తీసుకున్న ప్రతి నిర్ణయం సరైనదే. 'నో హెల్మెట్ నో పెట్రోల్' విధానం ద్వారా రోడ్డు భద్రతపై కొత్త ఆలోచనను కార్యరూపంలోకి తీసుకొచ్చిన తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు నాయకత్వం ప్రశంసనీయం. అవగాహనతో పాటు కఠిన అమలే మార్పుకు దారి తీస్తుందన్న విషయాన్ని ఆయన చూపించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే ఇలాంటి అధికారుల ప్రయత్నాలు సమాజానికి దిశానిర్దేశకంగా నిలుస్తాయి.

## బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలు

బీమా రంగంలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రభుత్వం తలుపులు తెరిచింది. అంతకుముందు ఈ రంగంలో ఎఫ్‌డిఐ 74 శాతంగా ఉంటే.. ఈ సవరణ బిల్లుతో ఎఫ్‌డిఐలు వందశాతం అనుమతి పొందినట్లైంది.

## పరకామణిలో టీటీడీ ఆధునిక టెక్నాలజీ వినియోగించాలి

**లెక్కింపు ప్రక్రియలో మానవ ప్రమేయాన్ని వీలైనంత వరకు తగ్గించాలని.. పూర్తి స్థాయిలో ఏఐ టెక్నాలజీని వినియోగించాలని టీటీడీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేసింది. పరకామణిలో జరిగింది సాధారణ దొంగతనం కంటే తీవ్రమైన నేరమని పేర్కొంది. ఇలాంటి తప్పిదాలు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ హైకోర్టు ఆదేశాలను జారీ చేసింది.**

## ఐసిడిఎస్‌లో మూడు లక్షల ఖాళీలున్నాయి

ఆ ఖాళీలను భర్తీ చేయాలి.. వారికిచ్చే జీతానికి కేంద్రం సహకారాన్ని రెట్టింపు చేయాలని సోనియా ప్రభుత్వాన్ని కోరారు. నేడు సభలో జీరో అవర్‌లో ఈ అంశంపై సోనియా మాట్లాడుతూ.. ' జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద పనిచేస్తున్న ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, కమ్యూనిటీ రిసోర్సు పర్సన్లు ప్రజా సేవల పంపిణీకి కీలక సహకారం అందిస్తున్న వీరిపై అధిక పనిభారం పడుతుంది. వీరికిచ్చే జీతమూ తక్కువే. దేశవ్యాప్తంగా.. ఆశా కార్యకర్తలు రోగనిరోధకత, సమీకరణ, ప్రసూతి ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కింద విధులు నిర్వరిస్తున్నారు. అయినప్పటికీ వారు తక్కువ వేతనమే పొందుతున్నారు. పైపెచ్చు వారికి సామాజిక భద్రత కూడా తక్కువే. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ. 4,500, కనీస వేతనం రూ. 2,500లను చెల్లిస్తుంది' అని ఆమె అన్నారు. ఐసిడిఎస్ కేంద్రాల్లో వివిధ స్థాయిల్లో దాదాపు మూడు లక్షల ఖాళీలు ఉన్నాయి. దీనివల్ల లక్షలాది మంది చిన్నారులు, తల్లులు అవసరమైన సేవల్ని పొందలేకపోతున్నారు అని సోనియా ఈ సందర్భంగా ఎత్తిచూపారు. 2011 నుండి జనగణన లేకపోవడం వల్ల, ఈ పోస్టులను భర్తీ చేసినప్పటికీ జనాభా ప్రమాణాలకు అనుగుణంగా లేవు అని సోనియాగాంధీ అన్నారు. ప్రస్తుతం వివిధ స్థాయిల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి, కార్మికులందరికీ సకాలంలో వేతనం లభించేలా చూడడానికి, కార్మికులకిచ్చే వేతనానికి కేంద్రం అందించే సహకారాన్ని రెట్టింపు చేయడానికి రాష్ట్రాలతో కలిసి పనిచేయాలని సోనియా గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 2,500 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో అదనంగా ఆశాకార్యకర్తను నియమించాలి. అంగన్‌వాడీ కార్యకర్తల సంఖ్యను రెట్టింపు చేయాలి. చిన్నారులకందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య కార్యక్రమాలతోపాటు, బాల్య విద్యను అందించాలి అని సోనియా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



## ఆ ఇళ్ల కూల్చివేతకు సీఎం,

# ఆయన కుమారుడే కారణం

జోజినగర్ బాధితులకు పూర్తి అండగా నిలబడతామని, వారి న్యాయ పోరాటానికి పార్టీ తోడుగా ఉంటుందని ప్రకటించారు.

బెంగళూరు నుంచి గన్నవరం చేరుకున్న వైయస్ జగన్, నేరుగా విజయవాడ, భవానీపురం జోజినగర్ వెళ్లారు. అక్కడ ఇటీవల 42 ఇళ్లు కూల్చివేయగా, రోడ్డున పడ్డ ఆ కుటుంబాల బాధితులను వైయస్ జగన్ పరామర్శించారు. కోర్టు ఉత్తర్వులున్నా, ఏకపక్షంగా తమ ఇళ్లు కూల్చివేశారని, ఎంత చెప్పినా వినకుండా, పోలీసులు తమ బ్రతుకులు రోడ్డు పాల్జేశారని వారు గోడు వెళ్లబోసుకున్నారు. వారి అంతులేని ఆవేదన, బాధలన్నీ సావధానంగా విన్న వైయస్ జగన్ ఓదార్పునిచ్చారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఆక్షేపించారు.

**అనంతరం మీడియాతో మాట్లాడుతూ"**

విజయవాడ, భవానీపురం జోజినగర్ ఇళ్లు కూల్చివేత అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగానే ఇళ్లు కూల్చివేత దారుణం. ఈ కూల్చివేతలో సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్, ఎంపీ కేశినేని చిన్నితో పాటు, స్థానిక జనసేన కార్పొరేటర్ సోదరుడి ప్రమేయం ఉంది. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగానే ఇళ్లు ఎలా కూల్చేస్తారు?

పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వమే వారికి వ్యతిరేకంగా అఫిడవిట్లు, పిటిషన్లు వేయడం దుర్మార్గం.

విజయవాడ జోజినగర్ లో 42 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారు 25 ఏళ్ల నుంచి ఇళ్లు కట్టుకుని ఉంటే, ఒకేసారి వచ్చి ధ్వంసం చేశారు. సుప్రీంకోర్టులో ఈ స్థలం గురించి న్యాయపోరాటం జరుగుతోంది. దీనిపై విచారణ కొనసాగుతోంది. డిసెంబరు 31 వరకు, 42 కుటుంబాలకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. ఒకవైపున సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, ఈనెల 31 వరకు ఊరట ఉండగానే, ఒకేసారి 200 మందికి పైగా పోలీసులు వచ్చి, ప్రైవేటు పార్టీకి మద్దతు తెలుపుతూ, ఈ 42 ఇళ్లకు సంబంధించిన వారిని నిర్దాక్షిణ్యంగా, వాళ్లు ఇళ్లలో ఉండగానే, ఇళ్లన్నీ పడగొట్టి రోడ్డున పడేశారు.

ప్రభుత్వ పెద్దల ప్రమేయం, వారి సహకారం, వారి ఆశీస్సులతోనే ఇదంతా జరిగింది. అందుకే ఇంత అకస్మాత్తుగా. ఈ నెలాఖరు వరకు గడువు ఉందని తెలిసినా కూడా, అధికార దుర్వినియోగం చేస్తూ, వీరిని రోడ్డు పాల్జేశారు.

ఇక్కడ 2 ఎకరాల 17 సెంట్లకు సంబంధించి చూస్తే, దీని ప్రస్తుత మార్కెట్ విలువ రూ.150 కోట్లకు పైగానే. దీంట్లోకి ప్రైవేటు వ్యక్తులు వచ్చారు. 2016లో ఒక ఫేక్ సొసైటీ పెట్టారు. అప్పుడు కూడా సీఎం చంద్రబాబు. 1981 డేట్‌లో ఒక తప్పుడు సొసైటీ ఏర్పాటు చేసి, ఈ ప్రాంతాన్ని కబ్జా చేయడానికి కుట్ర చేశారు. సీఎం చంద్రబాబు, నారా లోకేష్, ఎంపీ కేశినేని చిన్ని, జనసేన కార్పొరేటర్ సోదరుడికి కూడా ఇందులో ప్రమేయం ఉంది. ఇది విచ్చలవిడి అధికార దుర్వినియోగం. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగా, 200 మంది పోలీసులు వచ్చి, ఇంత మందిని రోడ్డు పాల్జేశారు. ఈ 2 ఎకరాల 17 సెంట్లలో 2001కి ముందు నుంచి వీరు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఇందులో చాలా మంది ఇళ్లు కట్టుకున్నారు. వాటికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి కూడా ఇచ్చింది. ఈ ఇళ్లకు కరెంటు, డ్రైనేజీ కనెక్షన్లు కూడా ఉన్నాయి. అన్నింటికీ అన్ని అనుమతులు ఉన్నాయి. బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. చాలా మంది లోన్‌లో ఇళ్లు కట్టుకున్నారు.

మరి ఇక్కడ స్థలాలు వేరేవారివైతే, ఎలా అనుమతి ఇచ్చారు? ఎలా రిజిస్ట్రేషన్ చేశారు? బిల్డింగ్ ప్లాన్ ఎలా అనుమతించారు? బ్యాంకులు లోన్లు ఎలా ఇచ్చాయి? వాటర్, పవర్ కనెక్షన్లు ఎలా ఇచ్చారు? ఇన్ని ఉన్నా, ఎలాంటి నోటీసు కూడా ఇవ్వకుండా, ప్రైవేటు వ్యక్తులకు మద్దతు ఇస్తూ, పోలీసులు వచ్చి, జేసీబీలతో ఇళ్లు ఎలా కూల్చేశారు? గతంలో ఇక్కడ ఇళ్ల క్రయ, విక్రయాలు జరిగినప్పుడు, పత్రికా ప్రకటనలు కూడా ఇచ్చారు. అభ్యంతరాలు ఉంటే చెప్పాలని. కానీ, ఎవరూ, ఎక్కడా అభ్యంతరాలు రాలేదు. అయినా, ప్రైవేటు వ్యక్తులకు మేలు చేసేందుకు పోలీసులు ఇళ్లు కూల్చేశారు. అసలు ఈ ప్రభుత్వం ఎవరి కోసం పని చేస్తోంది? ఇక్కడి వారు సీఎం చంద్రబాబును, లోకేష్‌ను మూడుసార్లు కలిశారు.

**ఎవరికైతే వీరు అర్జీలు ఇచ్చారో.. వారే కుట్ర పన్ని, వీళ్లకు అన్యాయం చేశారు.**

నేను ఒకటే అడుతున్నాను. ఇక్కడే కాదు. రాష్ట్రమంతా ఇదే కొనసాగుతోంది. అనేక చోట్ల.. ఎక్కడైనా చిన్న చిన్న లిటిగేషన్లు ఉంటే, టీడీపీ నాయకులు ఎంటర్ అవుతున్నారు. ల్యాండ్ కబ్జా చేస్తున్నారు. ఇంకా కొన్ని చోట్ల వారే స్వయంగా లిటిగేషన్లు పెట్టి, కబ్జా చేస్తున్నారు. నేను ఒకటే కోరుతున్నారు. ఈ వ్యవహారంపై వెంటనే సీబీఐ దర్యాప్తు జరిపించాలి. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎంపీ చిన్ని, జనసేన కార్పొరేటర్ ఎలా, ఏం చేస్తున్నారో.. ప్రజలకు తెలియాలి.ఇక్కడ 1981 డేట్‌తో ఫేక్ సొసైటీని 2016లో ఏర్పాటు చేశారు. అది కూడా బయటకు రావాలి. ప్రభుత్వం పేదలకు అండగా ఉండాల్సింది పోయి, వారికి వ్యతిరేకంగా అఫిడవిట్లు, పిటిషన్లు వేసింది. అందుకే ఇక్కడి మొత్తం వ్యవహారంపై విచారణ జరగాలి. వాస్తవాలు బయటకు రావాలి.

ఇక్కడ 25 ఏళ్ల నుంచి ఉంటున్నారు. వారికి బ్యాంక్ లోన్లు కూడా ఉన్నాయి. కానీ ఇళ్లు ఇప్పుడు లేవు. అందుకే ప్రభుత్వం ముందుకు రావాలి. వీరి బ్యాంక్‌ల రుణాలు ప్రభుత్వమే కట్టాలి. వీరందరికి ఇక్కడ కానీ, మరెక్కడైనా కానీ, పక్కాగా ఇళ్లు కట్టించాలి.అయ్యా చంద్రబాబు మీరు ఈ పని చేయకపోతే.. రేపు మా ప్రభుత్వం రాగానే, విచారణ జరిపిస్తాం. దోషులను కోర్టు ముందు నిలబెడతాం. ఇంకా ఇక్కడి బాధితులందరికీ తోడుగా నిలబడతాం. బాధితులకు ఇదే మీ జగనన్న మాట అని హామీ ఇస్తున్నాను. ఇంకా సుప్రీంకోర్టులో కానీ, హైకోర్టులో కానీ బాధితుల తరపున వాదించేందుకు వైయస్సార్సీపీ తరపున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని "వైయస్.జగన్ స్పష్టం చేశారు.

## ఆక్వా కల్చర్ అభివృద్ధికి

# సంపూర్ణ సహకారం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్ ల వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులు ఆక్వా రైతులపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, వాటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటోందన్నారు. దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రొయ్యలకు ఉన్న నాణ్యత, విశ్వసనీయతపై విస్తృత ప్రచారం అవసరమని, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతుల పెంపు, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. నాణ్యతపై ప్రతి రైతు దృష్టి పెట్టాలని, అప్పుడే మంచి ధర లభిస్తుందన్నారు. దేశ మత్స్యరంగంలో ఆంధ్రప్రదేశ్ వాటా 29 శాతం ఉందని తెలిపారు. చేపలు, రొయ్యల చెరువులకు సర్వే నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని సీఎం సూచించారని, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 48 శాతం చెరువుల రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. గతంలో రైతులు చెరువుల రిజిస్ట్రేషన్ విషయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించామని, చెరువులకు జియో ట్యాగింగ్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఆక్వారంగ సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఆక్వా రైతులకు రూ.800 కోట్ల విద్యుత్ రాయితీ అందించామని, దీన్ని రూ.1,200 కోట్లకు పెంచుతున్నామని, రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే విద్యుత్ రాయితీ వర్తిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## వైజాగ్ వస్తున్న వరల్డ్ ఛాంపియన్లు ఎవరో వెల్లడించిన మంత్రి నారా లోకేశ్

ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ లోకేశ్ తన సంతోషాన్ని పంచుకున్నారు. భారత మహిళల జట్టు వరల్డ్ కప్ ప్రయాణం విశాఖ నుంచే ప్రారంభమైందని ఆయన గుర్తుచేశారు. "ఛాంపియన్లకు స్వాగతం. భారత మహిళల జట్టు వరల్డ్ కప్ ప్రయాణం మన విశాఖలో నెల రోజుల క్యాంపుతోనే మొదలైంది. ఇప్పుడు విశ్వవిజేతలుగా నిలిచాక తమ తొలి మ్యాచ్‌లను ఇక్కడే ఆడుతున్నారు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, కొద్ది రోజుల క్రితం "వైజాగ్‌కు వరల్డ్ ఛాంపియన్లు వస్తున్నారు, ఎవరో చెప్పుకోండి" అంటూ ఆయన చేసిన ట్వీట్ ఆసక్తి రేపిన విషయం తెలిసిందే. ప్రపంచకప్ గెలిచిన తర్వాత టీమిండియా ఆడుతున్న తొలి సిరీస్ కావడంతో ఈ మ్యాచ్‌లపై అంచనాలు పెరిగాయి.

# ప్రతి ఇల్లు ఆరోగ్యంతో ఉండాలి

ఈ మేరకు గేట్స్ ఫౌండేషన్ తో కలిసి వైద్యారోగ్య రంగంలో ప్రభుత్వం అమలు చేస్తోన్న సంజీవని సహా వివిధ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఏపీలో మెరుగైన ప్రజారోగ్య నిర్వహణకు గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్యారోగ్య రంగంలోని నిపుణులతో కూడిన 10 మంది సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేశారు. యూఎన్ఎయిడ్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పీటర్ పాయిట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్, ఎఐజీ ఛైర్మన్ డి.నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టియో, రిటైర్డ్ ఐఏఎస్ ఆర్తి అహుజా, సైటెస్ ఛైర్ పర్సన్ రిజ్వాన్ కొయిటా, కోస్లా ల్యాబ్స్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ నాదముని, గేట్స్ ఫౌండేషన్ జినోమిక్స్ అండ్ ఎపిడామిలజీ డైరెక్టర్ డాక్టర్ గగన్ దీప్ కాంగ్, పబ్లిక్ హెల్త్ నిపుణురాలు మార్గరెట్ ఎలిజిబెత్, ఢిల్లీ ఎయిమ్స్ ఎండోక్రినాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ టాండన్ అత్యుతన్నతస్థాయి నిపుణుల సలహా బృందంలో ఉన్నారు. అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందం సభ్యులు వర్చువల్ గా ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."వైద్యారోగ్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా డబ్ల్యూహెచ్ఓ లాంటి సంస్థలు నిర్దేశించిన అంశాలను అమలు చేస్తున్నాం. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశాం. రియల్ టైమ్ లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ప్రాజెక్టు పని చేస్తుంది. వివిధ అంశాల్లో ప్రజలకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుంది.త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తాం"అని సీఎం చెప్పారు.

**వైద్యారోగ్య రంగంలో టెక్నాలజీ వినియోగం**

"2047 స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా మేం ప్రయత్నాలు చేస్తున్నాం. ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాల్సి ఉంది. ప్రివెంటివ్ వెల్ నెస్, డిజిటల్ ఏఐ ఎనేబుల్డ్ హెల్త్, హెల్త్ ఫైనాన్సింగ్ రిఫార్మ్స్ లాంటి కీలకమైన అంశాలపై దృష్టి పెట్టాలి. వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున పెరగాలి. ఏపీలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలను రూపొందిస్తున్నాం. వ్యాధుల బారిన పడి ఆ తర్వాత చికిత్స తీసుకోవడం కంటే..ముందుగానే నియంత్రించేలా ప్రివెంటివ్ విధానాలపై దృష్టి పెట్టాలి. ఇలా చేయగలిగితే ప్రజల వైద్య ఖర్చులు చాలా వరకు తగ్గుతాయి. దీని ద్వారా ప్రజల ఆరోగ్యం బాగుంటుంది... ఆర్థిక వెసులుబాటూ కలుగుతుంది. వైద్యారోగ్య రంగంలో మరింత వినూత్నంగా ప్రాజెక్టులు చేపట్టేందుకు అత్యున్నత స్థాయి నిపుణుల బృందం సలహాలు ఇవ్వాలని కోరుతున్నాం. ముంబైలో త్వరలో గ్లోబల్ ఏఐ కన్వెన్షన్ జరగబోతోంది...ఆ కన్వెన్షనులో వైద్యారోగ్యంలో టెక్నాలజీ వినియోగంపై ఏపీ ప్రభుత్వం రూపొందిస్తున్న విధానాలను ప్రదర్శించాలని ఆలోచన చేస్తున్నాం. దీనికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని నిపుణుల బృందాన్ని కోరుతున్నా. ప్రజల ఆరోగ్య డేటాను విశ్లేషించి ముందస్తుగానే తగిన నియంత్రణా చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. విధానాల రూపకల్పన ఒక్కటే సమస్యలకు పరిష్కారం కాదు. అది క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలు అయినపుడే అది విజయవంతం అవుతుంది. ఏడాదిలోగా ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సిద్ధం చేస్తాం. స్క్రీనింగ్ లో టాప్ 10లో ఉన్న రోగాలను గుర్తించి విశ్లేషించేందుకు ప్రయత్నిస్తాం. ఇటీవల గిరిజన ప్రాంతాల విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతను నేర్పేలా ఓ చిన్న కార్యక్రమం చేపట్టాం. వివిధ అంశాలకు ఆంధ్రప్రదేశ్ ఓ స్టార్టప్ ఏరియాగా ఉంటుంది. హెల్తీ,వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. నిపుణుల బృందం విలువైన సలహాలను ఏపీలో అమలు చేస్తాం."అని ముఖ్యమంత్రి అన్నారు.

**ప్రజారోగ్య సంరక్షణకు నిపుణుల బృందం సూచనలు**

ఈ సందర్భంగా నిపుణుల సలహా బృందంతో ముఖ్యమంత్రి మాట్లాడారు. అలాగే ప్రజారోగ్యంలో వారి నుంచి సలహాలను కోరారు. ఈ నిపుణుల బృందం ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ సూచనలిచ్చింది. ప్రజారోగ్య పరిరక్షణ, ముందస్తు జాగ్రత్తలపై విలువైన సిఫార్సులు చేశారు. వైద్యారోగ్య రంగంలో నర్సులు, వైద్యులు అందుబాటులో ఉండడం ఎంత అవసరమో...

పౌష్టిక ఆహారం అనేది ముఖ్యమని ప్రపంచ ఆరోగ్యసంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్యా స్వామినాథన్ అన్నారు. వాయు, జల, భూ కాలుష్యాల ద్వారా ప్రజారోగ్యం ఇబ్బందుల్లో పడుతోందని చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేలా ప్రజల్ని చైతన్యం చేయాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజారోగ్యాన్ని కేవలం మెడికల్ అంశంగానే చూడకూడదని యూఎన్ఎయిడ్స్ డైరెక్టర్ పీటర్ పాయిట్ స్పష్టం చేశారు. ఇతర అంశాలు కూడా ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు. రూట్ కాజ్ అనాలసిస్ చేస్తే ముందుగానే రోగాల బారిన పడకుండా నియంత్రణా చర్యలు చేపట్టవచ్చని విశ్రాంత ఐఏఎస్ ఆర్తీ అహుజా అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా యువతలో డయాలసిస్ పేషెంట్లు పెరుగుతున్నారని... దీనికి కాలుష్యమే ప్రధాన కారణమన్నారు. ఏఐ, డిజిటల్ హెల్త్ ద్వారా వైద్య సేవలు మెరుగ్గా అందుతున్నాయని సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ వైవై టియో చెప్పారు. ఈ మేరకు ప్రాధాన్యతలను విశ్లేషించుకుని ప్రజారోగ్యంలో సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. హెపటైటిస్ టీకాను సమర్థంగా వినియోగించుకున్న రాష్ట్రంగా ఏపీ ఉందని మార్గరెట్ ఎలిజబెత్ వెల్లడించారు. హెల్త్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రజారోగ్యంపై మెరుగైన విధానాల్ని తీసుకువచ్చే అవకాశం ఉంటుందని సూచించారు. డిజిటల్, ఏఐ ఎనేబుల్డ్ సేవలు వైద్యారోగ్యంలో ఇప్పుడు ముఖ్యమైన అంశాలుగా మారాయని శ్రీకాంత్ నాదముని అన్నారు. ఏఐ డాక్టర్ ద్వారా ప్రాథమికంగా రోగి సందేహాలు తొలగించవచ్చని చెప్పారు. సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ కేర్ కేంద్రంగా ఏపీ తయారవుతోందని డాక్టర్ రిజ్వాన్ వెల్లడించారు. వైద్య విద్యార్థులు, నర్సుల లాంటి వారికి డిజిటల్ హెల్త్ కేర్ లో శిక్షణ అందించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ, రిస్క్ ఫ్యాక్టర్ ఎంత ఉందన్నది ప్రాథమికంగా గుర్తించాల్సి ఉంటుందని డాక్టర్ నిఖిల్ టాండన్ చెప్పారు. అన్ని వ్యాధులకు ఒకే రకమైన విధానాలను అనుసరించలేమని...ఈ మేరకు క్లినికల్ మేనేజ్మెంట్ అసెస్మెంట్ ద్వారా వేర్వేరు రకాలుగా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు.

హెల్త్ ఎడ్యుకేషన్ నుంచే హెల్త్ కేర్ సాధ్యం అవుతుందని డాక్టర్ నాగేశ్వర రెడ్డి అభిప్రాయపడ్డారు. ఫిట్ నెస్, హైజీన్ లాంటివి విద్యార్థుల దశ నుంచే ఈ తరహా హెల్త్ ఎడ్యుకేషన్ ను అమలు చేయాల్సి ఉంటుందని సూచించారు.

**ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ ముందుకు :** రాష్ట్రంలో గ్లోబల్ స్థాయి ప్రమాణాలతో వైద్యారోగ్య నిపుణులు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ పనిచేస్తోందని .. ఆ సంస్థ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ అన్నారు. ప్రజారోగ్య పర్యవేక్షణ కోసం ఓ హెల్త్ సెక్రటేరియట్ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందింస్తామని ఆమె స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చేందుకు అవసరమైన సూచనల్ని నిపుణుల బృందం చేసిందని ..వారి సిఫార్సులు హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం ఉపకరిస్తాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. నిపుణుల సలహాలను మరింత లోతుగా చర్చించి వాటిని ఏపీలో అమలు చేస్తామని సత్యకుమార్ అన్నారు. సీఎం చంద్రబాబు తరచూ ప్రజారోగ్యం రంగాన్ని ఎలా పటిష్ట పరచాలన్న అంశాలపైనే ఆలోచన చేస్తారని మంత్రి వివరించారు. ఇకపై ఏడాదిలో రెండుసార్లు నిపుణుల బృందంతో భేటీ అవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. నిపుణులు ఇచ్చిన సలహాలను.. సూచనలను క్రోడీకరించి యాక్షన్ ప్లాన్ తయారు చేసే బాధ్యతను గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ కు ముఖ్యమంత్రి అప్పగించారు.

# ఐపీఎస్ అధికారి సంజయ్‌కు ఊరట.. షరతులతో బెయిల్ మంజూరు

**విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి షరతులతో కూడిన బెయిల్**
**రూ. 50 వేల చొప్పున ఇద్దరి పూచీకత్తు సమర్పించాలని ఆదేశం**
**ఆగస్టు 26 నుంచి జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న అధికారి సహ నిందితుడు కొండలరావుకు కూడా బెయిల్ మంజూరు**




అమరావతి ప్రజాభూమి ప్రతినిధి

ప్రభుత్వ నిధుల దుర్వినియోగం ఆరోపణల కేసులో జైలులో ఉన్న ఐపీఎస్ అధికారి సంజయ్‌కు ఊరట లభించింది. విజయవాడ ఏసీబీ కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. బెయిల్ కోసం రూ. 50 వేల చొప్పున ఇద్దరు వ్యక్తుల పూచీకత్తును సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో పాటు, మూడు రోజుల్లోగా తన పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించాలని, ప్రతి శుక్రవారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని స్పష్టమైన షరతు లు విధించింది.అగ్నిమాపక శాఖ డీజీగా పనిచేసిన సమయంలో సంజయ్ నిధులు దుర్విని యో గం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అగ్ని-ఎన్‌వోసీ వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్ అభివృ ద్ధి కాం ట్రా క్టులో అవకతవకలు జరిగాయని, పనులు పూర్తికాకముందే రూ. 59 లక్షలకు పైగా చెల్లిం పులు చేశారని ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఆయన ఆగస్టు 26న ఏసీబీ కోర్టులో లొంగి పోగా, అప్పటి నుంచి విజయవాడ జైలులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు.ఇదే కేసులో సహ నింది తుడిగా ఉన్న కొండలరావుకు (ఏ4) కూడా కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది

# విశాఖలో మంత్రి నారా లోకేష్ 78వ రోజు ప్రజాదర్బార్

## ప్రజలను కలిసి అర్జీలు స్వీకరణ

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం:



విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉదయం 78వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి నుంచి అర్జీలు స్వీకరించారు. విశాఖపట్నం కంచరపాలెంలోని ఓల్డ్ ఐటీఐలో ట్రైనింగ్ ఆఫీసర్ గా పనిచేసి పదవీ విరమణ పొందిన తనకు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ త్వరితగతిన అందజేసేలా చర్యలు తీసుకోవాలని లంకిరెడ్డి సతీశ్వరరెడ్డి మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. కోనసీమ జిల్లా ఐ పోలవరం మండలం గుత్తెనదీవిలో తన 20 సెంట్ల భూమిని ఆక్రమించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, విచారించి తగిన న్యాయం చేయాలని గాలి దుర్గమ్మ విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామ భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని బాధితులు మంత్రి లోకేష్ ను కలిసి విన్నవించారు. 2008లో వీసీఐసీ ఫేజ్-1లో భాగంగా పరిశ్రమల అభివృద్ధి కోసం ఏపీఐఐసీ భూసేకరణ చేసి ఏళ్లు గడుస్తున్నప్పటికీ పునరావాసం కల్పించలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఫోర్జరీ డాక్యుమెంట్లతో విశాఖ ఏపీహెచ్ బీ లే అవుట్ లోని తమ 70వ నెంబర్ ఫ్లాట్ ను ఆక్రమించారని, విచారించి న్యాయం చేయాలని ఎస్.వెంకట లావణ్య కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

# ప్రజలకు ఉపయోగపడేలా, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా రుషికొండ ప్యాలెస్ ను వినియోగిస్తాం

**మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయ స్వామి**
**త్వరలోనే మరోసారి భేటీ.. అనంతరం రెండు మూడు ఆప్షన్ లు కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి తుది నిర్ణయం వెల్లడిస్తామని స్పష్టం**

అమరావతి ప్రజాభూమి ప్రతినిధి

పర్యాటక శాఖకు ఆదాయం వచ్చేలా, ప్రజలకు కూడా ఉపయోగపడేలా రుషికొండ ప్యాలెస్ పై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామమని మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. రుషికొండ ప్యాలెస్ ను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ రెండవ భేటీ మంగళవారం వెలగపూడి సచివాలయం రెండవ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగింది. భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయస్వామి, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాటలు పాల్గొని సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా గత భేటీలో సూచనల మేరకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని పర్యాటక శాఖ అధికారులు సబ్ కమిటీ ముందుంచారు. రుషికొండ ప్యాలెస్ ను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై వెబ్ సైట్ లో స్పందన కోరగా 1517 మంది ప్రజలు, 44 మంది స్టేక్ హోల్డర్స్ అభిప్రాయం వ్యక్తం చేశారని అత్యధిక శాతం ప్రజలు గత ప్రభుత్వం చేసిన తప్పును త్వరితగతిన సరిదిద్ది ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని కోరారని వెల్లడించారు.

మరికొందరు హోటల్, రిసార్ట్, మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ, సైన్స్ ప్లానిటోరియం, మైస్, వెల్ నెస్ సెంటర్ గా, ప్రభుత్వ కార్యాలయంగా వినియోగిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సబ్ కమిటీ వెల్లడించింది. అంతిమంగా సంస్థల సమర్థతను పరిగణలోకి తీసుకొని ప్రజలకు ఉపయోగపడుతూనే, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టేలా రుషికొండ ప్యాలెస్ ను వినియోగించేలా నిర్ణయం తీసుకుంటామని సబ్ కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని ఫలక్ నామా ప్యాలెస్ కట్టడాన్ని సహజత్వం కోల్పోకుండా ఏ విధంగా వినియోగిస్తున్నారనే అంశాన్ని ఉదహరించారు.ఈ సందర్భంగా మంత్రులు పయ్యా వుల



కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం రుషికొండపై పర్యాటక శాఖకు అధిక ఆదాయాన్నిచ్చే హరిత రిసార్ట్స్ స్థానంలో విజయ నగర, కళింగ, చోళ, పల్లవ, గజపతి, వేంగి, ఈస్టర్న్ గంగ తదితర పేర్లతో కూడిన 7 బ్లాక్ లతో 19,968 చదరపు మీటర్లలో రాజప్రాసాదం లాంటి ప్యాలెస్ ను నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు.

గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రస్తుతం ప్రతి నెలా 25-30 లక్షల మెయింటెనెన్స్ చార్జీల భారం పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని తీసుకున్నామని త్వరలోనే దీన్ని పర్యాటక శాఖకు ఆదాయం వచ్చేలా, ప్రజలకు కూడా ఉపయోగపడేలా సముచిత నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే టాటా, అట్మోస్పియర్ కోర్, ఐహెచ్ సీఎల్, హెచ్ఈఐ తదితర సంస్థలు ప్యాలెస్ ను ఏ విధంగా వినియోగిస్తే బాగుంటుందో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లిబుచ్చాయని, మరికొన్ని విదేశీ సంస్థలు కూడా అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయన్నారు.

కొన్నింటికి పూర్తిస్థాయి స్పష్టం రావాల్సి ఉందన్నారు. మరో భేటీకి పూర్తి స్పష్టత వస్తుందని అనంతరం రెండు మూడు ప్రతిపాదనలు కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి ఆ తర్వాత సీఎం చంద్రబాబునాయుడు సూచనల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సాధ్యమైనంత త్వరగా మరోసారి భేటీ అయి రుషికొండ ప్యాలెస్ పై కీలక నిర్ణయం తీసుకుంటామని సబ్ కమిటీ పేర్కొంది.సమావేశంలో పర్యాటక శాఖ అధికారులు రుషికొండ ప్యాలెస్ కు సంబంధించిన ప్రజెంటేషన్ ఇచ్చారు.




# పకడ్బందీగా 100 రోజుల కార్యాచరణ

- ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక దృష్టిపెట్టండి
- ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి
- పదో తరగతి ఉత్తీర్ణతలో జిల్లాను అగ్రగామిగా నిలపాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

జిల్లాలో పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి, జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈ నెల ఆరో తేదీన ప్రారంభమైన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈవోలు కూడా వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 187 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులపై ప్రగతి ఆధారంగా ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. కౌన్సెలింగ్‌తో పాటు మోటివేషన్ తరగతులు కూడా నిర్వహించాలన్నారు. జీవితంలో కెరీర్‌తో పాటు ఉన్నతంగా ఎదగడంలో చదువు ప్రాధాన్యతను వివరించాలన్నారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ప్రత్యేక తరగతులతో చేయిపట్టి నడిపించాలన్నారు. ప్రతిరోజు స్లిప్ టెస్ట్‌లు నిర్వహించాలని.. వీటిని విశ్లేషించి ఎక్కడ వెనుకబడి ఉన్నారో పరిశీలించి, ఆయా అంశాల్లో మెరుగుపడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైజింగ్ స్టార్స్.. షైనింగ్ స్టార్స్‌గా ఎదిగేలా చూడాలన్నారు. జిల్లా అకడమిక్ ఫోరం, మండల అకడమిక్ ఫోరం నిరంతర పర్యవేక్షణతో విద్యార్థులు ప్రగతి దిశగా పయనించి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చేయూతనందించాలన్నారు. ఇంటరాక్టివ్ సెషన్స్ కూడా నిర్వహించి.. ప్రగతి సాధనకు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు కృషిచేయాలన్నారు.

ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారి ఉంటారని.. ఈ ప్రత్యేక అధికారి ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శించి, దిశానిర్దేశం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు బంగారు భవిష్యత్తును ఇవ్వాలనే ఉద్దేశంతో అవసరమైన అన్ని వనరులను అందుబాటులో ఉంచుతోందని.. వీటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.సమావేశంలో డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్రశిక్ష అధికారి ఎం.రజనీ కుమారి, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ డీసీవో ఎ.మురళీకృష్ణ, ఎంఈవోలు తదితరులు హాజరయ్యారు.

# కోటి సంతకాల ఉద్యమ ర్యాలీ సూపర్ సక్సెస్

**ఉవ్వెత్తిన ఎగిసిన దక్షిణ శ్రేణుల నిరసన జ్వాల**
**కూటమి సర్కార్ పై మిన్నంటిన ప్రజా వ్యతిరేకత**
**పీపీపీ పేరిట లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి ప్రైవేటుపరం**
**పేదలకు ఉచిత వైద్యం అందకుండా చేయడమే చంద్రబాబు ధ్యేయం**
**విశాఖ దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**



ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం:

జిల్లా వైఎస్ఆర్సిపి నిర్వహించిన కోటి సంతకాల ప్రతుల వ్యాన్ ర్యాలీ ఉద్యమం సూపర్ సక్సెస్ అయిందని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయ కర్త వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. విజయవంతం పట్ల కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అధిక సంఖ్యలో వ్యతిరేకిస్తున్నారనడానికి చిహ్నమన్నారు. ఈ మేరకు 35 వ వార్డు అధ్యక్షులు అలుపున కనక రెడ్డి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణ సక్సెస్ సమావేశంలో వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పీపీపీ పేరిట లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు మొదలుపెట్టిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఉద్దేశపూర్వకంగానే నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలను నిర్లక్ష్యం చేస్తూ వచ్చారని ఆరోపించారు. దీంతో ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందన్నారు. ఆ వ్యతిరేకతను చూపించైనా ప్రైవేటీకరణ నిర్ణయాన్ని అడ్డుకోవాలని వైఎస్ జగన్ భావించారని చెప్పారు.ఇందులో భాగంగానే కోటి సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభమైందన్నారు.ఈ సమయం లోనే తుపాను, వర్షాలు వచ్చాయని, దీంతో ఈ కార్యక్రమం ఫ్లాప్ అవుతుందని కూటమి సర్కార్ సంతోషించిందన్నారు కానీ, ప్రభుత్వ వ్యతిరేక ప్రజాభి ప్రాయం సేకరణ ఏ దశలోనూ ఆగిపోలేదని తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జనం సంతకా లు చేస్తూనే వచ్చారని చెప్పారు.ప్రతి నియోజకవర్గంలోనూ సంతకాల సేకరణ ఉధృతంగా సాగిందన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టాల ని వైఎస్ జగన్ మోహన్రెడ్డి సంకల్పించారని,అదే సమయంలో వైద్య విద్య అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నమూ చేశారని, తాను అధికారం లో ఉండగానే మెడికల్ కాలేజీల నిర్మా ణం పూర్తి అయితే చంద్రబాబు ప్రభుత్వం ఆ క్రెడిట్ ను నాశనం చేయాలని బలంగా నిర్ణయించిందన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు విశాఖలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్య క్రమం విజయవంతమైందన్నారు. సంతకాల ప్రతుల వాహనాన్ని జీవీఎంసీ నుంచి మద్దిలపాలెం వరకు భారీ ర్యాలీగా నిర్వహించడం జరిగిందన్నారు.ఇకపై కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైసిపి ఎండ గడుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి పిలుపుతో తాము ప్రజల పక్షాన పోరాటం చేస్తామని పేర్కొన్నారు.ఇదే తరహాలో.... జగనన్న జన్మదిన వేడుకలు జరగాలికోటి సంతకాల ఉద్యమ ర్యాలీ సక్సెస్ తరహాలో ఈనెల 21వ తేదీన జనహృదయనేత మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు విజయవంతం చేయాలని వాసుపల్లి పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట తప్పని ఏకైక లీడర్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని అన్నారు. అటువంటి నాయకత్వంలో రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. సంచలనాత్మక నిర్ణయాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారన్నారు. పేద , మధ్య అన్ని తరగతుల ప్రజలకు న్యాయం చేసిన ఏకైక పార్టీ వైసీపీ నేనని అన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి రావాలన్న ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ అకుంఠ దీక్షతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వాడ వాడలా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని దక్షిణ నియోజకవర్గ పరిధిలో పలు సేవా కార్యక్రమాలతో పాటు భారీ కేక్ కటింగ్ లు సంబరాలు నిర్వహిస్తామని వాసుపల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియ న్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, దక్షిణ నియోజకవర్గ కార్పొరేటర్లు వార్డు అధ్యక్షులు అను బంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయినముక్కల, దోర్నాల గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

పెద్ద దోర్నాల ప్రజాభూమి



పెద్ద దోర్నాల మండలం అయిన ముక్కుల, దోర్నాల గ్రామాలలో మండల వ్యవసాయశాఖ అధికారి డి.జవహర్ లాల్ నాయక్ ఆధ్వర్యంలో మంగళ వారం పొలం పిలు స్తుంది కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలోమండల వ్యవసాయ శాఖ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ రబీ కాలం లోసాగు చేసిన పప్పు శెనగ మినుము పంటలను సందర్శించి రైతులకు సస్య రక్షణ చెర్యలు గురించి వివరించడం జరిగింది.అలాగే ప్రస్తుతం మినుము పంట లోఆకు ముడత,తెల్ల దోమ పురుగు నివారణకు వేప నూనె 5 ఎం.ఎల్ లీటర్ నీటికి, అసెతమీప్రిడ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి, లేదా ఆసెఫేట్1గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలనీ తెలిపారు. అలాగే రబీ కాలం లో సాగు చేసిన ప్రతి పంట ను గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా పంటను నమో దు చేసుకోవాలని అన్నారు. పొగాకు పంటను ప్రభుత్వం నీసెదము చేయడం జరిగింది కాబట్టి రైతులు పొగాకు పంట ను సాగు చేయరాదాని ప్రత్యేమాన్య పంటలైన మొక్కజొన్న,జొన్న, మినుము,బొబ్బర్లు,శెనగ పంటలు సాగు చేయాలనీ తెలిపారు.ఈ కార్యక్రమం లో వి ఏ ఏ.శివ శైలజ,ఏపీ సిఎన్ఎఫ్ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.



# టీడీపీ నూతన మండల అధ్యక్షులు బాబుకు శుభాకాంక్షలు: సాహితీవేత్త నాసరయ్య

పెద్ద దోర్నాల ప్రజాభూమి



ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం నూతన టీడీపీ మండల అధ్యక్షులు,పూర్వ అధ్యాపకులు షేక్.మహబూబ్ సాహెబ్ కు తమ విద్యార్థి,ప్రముఖ సాహితీవేత్త,కళావేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి గొట్టిముక్కల నాసరయ్య మంగళ వారం మర్యాదపూర్వకముగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా నాసరయ్య మాట్లాడుతూ షేక్. మహబూబ్ టీడీపీ మండల అధ్యక్షులుగా భాద్య తలు నిర్వహిస్తూ ప్రజాసేవలోతనదైన ముద్ర వేస్తున్నారు అన్నారు. విద్యావేత్తగా విద్యా విలువలు సమాజానికిచాటి చెప్పే వ్యక్తిత్వం మాబు అన్నారు.మంచి నాయకుడిగా ప్రజల సమస్యలను దగ్గరుండి తెలుసుకుని పరిస్కారానికి కృషి చేస్తారని,యువతను రాజకీయాలలోకి ప్రోత్సహిస్తూ మార్గనిర్దేశం చేయడంలో ముందుంటారని అన్నారు. పారదర్శకత, నిజాయితీతోకూడిన నాయకత్వం ఆయన ప్రత్యేకత.ప్రజల నమ్మకాన్ని సంపాదించిన ప్రజానాయకుడిగా మండలంలోవిశేష గౌరవం పొంది భవిష్యత్ లోఇంకా ఉన్నత పదవులను అధిరోహించాలని కోరారు.

# అయ్యన్న కుంట బయన్నగూడెంలో ఉచిత వైద్య శిబిరం

పెద్ద దోర్నాల ప్రజాభూమి




పెద్ద దోర్నాల మండలం, కొరపోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అయ్యన్న కుంట బయన్న గూడెంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది.పిల్ల చిన్న పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు బాలింతలకు తదితరులకు వైద్యపరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపించేశారు.ఈ కార్యక్రమంలోవైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూదోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలన్నారు.జ్వరం వచ్చిన వెంటనే వైద్యశాలకు వెళ్లి డాక్టర్ చేత పరీక్షలు చేయించుకుని డాక్టర్ ఇచ్చిన మందులనే వాడాలన్నారు.కాచి చల్లా ర్చిన నీటిని త్రాగాలన్నారు.దోర్నాల మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కందుల ఇజ్రాయేల్ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా కుట్టకుండా దోమల నివారణపై చెంచు గిరిజనులకు అవగాహన కల్పించామన్నారు. వారానికి ఒకశుక్రవారం డ్రమ్ములు,తొట్లు లలోఉన్న నీటిని పారబోసి ఎండబెట్టి వాడుకోవాలన్నారు.ఫ్రైడే డ్రై డే పాటించాలన్నారు.దోమల నివారణ కొరకు నీరు నిల్వ ఉన్న గుంటలలోఆయిల్ బాల్స్ వేసామన్నారు.ప్రతి ఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కొరపోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లక్ష్మీనారాయణ, దోర్నాల మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కందుల ఇజ్రాయేల్ ఎంపీ హెచ్ఏ (ఎం)బి విల్సన్,ఏఎన్ఎం మూగమ్మ,ఆశ మల్లేశ్వరి పాఠశాల విద్యార్థులు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.




# జియోడెటిక్ అసెట్ రిజిస్టర్, రాష్ట్ర జియోడెటిక్ అసెట్ మ్యాప్ ల ఆవిష్కరణ

**కలెక్టరేట్లో ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

కచ్చితమైన పటాల (మ్యాపుల) తయారీకి, సర్వేకు జియోడెటిక్ అసెట్ రిజిస్టర్ ఎంతగానో దోహదపడుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో జియోడెటిక్ అసెట్ రిజిస్టర్, రాష్ట్ర జియోడెటిక్ అసెట్ మ్యాప్ లను సర్వే ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ బీసీ పరిడాతో కలసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ.... జియోడెటిక్ అసెట్ రిజిస్టర్ లో గ్రేట్ ట్రిగ్నోమెట్రికల్ సర్వే స్టేషన్స్ (జి టి ఎస్), గ్రౌండ్ కంట్రోల్ పాయింట్స్ (జి సి పి), స్టాండర్డ్ బెంచ్ మార్క్స్ (ఎస్ బి ఎం), గ్రావిటీ రిఫరెన్స్ స్టేషన్స్, మ్యాగ్నెటిక్ రిపీట్ స్టేషన్స్, టైడల్ అబ్జర్వేటరీస్ వంటి ఆరు అసెట్స్ ఉన్నాయని చెప్పారు. వీటి ద్వారా సర్వే, మ్యాపుల రూపకల్పన మెరుగ్గా చేయవచ్చని చెప్పారు.స్టాండర్డ్ బెంచ్ మార్కుల సహాయంతో అత్యంత కచ్చితత్వంతో (పొజిషన్) స్థానాన్ని చెప్పవచ్చని అన్నారు. సర్వేకు, మ్యాపుల రూపకల్పనకు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి, శాస్త్ర పరిశోధనకు ఈ బెంచ్ మార్కులు దోహదం చేస్తాయని, విపత్తు నిర్వహణలో వీటి పాత్ర కీలకమని అన్నారు.రాష్ట్ర జియోడెటిక్ అసెట్ మ్యాప్ లో రాష్ట్రంలోని జియోడెటిక్ అసెట్ ల సమాచారం ఉందన్నారు. సర్వే, మ్యాపుల రూపకల్పన విషయంలో సర్వే ఆఫ్ ఇండియాకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు.సర్వే ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ బీసీ పరిడా మాట్లాడుతూ.... రాష్ట్రంలో స్వామిత్వ, నక్ష, అమృత్, ఏపీ రీ సర్వే వంటి కీలకమైన ప్రాజెక్టులలో సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. సర్వే ఆఫ్ ఇండియా మొదటిసారిగా తెలుగులో రూపొందించిన రాష్ట్ర పటాన్ని (మ్యాప్ ను)ఈ సందర్భంగా కలెక్టర్ కు అందజేశారు.



## దక్షిణపు వీధిలో అత్యంత వైభవంగా జరుగుతున్న జాతర మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ..



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

ఏలూరు పర్యటనలో భాగంగా దక్షిణపు వీధిలో అత్యంత వైభవంగా జరుగుతున్న దక్షిణపు వీధి త్రిదేవి పీఠం శ్రీ గంగానమ్మ, శ్రీ ఆది మహాలక్ష్మమ్మ, శ్రీ వినుకొండ అంకమ్మ, శ్రీ పోతురాజు స్వామి వార్ల జాతర మహోత్సవానికి సంబర కమిటీ వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఏలూరు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ జాతర మహోత్సవంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాలను సందర్శించడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రజలపై అమ్మవార్ల కృప ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి-సంక్షేమ పథంలో మరింత ముందుకు సాగాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి సమృద్ధిగా ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య చంటి, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్ది బోయిన శివ ప్రసాద్,రాష్ట్ర వడ్డీల సంక్షేమ అభివృద్ధి కార్పోరేషన్ చైర్పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, రాష్ట్ర కమ్మ కార్పోరేషన్ డైరెక్టర్ కావూరి వాణిశ్రీ, జనసేన పార్టీ సీనియర్ నాయకులు నారా శేషు,మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, నగర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు,భారీ సంఖ్యలో భక్తులు,కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీమడోలు పోలీసులు వినూత్న కార్యక్రమం.. బాధితుల ఇళ్లకు స్వయంగా వెళ్లి చోరీ రికవరీ సొత్తు అందజేత



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

జిల్లా పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు.చోరీకిగురయ్యి రికవరీ అయిన సొత్తుని పోలీసు అధికారులు స్వయంగా బాధితుల ఇళ్ల వద్దకు తీసుకెళ్లి అందజేశారు. ఏలూరు జిల్లా భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోరికి గురయి రికవరీ చేసిన 28మొబైల్ ఫోన్లను, రెండు వేర్వేరుచోట్ల చోరీ అయిన 17కాసులు బంగారు, వెండి ఆభరణాలను ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆధ్వర్యంలో సీఐ యూజే విల్సన్, ఎస్ఐ ఎస్కే మదీనా బాషా, సిబ్బందితో కలిసి బాధితుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారికి అందజేశారు. ఈ సందర్భంగా భాదితులు మాట్లాడుతూ రికవరీ సొమ్మును పోలీసులు స్వయంగా ఇళ్లకు వచ్చి అందజేయడం పై హర్షం వ్యక్తం చేసారు. పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.సీఐ విల్సన్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శివ కిషోర్ ఆదేశాల మేరకు బాధితుల వద్దకే రికవరీ సొమ్మును అందజేసే కార్యక్రమం ద్వారా భీమడోలు పిఎస్ పరిధిలో 28 మొబైల్ ఫోన్లు, బంగారు వెండి ఆభరణాలను గ్రామ రెవెన్యూ అధికారులు సమక్షంలో బాధితులకు అందజేసామని బాధితులు సంతోషం వ్యక్తం చేసారని సీఐ పలు వివరాలు వెల్లడించారు.

# డిజిటల్ గోల్డ్ పెట్టుబడులపై జాగ్రత్త

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**

డిజిటల్ బంగారం పేరుతో కొన్ని సంస్థలు స్వీకరిస్తున్న పెట్టుబడుల భద్రతపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సందేహం వ్యక్తం చేశారు. దీనిపై లోక్ సభలో ఎంపీ అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిస్తూ.. సెక్యూరిటీ మార్కెట్ పరిధిలోని పెట్టుబడిదారులకు ఉండే రక్షణ విధానాలు డిజిటల్/ఆన్ లైన్ ప్లాట్ ఫామ్‌లు నిర్వహించే బంగారం పెట్టుబడులకు లేవని తెలిపారు. స్టాక్ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎస్‌సిబిఐ) కూడా వీటికి బాధ్యత వహించదని మంత్రి స్పష్టం చేశారు. 2020 నుంచి ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా డిజిటల్ గోల్డ్ పెట్టుబడులపై జాతీయ వినియోగదారుల సేవాకేంద్రానికి అందిన ఫిర్యాదుల వివరాలపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు స్పందించిన కేంద్ర మంత్రి.. డిజిటల్ గోల్డ్ పై గత ఆరేళ్లలో దేశ వ్యాప్తంగా 371 ఫిర్యాదులు అందాయని, ఈ ఫిర్యాదులు అందిన రాష్ట్రాల్లో మొత్తం 38 ఫిర్యాదులతో ఢిల్లీ మొదటి స్థానంలో ఉండగా 17 ఫిర్యాదులతో ఏపీ 9వ స్థానంలో ఉందని వెల్లడించారు.ఈ డిజిటల్ బంగారం కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించి వ్యక్తుల, సంస్థల వివరాలు ప్రభుత్వం వద్ద లేవని కేంద్ర మంత్రి తెలిపారు. దీనిపై మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భౌతికంగా బంగారంపై పెట్టుబడులకు డిజిటల్ గోల్డ్ ప్రత్యామ్నాయంగా ఎంచుకునే ముందు డిజిటల్ గోల్డ్/ఈ గోల్డ్ అంటూ ఆన్లైన్ ప్లాట్ ఫామ్ లలో వచ్చే ఆఫర్లపై అప్రమత్తంగా ఉండాలని, అటువంటి పెట్టుబడులకు ప్రభుత్వ గ్యారంటీ లేదనే విషయం గుర్తుపెట్టుకోవాలని ప్రజలను కోరారు.

## ఏలూరు ఎంపీ నివాసంలో నారా లోకేష్



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**

ఢిల్లీ పర్యటనలో ఉన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం రాత్రి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నివాసానికి వచ్చారు. లోకేష్ తో పాటు వచ్చిన కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఇతర టీడీపీ ఎంపీలకు పుట్టా మహేష్ కుమార్ తన నివాసంలో డిన్నర్ ఏర్పాటు చేశారు. ఎంపీలందరితో కలిసి కాసేపు సరదాగా గడిపిన లోకేష్ డిన్నర్ ముగిసిన అనంతరం ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, సమస్యలపై ఎంపీలతో చర్చలు జరిపినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత వివిధ సమస్యలపై ఆర్థిక, వాణిజ్య, రైల్వే మంత్రులను కలిసిన విషయాలను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చినట్లు ఎంపీ కార్యాలయ వర్గాలు తెలియచేశాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ మరియు సహచర ఎంపీలు పాల్గొనడం జరిగింది.

# కేంద్రం ఇచ్చే బియ్యానికే పరిమితమైన రేషన్ దుకాణాలు

### కానరాని చంద్రన్న సంక్రాంతి కానుక



**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చౌక డిపోలలో ద్వారా ప్రజలు ఎక్కువ వంట సరుకులుగా వినియోగించే సరుకులను సరఫరా చేస్తారని ఆశించిన ఏపీ ప్రజలకు నిరాశ మిగిలినట్లు అయింది. ప్రతి పండుగకు బియ్యం పంచదారతో పాటు, కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి, దాల్డా ప్యాకెట్లు ఇస్తారని ఆశించిన కేవలం కేంద్రం సరఫరా చేస్తున్న, పంచదార,బియ్యం మాత్రం ఇస్తూ కూటమి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం పట్ల పేద ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో తెలుగుదేశం హయాంలోనే చంద్రన్న సంక్రాంతి, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక పేర్ల తో పైసలు తక్కువ ధరలకు అందించే వారిని ఇప్పుడు ఆ ఊసే లేకపోవడం దురదృష్టకరమని అంటున్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా స్మార్ట్ కార్డులు పేరుతో కార్డులు మారుస్తున్నారు కానీ ప్రజలకు ప్రయోజనం వచ్చే పనులు ఏమి చేయటం లేదని విమర్శిస్తున్నారు. పైగా బంధువులైన ఉద్యోగులతో పేదవారిని కూడా కలిపేసి వారికి ప్రభుత్వ . రాయితీలు లేకుండా చేస్తున్నారని మరికొందరు విమర్శిస్తున్నారు. కావున ఎప్పటికైనా తప్పు సరిదిద్దుకుని కనీసం రాబోయే పండుగలు అయిన క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు అయినపై నిత్యవసర సరుకులను రాయితీదారులకు పేద ప్రజలకు అందజేయాలని కోరుతున్నారు.

## అభయాంజనేయ స్వామి సన్నిధిలో అన్నదానం



**ప్రజాభూమిప్రతినిధి-పెదపాడు**

ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, అప్పన వీడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానంలో 350 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు దేవస్థానం ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. హనుమాన్ జంక్షన్ వాస్తవ్యులు రామిరెడ్డి నాగేశ్వర రెడ్డి,లక్ష్మీ దంపతులు ధన సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఈవో తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, ధర్మకర్త మండలి సభ్యులు, మూల్పూరి గోపీచంద్, అక్కప్రోలు సునీత ,ఆలయ సిబ్బంది, సేవా బృంద సభ్యులు పాల్గొని సేవలు అందించారు.

## జాతర మహోత్సవం నాటికి సిద్ధమవుతున్న మాణిక్యాలమ్మ అమ్మవారి ఆలయం



**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం గగ్గిపర్రు గ్రామంలో వేంచేసి ఉన్న మాణిక్యాలమ్మ అమ్మవారి దేవాలయం నిర్మాణం సంక్రాంతి పండుగలో జరుపుకునే జాతర మహోత్సవం సమయానికి పూర్తయ్యే విధంగా గ్రామ పెద్దలు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామం ఏర్పడినప్పుడు నుంచి అనగా దశాబ్దాలు కాలం నుండి కూడా అమ్మవారిని వేపచెట్టు వద్దనే పూజలు నిర్వహించేవారు. అక్కడే వేప చెట్టును తొలగించకుండా వేప చెట్టు చుట్టూ స్లాబ్ ను వేసి ఆలయ నిర్మాణం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చేపట్టారు.ఈఏడు సంక్రాంతి పెద్ద పండుగ రోజున జరిగే కోరిన కోర్కెలు తీర్చే చల్లని అమ్మ మాణిక్యాల అమ్మ వారి జాతర మహోత్సవం నూతన ఆలయంలో జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు.

# సెమి క్రిస్మస్ సందర్భంగా వృద్ధులకు సహాయం

**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**




సెమి క్రిస్మస్‌ను పురస్కరించుకొని ఆగిరిపల్లి మండలం నరసింగపాలెం గ్రామంలో మనోజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ పొదిలి బాబు ఆధ్వర్యంలో, ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్ పాల్గొని వృద్ధులు, వితంతువులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాంతి, సమాధానాలపై బైబిల్‌లోని కొన్ని వాక్యాల ద్వారా వారికి ప్రోత్సాహం అందించారు. అలాగే సమాజంలో నెలకొన్న పరిస్థితులపై మాట్లాడి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ క్షేమం, వృద్ధుల సంక్షేమం కోసం ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే పీటర్సన్, విజయ్, వి జాన్ వెస్లీ పాల్గొన్నారు.

# వందే భారత్ రైలు పాలకొల్లు రైల్వే స్టేషన్ హాల్ట్ ఉండాలి

### వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



వందే భారత్ రైలు పాలకొల్లు రైల్వే స్టేషన్లో ఆగక పోవడం విచారకరం. ఎందుకంటే., అటూ తూర్పుగోదావరి జిల్లా అమలాపురం, రాజోలు, మలికిపురం మరియు ఇటూ ఆచంట నియోజకవర్గ ప్రాంత ప్రజలకు సెంటర్ పాయింట్ పాలకొల్లు రైల్వే స్టేషన్..అలాంటి పాలకొల్లు రైల్వే స్టేషన్ లో వందే బారత్ రైలు ఆగాలని వైయస్సార్ కాంగ్రెసు పార్టీ తరుపున జోగాడ ఉమామహేశ్వర రావు డిమాండ్ చేశారు.

పాలకొల్లు,ఆచంట అమలాపురం, రాజోలు నియోజకవర్గ ప్రజలు దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేయాలంటే విజయవాడ లేదా రాజమండ్రి వెళ్ళి ఆయా స్టేషన్ లు నుండి వెళ్ళేందుకు ఎంతో ఇబ్బందికరంగా ఉందని.. కనీసం ఈ వందే బారత్ రైలు పాలకొల్లు రైల్వే స్టేషన్‌లో హాల్ట్ అయితే, ప్రయాణికుల సౌకర్యార్థంతో పాటు పాలకొల్లు అభివృద్ధి జరిగేందుకు అవకాశం ఉంటుందని, కావున పాలకొల్లు కు చెందిన మంత్రి నిమ్మల రామానాయుడు ఈ వందే బారత్ రైలు హాల్ట్ విషయంలో పాలకొల్లు రైల్వే స్టేషన్ లో ఆగేలా కృషి చేయాలని.. అలాగే నర్సాపురం పార్లమెంటు సభ్యులైన కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ జోగాడ కోరారు.

# ఏలూరు జిల్లా పురావస్తు మ్యూజియంను ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్

### కేంద్రంతో చర్చించి ఏలూరుకు సంగీతం నృత్య కళాశాల మంజూరుకు కృషి చేస్తానని హామీ

**ప్రజా భూమి జిల్లా ప్రతినిధి- ఏలూరు**

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో చర్చించి ఏలూరుకు సంగీత నృత్య కళాశాల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. రూ. 5.25 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఏలూరు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా పురావస్తు ప్రదర్శనశాలను మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం జిల్లా పురావస్తు మ్యూజియంలోని డిజిటల్ బుక్ రూమ్ ను, స్కల్ప్చర్ గ్యాలరీని సందర్శించారు. అధునాతన టెక్నాలజీతో రూపొందించిన డిజిటల్ బుక్ లో ప్రతి పేజీలోని ఇమేజిని తాకితే ప్రత్యక్ష అనుభూతిని పొందడం ఆశ్చర్యంగా ఉందని ఆసక్తిగా తిలకించారు. అదే విధంగా కాంస్య కళతో రూపొందించిన శ్రీరామ, లక్ష్మీనారాయణ, గరుడ, వైష్ణవ, మావటి విగ్రహాలను తిలకించారు. భారతీయ జీవితాన్ని, ఆలోచనలు ప్రతిబింబింప చేసిన హిందూ, జైన, బౌద్ధ మతాలకు సంబంధించిన బుద్ధుడు, జైన తీర్థంకరులు, విష్ణువు వెంకటేశ్వరుడు, ఆల్వార్లు, శ్రీదేవి, భూదేవి, నటరాజ కాంస్య శిల్పాలను పరిశీలించారు. నాటి కాలానికి సంబంధించిన శిరస్త్రాణం, ఖడ్గములు, డాలు, ఆయుధాలు, కవచాలను చూసారు. తొలి చారిత్రక యుగపు మృణ్మయ పాత్రలు, బృహత్ శిలాయుగం నాటి సమాధులు, జీవన విధానాలను తెలిపే చిత్రాలను, ప్రాచీన, మధ్య, నవీన శిలాయుగాల నాటి పరికరాలను, ఆది మానవుడిని మొదలుకొని నేటి మానవ వికాస దశలను, రుద్రమకోట బృహ శిలాయుగ సమాధులను పరిశీలించారు. అదే విధంగా తూర్పు చాళుక్యులు, తుగ్లక్, విజయనగర వంశం, శాలం కాయనుల, శాతవాహన, సదవంశం, విద్ధంక, కురరాజవంశ, ఈస్ట్ ఇండియా, పోర్చుగీస్, ట్రావెన్ కోర్ సంస్థానం, బ్రిటిష్ ఇండియా, ఇండో ఫ్రెంచి, సుమత్రా దీవి, హెల్కర్, బహుమనీ, గోల్కొండ సుల్తానులు, మధురై నాయక వంశం, మరాఠా సామ్రాజ్యం, అసబ్ జాహీ కాలం నాటి నాణేలు, పంచలోహ విగ్రహాలు, శిలాజాలు, తాళపత్ర గ్రంధాలు, తామ్ర శాసనాలు, ఖురాన్ చేతి ప్రతి గ్రంధాలు పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ హేలాపురిగా కీర్తి పొందిన ఏలూరు చరిత్రను వివరించారు. భావితరాలకు ప్రాచీన సంస్కృతిని తెలిపేది పురావస్తు శాఖ అన్నారు. మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి అంకురార్పణ చేసిన మ్యూజియాన్ని నేటి ఎమ్మెల్యే బడేటి చంటి పూర్తి చేయడం ఆనందం గా ఉందన్నారు. ప్రపంచం నలుమూలల రాష్ట్ర గొప్పతనాన్ని తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేయడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. దాదాపు 10 లక్షల సంవత్సరాలనుండి 1000 సంవత్సరాల వరకు ఉన్న ప్రతి పరికరాన్ని మ్యూజియంలో భద్రపరిచారన్నారు. పోలవరం సమీపంలోని రుద్రమకోట వద్ద తవ్వకాల్లో లభ్యమైన అరుదైన మట్టి బొమ్మలు, తాబేలు పూసలు ప్రదర్శించడం మరొక ప్రత్యేకత అన్నారు.

సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో చరిత్ర, సాంప్రదాయ సిద్ధమైన కళా, సాంస్కృతిక వైభవానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. గత ప్రభుత్వం కళలను, కళాకారులను పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కవులు, కళలు, కళాకారులను గౌరవించి ఉగాది పురస్కారాలు, నాటక రంగ దినోత్సవం సందర్భంగా కందుకూరి రంగస్థల, విశిష్ట పురస్కారాలు అందజేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర కళా, సాంస్కృతిక వైభవాన్ని ముందు తరాలకు తెలిసేలా, ప్రజా బాహుళ్యం లోకి వెళ్లేలా విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అదే విధంగా పలు అకాడమీలకు లబ్ధ ప్రతిష్టులైన, చైర్మన్‌లను, డైరెక్టర్లను నియమించడం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు. ఏపీలోని రాజమహేంద్రవరానికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా విభాగాన్ని కేటాయించాలన్న విజ్ఞప్తికి కేంద్రం సూత్రప్రాయ అంగీకారం తెలిపిందని మంత్రి దుర్గేష్ అన్నారు. అదే విధంగా పలువురు విజ్ఞప్తి మేరకు ఆర్కియాలజీ మ్యూజియంకు సంపూర్ణ సహకారం అందిస్తామని, 3వ అంతస్తు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు.



తాను ఇటీవల లండన్ పర్యటనకు వెళ్ళినప్పుడు నేషనల్ థియేటర్ ను సందర్శించానని, నేటికీ అక్కడ మన కళలకు ప్రాధాన్యత ఉందని మంత్రి దుర్గేష్ గుర్తు చేశారు. అదే విధంగా లండన్ మ్యూజియం విశేషాలు తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో, సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందిన నేపథ్యంలో భావి తరాలకు వారసత్వ సంపదగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర కళా, సాంస్కృతిక వైభవానికి రాబోయే రోజుల్లో సంపూర్ణ సహకరం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రాచీన చరిత్రకారులు, ఏలూరు వాసి కావలి బుర్రయ్యను స్మరించుకున్నారు. ప్రతి ఒక్కరూ మ్యూజియంను సందర్శించి నాటి వైభవాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగర మేయర్ నూర్జహాన్ బేగం, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డప్పల నాయుడు, కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, స్థానిక మార్కెట్ యార్డ్ చైర్మన్, ఇడా చైర్మన్, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, ప్రముఖ చరిత్ర కారులు అయ్యంగార్, ఆర్కియాలజీ అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలపై వైసీపీది దుష్ప్రచారమే...

## టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

కొత్తపేట - మెడికల్ కాలేజీల నిర్మాణ అంశంపై వైసీపీ పార్టీ చేస్తున్న ప్రచారం పూర్తిగా దుష్ప్రచారమేనని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి ఆరోపించారు. కోటి సంతకాల కార్యక్రమానికి హడావుడి తప్ప ప్రజాస్పందనే లేదని స్పష్టం చేశారు. పీపీపీ విధానంపై వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 50 శాతం సీట్లు ప్రైవేట్ కోటాకు కేటాయించిన జీఓలు (107, 108,133) విడుదల చేసింది జగన్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రాష్ట్ర నిధుల నుంచి రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ఖర్చయిన రూ.1550 కోట్లు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులేనని తెలిపారు. నాలుగేళ్ల జగన్ పాలనలో కేవలం 18 శాతం నిర్మాణాలే పూర్తయ్యాయని, ఈ జాప్యం వల్ల 1750 ఎంబీబీఎస్, పీజీ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పీపీపీ విధానంతో ప్రభుత్వ కోటాలో 110 అదనపు సీట్లు, ప్రైవేట్ కోటాలో మరో 110 సీట్లు కలిపి మొత్తం 220 సీట్లు రాష్ట్ర విద్యార్థులకు లభిస్తాయనేది వాస్తవమని అన్నారు. పీపీపీ విధానంలో కూడా 50 శాతం సీట్లు ప్రభుత్వ కోటాలోనే, ప్రభుత్వ ఫీజుతోనే భర్తీ అవుతాయని స్పష్టం చేశారు. రాబోయే రెండేళ్లలో కాలేజీల నిర్మాణాలు పూర్తయ్యి 1750 సీట్లు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కర్నాటక సహా పలు రాష్ట్రాల్లో పీపీపీ విధానం విజయవంతంగా అమలవుతోందని, గతంలో చంద్రబాబు పాలనలో జేగురుపాడు విద్యుత్ ప్లాంట్లు పీపీపీ విధానంలో నిర్మించి, కాలపరిమితి అనంతరం ప్రభుత్వానికి చేరాయని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వమే గంగవరం పోర్టును ప్రైవేటుకు అప్పగించిందని, విశాఖ స్టీల్ భూముల విక్రయానికి అంగీకరించిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వ విధ్వంస పాలన కారణంగానే నేటి కూటమి ప్రభుత్వం నిధుల కొరతను ఎదుర్కొంటోందన్నారు. 1995-2004 మధ్య చంద్రబాబు ప్రభుత్వం జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, రెవెన్యూ డివిజన్‌కు ఒక ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయడం వల్లే నేడు రాష్ట్రంలో వైద్యుల కొరత లేదని తెలిపారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం వైద్య ఆరోగ్య ప్రమాణాల్లో చంద్రబాబు పాలనలో ఏపీ 4వ స్థానంలో, జగన్ పాలనలో 10వ స్థానానికి దిగజారిందని పేర్కొన్నారు. చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఏర్పాటు చేయలేదన్న వైసీపీ ప్రచారం పచ్చి అబద్ధమని, ఎన్టీఆర్, చంద్రబాబు పాలనల్లో ఉమ్మడి రాష్ట్రంతో కలిపి 28 మెడికల్ కాలేజీలు స్థాపించారని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీల పేరుతో వైసీపీ చేస్తున్న రాజకీయ ప్రచారాన్ని ప్రజలు నమ్మరని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బూసి భాస్కరరావు, పల్లి ఏసు, కడలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మా గ్రామాన్ని 41 కాంటూర్లో చేర్చండి

- మా భూములకు పంట నష్టపరిహారం అందించండి
- మా భూములపై సబ్సిడీ విత్తనాలు ఎరువులు వ్యవసాయ సామగ్రి అందించే విధంగా చూడాలి




ప్రజాభూమి ప్రతినిధి -కునవరం

మండలం ముల్లూరు గ్రామస్తులు ధవలేశ్వరంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు కార్యాలయానికి వెళ్లి ముంపు పరిధిలో ఉన్న ముల్లూరు గ్రామంలో సుమారు 200 కుటుంబాలు ఉంటాయి మాగ్రామానికి 2009 సంవత్సరంలో ఒక ఎకరం భూమికి ఒక లక్ష 15 వేల రూపాయలు ఇచ్చారు. అప్పటి నుండి ఇప్పటి వరకు మా ముల్లూరు గ్రామానికి ఆర్ అండ ఆర్ గానీ ఇంటి విలువ కట్టలేదు,మా గ్రామం ప్రతి సంవత్సరం వరదలకి సాగు చేసుకునే భూములు గ్రామం మొత్తం మునిగిపోతుంది, ప్రభుత్వం ద్వారా ఏ నష్టపరిహారం ఇవ్వడం లేదు, వ్యవసాయానికి సంబంధించిన పంట నష్టం వ్యవసాయ పనిముట్లు ఆ భూములపై బ్యాంకు లోన్ ఎరువులు విత్తనాలు నష్టపరిహారం ఏమీ రావడం లేదు అధికారులను అడగగా మీకు వ్యవసాయ భూములకు ప్యాకేజీ ఇచ్చారు కనుక అవి ప్రభుత్వ భూములు కనుక మీకు ప్రభుత్వం నుండి ఎటువంటి పరిహారం రావు అని చెప్పడం జరిగింది అలాగే 2022 గోదావరి వరదలో ఊరు మొత్తం మునిగిపోయి పంట భూములు మునిగిపోయి పంట నష్టం జరిగిన మాకు నష్టపరిహారం ఇవ్వలేదు ఈ సంవత్సరం కూడా నాలుగైదు సార్లు గోదారి వరదలు వచ్చి పంట నష్టపోయాము ఇప్పటివరకు కూడా వ్యవసాయం చేసే పరిస్థితి లేదు వెంటనే మీరు స్పందించి మా గ్రామాన్ని 41 కార్టూన్ లో కలిపి మా గ్రామానికి స్టెక్కర్ వాల్యుయేషన్ ఆర్ అండ్ ఆర్ 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పునరావాసం కల్పించి మమ్మల్ని మా ఇంటి నిర్మాణానికి స్థలం కేటాయించి మమ్మల్ని ఇక్కడ నుంచి తరలించాలని గ్రామస్తులం పోలవరం ప్రాజెక్టు ఇరిగేషన్ అధికారకి డిప్యూటీ తాసిల్దార్ శశిధర్ కి మెమొరాండం ఇవ్వడం జరిగింది దీనికి వారు స్పందించి పై అధికారులతో మాట్లాడి మీకు న్యాయం జరిగేలా చేస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు మండలంలోని ముల్లూరు సుమారు 30 కుటుంబాలు వారు పాల్గొన్నారు.

## లక్ష్మీ నారాయణని సన్మానించిన సత్తి.వెంకట రత్నం



ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

అమరావతిలో పిసరీస్ స్టేట్ డైరెక్టర్గా నియమితులైన ఉప్పలగుప్తం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దేశంశెట్టి లక్ష్మీనారాయణని మంగళ వారం ఘనంగా సన్మానించిన సవరపాలెం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నీటిసంఘం మాజీఉపాధ్యక్షులు సత్తి వెంకట రత్నం,(శ్రీను బాబు) శుభాకాంక్షలు తెలిపారు

## బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాభూమి ప్రతినిధి-ఉప్పలగుప్తం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండల పరిధిలో ఉప్పలగుప్తం మండలం టి.చల్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో న్యూ11 కెవి ఆర్ డి ఎస్ ఎస్ పీడర్ వర్క్ జరుగుతున్నందున మండలంలోని బుధవారం టి.చల్లపల్లి, ఎస్.యానం, వాసాలతిప్ప, నక్కరా మేశ్వరం, గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే,రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

# సబ్సిడీ రుణాలకు ఉద్యం ఆధార్ తప్పనిసరి



ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు

కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల సబ్సిడీ రుణాలను పొందాలంటే ఉద్యం ఆధార్ తప్పనిసరి అని ఏపిఎం టి. రాము ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కాజులూరు స్త్రీ శక్తి కార్యాలయంలో డ్వాక్రా మహిళల గ్రూపు సభ్యులకు ఉద్యం ఆధార్ రిజిస్ట్రేషన్‌ను జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పరిశ్రమల శాఖ సంయుక్తంగా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా ఏపిఎం రాము మాట్లాడుతూ, చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఉద్యమ్ ఆధార్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉన్నవారికి బ్యాంకుల ద్వారా సులభంగా రుణాలు, తక్కువ వడ్డీ రేట్లతో సబ్సిడీలు, ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత లభిస్తుందని వివరించారు. డ్వాక్రా మహిళలు చిన్న వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు, ఉపాధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు ఉద్యం ఆధార్ ఒక ముఖ్యమైన ఆధారమని ఆయన సూచించారు. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని మహిళలు ముందుకు వచ్చి తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు సురేష్, జ్యోతి, డ్వాక్రా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్ 90 మంది చేసుకున్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించినందుకు అధికారులకు, సిబ్బందికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విధమైన అవగాహన కార్యక్రమాలు మహిళల ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## బిజెపి జిల్లా యువమోర్చ అధ్యక్షులుగా కళ్యాణ్

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

భారతీయ జనతా యువ మోర్చా అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడుగా రామచంద్రపురం నియోజకవర్గ పట్టణానికి చెందిన గాణాల కళ్యాణ్ నియామితులయ్యారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్,యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి,జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆదేశాల మేరకు కళ్యాణ్ ను బీజేపీ యువజన విభాగనికి అధ్యక్షుడుగా నియమించారు. ఈ విషయం పై కళ్యాణ్ స్పందిస్తూ,తనకీ బాధ్యతలను అందించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ, రానున్న రోజుల్లో రాజకీయాల్లో యువత పాత్ర చాలా కీలకం అని,యువత రాజకీయాల్లో కూడా విశృతం గా పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రస్తుతం నడుస్తున్న ఎన్.డి.ఎ కూటమి ప్రభుత్వం యువతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా అడుగులు వేస్తుందని. యువతకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని



తెలియచేసారు. కళ్యాణ్ కు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల ఆపార్టీ జిల్లా శ్రేణులు హర్షం వ్యక్తం చేసారు.

# పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌తో నీటమునిగిన లంకపోగాకు చేలు

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం



పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ప్రభావంతో గోదావరి శబరి నది పరివాహంలో రైతులు పండించుకుంటున్న పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. ఈ ఏడాది రైతులకు గడ్డు కాలమనే చెప్పవచ్చు ఎందుకంటే అధిక వర్షాలు పడటంతో గోదావరి శబరి నదులు ఎగువ ప్రాంతాల్లో కూడా అధిక వర్షాలు పడటంతో రెండు జీవ నదులు పొంగి ప్రవహించాయి. దీంతో విలీన నాలుగు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాగే విలీన మండలాల రైతులు కూడా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు, పంటలు అదును తప్పిపోయి ఏ పంటలు వేయటానికి అనుకూలంలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు వరదలు తగ్గాయి కదా అని ఏదో ఒచ్చిన కాడకే దక్కుతాయి అని పంటలు వేసుకున్న రైతులకు మరో చేదు అనుభవం ఎదురైంది. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల గోదావరి శబరి నదులు ఎగపోటు తో గోదావరి శబరి నది పరివాహంలో రైతులు పండించుకుంటున్నా లంక పొగాకు చేలు అన్ని నీట మునిగి రైతులను తీవ్ర నష్టానికి గురిచేశాయి. అసలే కాలమంతా అయిపోయింది ఏ పంటలు వేద్దామన్న రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు లంక పొగాకు సాగును చేస్తుండగా ఏదో కవులు మందమైనా వస్తుందన్న ఇది తో సాగు చేస్తున్న రైతులకు ఈ గోదావరి బ్యాక్ వాటర్ తో, లక్షలాది రూపాయలు వేచించి పండిస్తున్న పంటలు కాస్త నీట పునగటంతో రైతులు తలలు పట్టుకొని కూర్చున్నారు.

ప్రభుత్వం, జిల్లా ఉన్నత అధికారులు, రంపచోడవరం ఎమ్మెల్యే స్పందించి బాధిత రైతుల కష్టాలను గుర్తించి, గోదావరి నది ఎగిపోటుతో నష్టపోయిన రైతులను ఆదుకుంటారేమోనని బాధిత రైతులు ఎదురుచూస్తున్నారు. రైతుల దీన పరిస్థితిని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ మంగళవారం పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల నీటమునిగిన లంక పోగాకు చేలను ఆయన స్వయంగా పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న వారి సమస్యలను ఆయన అడిగితెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న వారి సమస్యలను, ఐటిడిఏ పీఓ, కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లి, రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని నరేష్ కుమార్ అన్నారు.

## వాడపల్లి ట్రస్ట్ మహిళా సభ్యులకు సన్మానం



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

కొత్తపేట - కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ సభ్యురాలు పెండ్యాల భవాని, మందపల్లి దేవస్థానం ట్రస్ట్ సభ్యురాలు చిలకమర్తి అనంతలక్ష్మి సావిత్రిలను కొత్తపేట బ్రాహ్మణ మహిళా మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు ముందుగా వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని, అనంతరం కొత్తపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సాధికార సమితి కన్వీనర్ చిలకమర్తి శ్రీనివాస్ నివాసానికి విచ్చేశారు. ట్రస్ట్ సభ్యురాలిగా నియమితులైన సందర్భంగా పెండ్యాల భవానిని, అలాగే అనంతలక్ష్మి, సావిత్రిని మహిళా సంఘ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట గాయత్రి మహిళా సంఘ అధ్యక్షురాలు కొంపెల్ల పద్మ, వేమవరపు జయలక్ష్మి, కడియాల కుమారి, చిర్రావూరి పార్వతి, కందుకూరి శారద, ఇరగవరపు సుధా, పోచిరాజు భాస్కరం తదితరులు పాల్గొని పూలమాలలు, దుశ్శాలువలతో వారిని సత్కరించారు. ట్రస్ట్ సభ్యులుగా దేవస్థానాల అభివృద్ధికి వారు సేవలందించాలని ఆకాంక్షించారు.

## గోపవరంలో అంగన్వాడీ కేంద్రం తనిఖీ




ప్రజాభూమి ప్రతినిధి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం మండలం గోపవరం గ్రామంలో ఉన్న 138 అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో డి, కృష్ణ తో గ్రామ సర్పంచ్ కుంచే బుల్లెయ్య కలసి మంగళవారం సందర్శిం చారు. ఈ సెంటర్‌కి సెంట్రల్ గవర్నమెంట్ స్కీమ్ ద్వారా పోషణ వాటికి కింద సెంటర్ దగ్గర ఆర్గానిక్ కూరగాయలు పెంపకం, మరియు అంగన్వాడీ కేంద్రాలకు పెయింటింగ్ వేయడం, పిల్లలుకి టీవీ తో ఆటపాటలుతో విద్యను అందించడం అంగన్వా డీని బలోపేతం చేయడం అనే కార్యక్రమం చేపడుతున్నారు. ఈ పోషణ వాటికప్రోగ్రాము ఉప్పలగుప్తం మండలలో 7 కేంద్రాలకు సెంక్షన్ అయ్యిందని. ఎంపీడీఓ కృష్ణ సెంటర్ పిల్లలతో అంకెలు, ఏ బి సి డి లు ఇంగ్లీష్ నెలలు, పాటలు పద్యాలు చెప్పించి సంతృప్తి చెందారు. వీరితో పాటు ఐసీడీఏస్ సూపర్ వైజర్ బి, ప్రసన్న రాణి, టీచర్ కే. బేబీకుమారి హెల్పర్ కే. భారతీదేవి పంచాయతీ కార్యదర్శి డి, బాల బాలాజీ, గ్రామ నాయకులు కుంచే బాబులు, ధోనిపాటి పరమేశ్వరావు పాల్గొన్నారు.

## తిల చిత్ర యూనిట్‌కు ఘనంగా సత్కారం



ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

కోనసీమ పరిసర ప్రాంతాల్లో గత 14 రోజులుగా తిల సినిమా షూటింగ్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా నూతన తిల చిత్ర యూనిట్‌ను సర్పంచుల ఆధ్వర్యంలో హీరో జై,హీరోయిన్ శరణ్య ను సేవారత్న కరాటం ప్రవీణ్, సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు, చిత్ర బృందాన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్య క్రమంలో కెమెరామెన్ క్రాంతి నీలం, ప్రియా, వేములూర్ రాజశేఖర్, జర్నలిస్ట్ త్రిమూర్తులు,రత్నవాణి,కె మనోహర్, వై. వరప్రసాద్ తదితరులు పాల్గొని ఘనంగా సత్కరించారు.

## ఉత్సాహంగా మోడరన్ ప్రైమరీ విద్యార్థుల విజ్ఞానయాత్ర




ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

ప్రతీ అకాడమిక్ ఇయర్ నందు నిర్వహించే విజ్ఞానయాత్రలో భాగంగా ఏబీసీ మోడరన్ ప్రైమరీ విద్యార్థులు మంగళవారం కడియం నర్సరీలు,ధవళేశ్వరం బ్రిడ్జి,కాటన్ బ్యారేజ్, గోదావరి నది పరివాహక ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ ఎ. రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేయకుండా ప్రతి అకాడమిక్ ఇయర్ వివిధ ప్రాంతాలకు ఫీల్డ్ ట్రిప్ ద్వారా తీసుకుని వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విధమైన విజ్ఞాన యాత్రల ద్వారా విద్యార్థుల్లో కుతూహలం, ఆసక్తి పెరిగి అభ్యాసన ప్రక్రియ మరింత మెరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్టాప్,విద్యార్థులు పాల్గొన్నారు.

# ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్లకు 5జి మొబైల్ ఫోన్ల పంపిణీ

- ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్లకు 5జి మొబైల్ ఫోన్ల పంపిణీ, ప్రమోషన్ పత్రాల అందజేత
- మహిళా-శిశు సంక్షేమ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు - హరీష్ బాబు.
- గ్రామీణ స్థాయిలో అంగన్వాడీ వర్కర్లే ప్రభుత్వ బలం - హరీష్ బాబు

ప్రజా భూమి, ధర్మవరం




ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్లకు 5జి మొబైల్ ఫోన్లను పంపిణీ, అలాగే మినీ అంగన్వాడీ వర్కర్లకు మెయిన్ అంగన్వాడీ వర్కర్లుగా లభించిన ప్రమోషన్ పత్రాలు అందించే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మంత్రి కార్యాలయం ఇన్చార్జ్ హరీష్ బాబు పాల్గొని స్వయంగా అంగన్వాడీ వర్కర్లకు 5జి మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. అలాగే మినీ అంగన్వాడీ వర్కర్లకు మెయిన్ అంగన్వాడీ వర్కర్లుగా లభించిన ప్రమోషన్ పత్రాలను ఆయన తమ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, అంగన్వాడీ వర్కర్లు గ్రామీణ స్థాయిలో ప్రభుత్వానికి కీలకమైన సేవలను అందిస్తున్నారని, వారి కృషి వల్లే మహిళా-శిశు సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేరుతున్నాయని అన్నారు. మహిళా-శిశు సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటూ ప్రజా సంక్షేమ పాలనకు నాంది పలుకుతోందని హరీష్ బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు పనిచేస్తున్న మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్గ్రేడ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ నిర్ణయంతో ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడి, సేవల పరిధి విస్తరించనుందని అన్నారు. గర్భిణీ మహిళలు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన పోషణ, ఆరోగ్య సేవలు అందడంతో పాటు ప్రభుత్వ పథకాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందని వివరించారు. అదేవిధంగా, ఇప్పటివరకు సేవలందిస్తున్న మినీ అంగన్వాడీ వర్కర్లకు మెయిన్ అంగన్వాడీ వర్కర్లుగా ప్రమోషన్లు కల్పించడం ద్వారా వారి సేవలకు తగిన గుర్తింపు లభించిందని హరీష్ బాబు తెలిపారు. ఈ ప్రమోషన్లతో వర్కర్ల ఆత్మవిశ్వాసం పెరిగి, మరింత బాధ్యతాయుతంగా, నిబద్ధతతో ప్రజలకు సేవలందించేందుకు ప్రోత్సాహం కలుగుతుందని అన్నారు. డిజిటల్ యుగానికి అనుగుణంగా అంగన్వాడీ వ్యవస్థను ఆధునీకరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే అంగన్వాడీ వర్కర్లకు మొబైల్ ఫోన్లను అందజేస్తోందని పేర్కొన్నారు. ఈ మొబైల్ ఫోన్ల ద్వారా పిల్లల ఆరోగ్య వివరాలు, పోషణ సమాచారం, గర్భిణీ మహిళల రికార్డులు, ప్రభుత్వ పథకాల అమలు వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడంతో పాటు అధికారులతో వేగంగా సమన్వయం చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. అంగన్వాడీ వర్కర్ల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్తులో కూడా వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు.

# ధర్మవరం ఖ్యాతిని దేశమంతా చూసేలా చేశారు

- తోలుబొమ్మల కళాకారిణి డి.శివమ్మకు పరిటాల సునీత, శ్రీరామ్ అభినందనలు
- రాష్ట్రపతి చేతుల మీదుగా "శిల్పగురు" అవార్డును అందుకున్న శివమ్మ
- క్యాంపు కార్యాలయంలో శివమ్మను సత్కరించిన పరిటాల సునీత, శ్రీరామ్

ప్రజాభూమి, ధర్మవరం



తోలుబొమ్మల కళాకారిణి డి.శివమ్మ ధర్మవరం ఖ్యాతిని దేశమంతా తెలుసుకునేలా చేశారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం మండలం, నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారిణి డి.శివమ్మ ప్రఖ్యాత జాతీయ"శిల్పగురు" అవార్డును అందుకున్నారు. 2025, డిసెంబర్ 9వ తేదీన న్యూఢిల్లీ లోని, విజ్ఞాన్ భవన్ లో జరిగిన హస్తకళల జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో శివమ్మ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో పరిటాల శ్రీరామ్, పరిటాల సునీత అనంతపురం క్యాంప్ కార్యాలయంలో శివమ్మని సత్కరించారు. స్థానిక నాయకులతో కలిసి శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తోలుబొమ్మలాట అన్నది మన సంస్కృతిలో ఒక భాగం అన్నారు. అయితే కాలక్రమంలో ఈ కళ అంతరించిపోయే ప్రమాదంలో పడిందన్నారు. ఇలాంటి సమయంలో నిమ్మలకుంట వాసులు ఈ కళను మళ్లీ బ్రతికించి ప్రాణం పోశారన్నారు. వంశపారంపర్యంగా దీనిని ఆదాయ వనరుగా చూడకుండా వారు కొనసాగించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే తోలుబొమ్మలాటకు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చారన్నారు. ఇప్పుడు శివమ్మ ప్రతిష్టాత్మకమైన శిల్ప గురు అవార్డు అందుకోవడం ధర్మవరం ప్రాంతానికి గర్వకారణంగా ఉందన్నారు....

# రాష్ట్రస్థాయిలో మెరిసిన దొరిగల్లు విద్యార్థి

## - జాతీయస్థాయికి ఎంపిక

ప్రజాభూమి, సత్యసాయి



ముదిగుబ్బ మండలం దొరిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపిక కావడం పాఠశాలలో హర్షాతిరేకాలకు దారి తీసింది. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసన కాంపిటీషన్స్లో భాగంగా 8వ తరగతి విద్యార్థి మంగళ కార్తికేయ సత్యసాయి జిల్లా నుంచి సబ్జూనియర్ బాయ్స్ విభాగంలో ఆర్టిస్టిక్ ఫెయిర్ కేటగిరీలో పోటీపడి రెండవ స్థానం సాధించాడు. ఈ విజయం ద్వారా మంగళకార్తికేయ త్వరలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న యోగాసన పోటీల్లో పాల్గొనబోతున్నట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు.



గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ఈ స్థాయిలో రాణించడం పాఠశాలకే కాదు, మండలానికే గర్వకారణంగా నిలిచిందని ఎంఈఓ లు రమణప్ప, వెంకటాచలపతి, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయ బృందం కార్తికేయను ఘనంగా అభినందించారు. జాతీయస్థాయిలో కూడా ఇదే ఉత్సాహంతో సాధన చేసి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని పాఠశాల కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. విద్యార్థి ప్రతిభకు తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల మార్గనిర్దేశం ప్రధాన కారణమని సూర్యనారాయణ ఆచారి, నారపరెడ్డి పేర్కొన్నారు. యోగాసనాల్లో సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని, క్రీడలు-యోగాల పట్ల ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి.

# హిందూపురాన్ని జిల్లాగా ప్రకటించాల్సిందే...

## -ఐక్య విద్యార్థి సంఘ నాయకుల డిమాండ్

### -19న భారీ ప్రదర్శన

ప్రజాభూమి, హిందూపురం టౌన్



అన్ని అర్హతలు ఉన్న హిందూపురాన్ని జిల్లాగా ప్రకటించాల్సిందేనని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఇందిరా పార్కులో జిల్లా సాధన పై ఐక్య విద్యార్థి సంఘం నాయకులు సమావేశమయ్యారు. పిడిఎస్ యూ, వైయస్సార్ ఎస్.యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్.ఎస్.యు.ఐ, ఏ.ఐ.ఎస్.బి, ఎం.ఎస్.ఎఫ్. విద్యార్థి సంఘాల నాయకులు సమావేశమై జిల్లా సాధన పై చర్చించారు. జిల్లా సాధన కోసం ఈ నెల 19వ తేదీన పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శన ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో పాల్గొన్న హిందూపురం జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షులు ఉమర్ ఫారుక్, ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు బాబావలి, కదిరిష్, నరసింహమూర్తి, భరత్, చంద్ర, అఫ్రీద్ మాట్లాడుతూ, అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన హిందూపురాన్ని గుర్తించి జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హిందూపురాన్ని ప్రత్యేక జిల్లా చేయాలని కోరుతూ హిందూపురం డివిజన్ వ్యాప్తంగా అన్ని కళాశాలలో సదస్సులు, సెమినార్లు, సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. దానితోపాటు ఈనెల 19వ తేదీన అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే కలిసి వచ్చే వారిని అందరిని కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు అతిక్ మహమ్మద్, ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు యశ్వంత్, నాగేంద్ర, వంశీ, ఫణీంద్ర,అనుదీప్, నాజీర్, అజయ్, సుభాన్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపుతో ఢిల్లీకి మంత్రి సత్యకుమార్ యాదవ్.

ప్రజా భూమి, ధర్మవరం



రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కి కేంద్ర హోంమంత్రి అమిత్ షా నుంచి ప్రత్యేక పిలుపు అందింది. ఈ నేపథ్యంలో రేపు ఉదయం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ని మంత్రి సత్యకుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలవనున్నారు. ఈ సమావేశంలో ఏపీ రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలు, ముఖ్యంగా ఆరోగ్య, వైద్య విద్య రంగాల్లో కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో అమలు చేయవలసిన పథకాలు, ఆసుపత్రుల అభివృద్ధి, మెడికల్ కాలేజీల బలోపేతం, ప్రజారోగ్యానికి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగే అవకాశముందని తెలుస్తోంది. ఈ ఢిల్లీ పర్యటనలో మంత్రి సత్యకుమార్ యాదవ్ తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కూడా పాల్గొననున్నారు. రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర సహకారంతో చేపట్టవలసిన కార్యక్రమాలపై ఈ సమావేశం రాష్ట్రానికి ఎంతో ప్రాధాన్యత కలిగినదిగా భావిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగే ఈ భేటీ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరిన్ని అభివృద్ధి అవకాశాలు, ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోబడతాయనే ఆశాభావాన్ని బీజేపీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు.

# సడ్లపల్లి చెరువులు చెరపట్టారు

## - నీళ్లతో కాకుండా వ్యర్థాలతో చెరువును నింపుతున్న వైనం - సుప్రీం కోర్ట్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న అధికారులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

అధికారంలోకి ఎవరు వచ్చినా.. కృష్ణా జలాలతో చెరువులన్నీ నింపుతామని చెప్పే మాటలు. కృష్ణా జలాలతో నింపుతారో లేదో తెలియదు గాని పక్కన ఉన్న వ్యర్థాలను మాత్రం చెరువులోకి తరలించి వ్యర్థాలతో నింపుతున్నారు. దీంతో హిందూపురం చుట్టుపక్కన ఉన్న అన్ని చెరువులు కాలుష్య కుంపటిగా మారుతున్నాయి. చెరువులు జనానికి నీటి వనరులు, చెరువులు శుభ్రంగా ఉంటేనే ప్రజలకు మంచినీరు అందుతుంది. అయితే ఇప్పటికే వివిధ కారణాలతో చెరువులన్నీ కాలుష్య కారకాలుగా మారిపోయాయి. మరోవైపున చెరువులను ఆక్రమించి రకరకాల నిర్మాణాలు చేసుకున్నారు. వాటిని తొలగించడానికి రకరకాల అడ్డంకులు ఎదురవుతుండడంతో అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఇది చాలాదన్నట్లు హిందూపురం పరిసర ప్రాంతాలలో ఉన్న చెరువులన్నీ మురుగు నీటితో నిండి మురుగు తటాకాలుగా మారిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న చెరువులను శుభ్రం చేయాల్సింది పోయి మరింత అపరిశుభ్రంగా మారుస్తున్నారు. ఇది తెలిసినప్పటికీ జల వనరుల శాఖ అధికారుల్లో కనీస చలనం సైతం కనిపించడం లేదు. చెరువులనే కాకుండా చెరువులకు అనుసంధానంగా ఉన్న కాలువలను సైతం మురుగు కాలువలుగా మార్చుకుంటున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. తాజాగా ఆటోనగర్ ఎదురుగా ఆటోనగర్ యూనియన్ కార్యాలయ సమీపంలో ఆటోనగర్ నుంచి సేకరించిన వ్యర్థాలన్నీ ఒకచోట పడేశారు. ఈ వ్యర్థాలను పురపాలక సంఘానికి చెందిన డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. అయితే డంపింగ్ యార్డ్ కు తరలించకుండా ఓ గుత్తేదారుడు రెండు జెసిబి లు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో పక్కనే ఉన్న సడ్లపల్లి చెరువులోకి వ్యర్థాలతో నింపుతున్నారు. దీంతో సడ్లపల్లి చెరువు మరింత కాలుష్యంగా మారిపోతోంది. ఇప్పటికీ ఇదే చెరువును కొంతమంది స్వార్థపరులు కబ్జాలు చేసుకుని ఇళ్లను నిర్మాణం చేసుకున్నారు. దీంతోపాటు వ్యర్థాలను తరలించి చెరువులు మూసివేసి కాలుష్యంగా మారుస్తున్నారు. పెద్ద ఎత్తున వర్షాలు కురిసి చెరువులోకి నీళ్లు వస్తే ఆ కాలుష్య నీరంతా భూమిలోకి ఇంకిపోవడంతో పాటు అవే నీళ్లు రోడ్లపైకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం కళ్ళు తెరిచి చెరువులను కాపాడాల్సిన అవసరం ఉంది.





**నిర్లక్ష్యంగా ఉన్న అధికార యంత్రాంగం :**చెరువులను, చెరువులకు అనుసంధానంగా ఉన్న కాలువలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి ఎక్కడా కబ్జాలకు గురికాకుండా, మురుగు నీరు చెరువులోకి తరలించకుండా చూడాల్సిన జల వనరుల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొట్నూరు చెరువుతోపాటు సూగూరు, సడ్లపల్లి, శ్రీకంఠాపురం చెరువులతోపాటు పట్టణ సమీపంలో ఉన్న అన్ని చెరువులు కబ్జాలకు గురి కావడంతో పాటు పురపాలక సంఘంలో మురుగు వ్యర్థాలను చెరువులోకే వదులుతున్నారు. ఇది చాలా దున్నట్లు ట్రాక్టర్ల ద్వారా వ్యర్థాలను తరలిస్తున్నారు. పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాల్సిన జల వనరుల శాఖ అధికారులు తామేమి చూడలేదని, తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించడం గమనార్హం. చెరువులు, కుంటల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ప్రత్యేక ఆదేశాలను సైతం జారీ చేయడం జరిగింది. ఈ ఆదేశాలను సైతం అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జల వనరుల శాఖ అధికారులతో పాటు రెవిన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకొని చెరువులు కబ్జాలకు గురికాకుండా, మురుగు వ్యర్థాలు చెరువులోకి తరలించకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

## ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

ప్రజాభూమి, , ముదిగుబ్బ



ముదిగుబ్బ-పులివెందుల ఘాట్ రోడ్డులో మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ముదిగుబ్బలోని దొరిగల్లు రోడ్డులో గల మసీదు సమీపంలో నివాసం ఉంటున్న శ్రీకాంత్, గణేష్ అనే యువకులు ద్విచక్ర వాహనంపై క్రికెట్ ఆడేందుకు మరో గ్రామానికి వెళ్తుండగా మరియు మండల సరిహద్దు దాటిన తర్వాత ఘాట్ రోడ్ లో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమీప పొలాలకు వెళ్తున్న రైతులు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది గాయపడిన వారిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఘాట్ రోడ్డులో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ప్రజా భూమి, అనంతపురం ప్రతినిధి

డిసెంబర్ 21వ తేదీ ఆదివారం జరుగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖతో పాటు అన్ని అనుబంధ శాఖలు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగిందనన్నారు. అందుకు అనుగుణంగా అన్ని వైద్య ఆరోగ్యశాఖ అనుబంధ శాఖలను సమన్వయం చేసుకొని పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఈబి.దేవి తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమముపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం కోసం అందుకు సంబంధించినటువంటి వాల్ పోస్టర్లను నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వయస్సులోపు ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు ఇవ్వడం జరుగుతుందని, ప్రస్తుతం భారతదేశము పోలియో రహిత దేశంగా ప్రకటించబడినప్పటికీ కొన్ని దేశాల్లో పోలియో ఇప్పటికీ ఉన్నందువల్ల తిరిగి మన దేశంలో పోలియో కేసులు మనదేశంలో రావచ్చని ముందు జాగ్రత్తగా పోలియో చుక్కలు ఐదు సంవత్సరంలోపు పిల్లలందరికీ తగిన మోతాదులో ప్రతిసారి పోలియో వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోలియోపై విజయం సాధించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డా. డేవిడ్ సెల్వరాజ్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.శేషభూషణ్ రెడ్డి, జిల్లా లెప్రసీ, టీబి, ఎయిడ్స్ అధికారి డాక్టర్ జయలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, డా.శ్రీనివాస్ రెడ్డి, డా.విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



# ధర్మవరంలోని చిన్నారి ఆరోగ్య సమస్యపై స్పందించిన మంత్రి సత్య కుమార్ యాదవ్

ప్రజా భూమి, ధర్మవరం



ధర్మవరం పట్టణానికి చెందిన పేద చేనేత కార్మికులు జిహావేశ్వర-లక్ష్మి దంపతుల కుమార్తె జీవితం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం ఇటీవల స్థానికంగా మంత్రి దృష్టికి వచ్చింది. ఈ పరిస్థితిని తెలుసుకున్న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కార్యాలయం ఇంచార్జ్ హరీష్ బాబు కి ఆదేశించారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు ధర్మవరం కేశవ నగర్‌లో ఉన్న జీవిత నివాసానికి స్వయంగా వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నారి జీవిత ఆరోగ్య పరిస్థితిని ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని, వైద్యుల అభిప్రాయాలను సేకరించారు. అవసరమైన మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహకారం అందిస్తామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి తక్షణ వైద్య సహాయం అందేలా సంబంధిత వైద్య శాఖ అధికారులు, ఆసుపత్రి యాజమాన్యంతో సమన్వయం చేస్తామని హరీష్ బాబు తెలిపారు. పేద చేనేత కుటుంబాలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ముఖ్యంగా ఆరోగ్య సమస్యల్లో ఎవ్వరూ ఒంటరిగా ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.



# పేకాటరాయలను పట్టుకున్న కుందుర్పి పోలీసులు

ప్రజాభూమి, అనంతపురం ప్రతినిధి





కళ్యాణ్ దుర్గం డిఎస్పి రవిబాబు సర్కిల్ ఇన్స్పెక్టర్ నీలకంటేశ్వర్ పర్యవేక్షణలో పేకాటరాయలను పట్టుకొని వారి వద్ద నుంచి రూ. 30,600/- నగదు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, 9 మంది పేకాటరాయుళ్లు అరెస్ట్ చేశారు. అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డీఎస్పీ పి. రవి బాబు కళ్యాణదుర్గం రూరల్ సీఐ సి. నీలకంఠేశ్వర్ పర్యవేక్షణలో, కుందుర్పి ఎస్సై చిన్న రాయుడు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఎర్రగుంట నుండి చింతలపల్లి వెళ్లే రహదారిలోని ఎర్రగుంట అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను పట్టుకుని, వారి నుండి రూ.30,600/- నగదు 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుందుర్పి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిశ్శబ్దం నుంచి న్యాయ స్వరం వరకు....

## అభ్యుదయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కుప్పం వాసుదేవాయ ఆచారి

ప్రజా భూమి తొండూరు :




ఆ పట్టణంలో ఉదయాలు ఒకేలా మొదలవుతాయి. బస్సుల శబ్దం, దుకాణాల అరుపులు, కార్యాలయాల ముందు నిలిచే పొడవాటి క్యూలు. కానీ ఆ క్యూల్లో నిలిచే మనుషుల మనసుల్లో మాత్రం ఒకే భావం ఉ ండదుఎవరికైనా ఆశ, ఎవరికైనా నిరాశ, మరికొందరికి అలవాటు పడిపోయిన నిశ్శబ్దం. రామయ్య అలాంటి నిశ్శబ్దానికి అలవాటు పడిపోయిన మనిషే. చిన్న ఉద్యోగం, చిన్న ఇల్లు, పెద్ద ఆశలు లేని జీవితం. కానీ అతని ఇంటి ముందు ఉన్న చిన్న షెడ్డు అతనికి జీవనాధారం. అదే షెడ్డు ఇప్పుడు "అక్రమం" అయింది. నోటీసు చేతిలో పట్టుకుని మున్సిపాలిటీ కార్యాలయం మెట్లెక్కిన రోజు నుంచి అతని జీవితం తిరుగుడు ప్రయాణమైంది. "ఫైల్ పైకి వెళ్లాలి" "సార్ లేరు" "మళ్లీ రేపు రండి" ఈ మూడు వాక్యాలు అతని దినచర్యలో భాగమయ్యాయి. అదే కార్యాలయంలో, అదే సమయంలో, ఖరీదైన కారులో వచ్చిన ఒక వ్యాపారి నవ్వుతూ బయటకు వెళ్లాడు. అతని అక్రమ భవనం చట్టబద్ధమైంది. ఒక రోజులోనే. ఈ దృశ్యం రామయ్య కుమార్తె అనిత మనసును కదిలించింది. ఆమె చదువులో ముందుంది, ఆలోచనల్లో ఇంకా ముందుంది. ఆ రోజు సాయంత్రం తండ్రిని అడిగింది. "నాన్నా.. మనం తప్పు చేయకపోయినా ఎందుకు భయపడాలి?" రామయ్య కాసేపు మౌనంగా ఉన్నాడు. ఆ మౌనం వెనుక సంవత్సరాల అనుభవం ఉంది. "భయపడటం తప్పు కాదు అమ్మా కానీ ప్రశ్నించకపోవడమే నిజమైన తప్పు."

**ఆ మాటలు అనిత జీవిత దిశను మార్చేశాయి :**కాలం గడిచింది. అనిత న్యాయ విద్యను ఎంచుకుంది. పుస్తకాల్లో రాజ్యాంగాన్ని చదువుతుంటే, తండ్రి ముఖం గుర్తొచ్చేది. ఆర్టికల్ 14 చదివితేసమానత్వం గుర్తొచ్చేది. ఆర్టికల్ 21 చదివితేజీవించే హక్కు గుర్తొచ్చేది. పుస్తకాల్లో ఉన్న చట్టం, జీవితంలో కనిపించని న్యాయం ఆమెను కుదిపేసింది. న్యాయవాదిగా మారిన తర్వాత అనిత పెద్ద కేసులు ఎంచుకోలేదు. పెద్ద ఫీజులు తీసుకోలేదు. నిశ్శబ్దంగా సహించే వారిని వెతికింది. వారి తరఫున మాట్లాడింది. ఒక రోజు అదే మున్సిపాలిటీ కార్యాలయం ముందు ప్రజలు గుమిగూడారు. ఈసారి అది ఫిర్యాదుల కోసం కాదున్యాయం కోసం. అనిత ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. అక్రమాలకు చట్టబద్ధత ఇచ్చిన విధానాలపై ప్రశ్నలు లేవనెత్తింది. న్యాయస్థానంలో నిజాలు బయటపడ్డాయి. అధికారుల మౌనం బద్దలైంది. చట్టం తన అసలైన అర్థాన్ని గుర్తుచేసింది. అక్రమాలు కూలిపోయాయి. రామయ్య షెడ్డు నిలిచిందికేవలం ఒక నిర్మాణంగా కాదు, ఒక గెలుపుగా. ఆ రోజు సాయంత్రం రామయ్య తన కుమార్తె చేతిని పట్టుకుని అన్నాడు. "ఇన్నాళ్లకు నాకు ఒక నమ్మకం వచ్చింది అమ్మా.. మనలాంటి వాళ్లకు కూడా న్యాయం ఉందని." అనిత చిరునవ్వుతో సమాధానం చెప్పింది. "న్యాయం దయగా రాదు నాన్నా.. ధైర్యంగా నిలబడితేనే దక్కుతుంది." ఆ పట్టణంలో పెద్ద మార్పు ఒక్కరోజులో రాలేదు. కానీ ఒక ఆలోచన మొదలైంది. నిశ్శబ్దంగా ఉన్నవారు మాట్లాడడం నేర్చుకున్నారు. ప్రశ్నించడం భయంగా కాక, బాధ్యతగా మారింది.

**సందేశం:** స్వేచ్ఛ, సమానత్వం ఎవరో ఇచ్చే వరాలు కావు. అవి మన ఆలోచనల్లో పుట్టి, మన చర్యల్లో నిలబడినప్పుడు మాత్రమే సమాజాన్ని మార్చగల శక్తిగా మారుతాయి. ఒక వ్యక్తి ధైర్యం వెయ్యిమందికి స్ఫూర్తి అవుతుంది.

## భక్తి, విశ్వాసం, ధర్మం కలిసిన నరసింహుని స్వాతి నక్షత్రం...

ప్రజా భూమి తొండూరు:



తొండూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజలు, ఉత్సవాలు భక్తి పర్వంగా సాగాయి. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారి దివ్యదర్శనం కోసం క్యూలైన్లలో నిలబడి మొక్కులు సమర్పించారు. అర్చకులు స్వామివారికి తులసి దళాలతో అద్భుతంగా అలంకరించగా, ఆ అలంకారం చూసిన ప్రతి భక్తుడూ మంత్ర ముగ్ధులయ్యాడు. పచ్చని తులసి హారాలతో కాంతులీనుతున్న నరసింహ స్వామి విగ్రహం ఆధ్యాత్మిక కాంతిని ప్రసరించింది. ఆలయ ప్రాంగణం "ఓం నరసింహాయ నమః" జపాలతో మార్మోగిపోయింది. మహామంగళహారతి, దీపారాధనలతో ఆలయ వాతావరణం మరింత పవిత్రమైంది. స్వామివారి దర్శనం పొందిన భక్తులు తమను అదృష్టవంతులుగా భావించారు.

## పులివెందుల అభివృద్ధిపై అధికారులతో కీలక సమావేశం

**పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన బీటెక్ రవి**

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి అన్నారు. మంగళవారం పులివెందుల పట్టణం లోని ఆర్ అండ్ బిగెస్ట్ హౌస్ లో సంబంధిత అధికారులతో కీలక సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులతో ఆయన చర్చించారు. నియోజకవర్గంలో ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేప ట్టాలన్నారు. గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుం డా చూడాలన్నారు. గ్రామాలలో కాలువల్లో పూడిక లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేసుకోవాలన్నా రు. గ్రామాలలో రోడ్ల సమస్య లేకుండా ప్రతి ఒక్క రోడ్డు వేయాలన్నారు. చక్రాయిపేట మండలం మీడియా దడి ఎక్కువగా ఉంటుందని నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక దృష్టి అధికారులు సాధించాల న్నారు. సింహాద్రిపురం మండలంలోనంద్యాలం పల్లె గ్రామం సమీపంలో కాలవల్లో నీళ్లు ఎక్కువ అవ్వడంతో భూములు జౌకులు ఎక్కుతున్నాయని అన్నారు. ఇప్పటికే ఎర్రబలి చెరువుకు 75% నీరు చేరడం జరిగిందన్నారు. తొందర్లో ఎర్రబెల్లి చెరువు కూడా నిండే అవకాశాలున్నాయన్నారు. అధికా రులు సమస్యలపై ప్రత్యేక దృష్టికి సాధించాల న్నారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర బ్రాంచ్ కెనాల్ హెచ్.ఎల్.సి ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి ,వేంపల్లి ఇన్‌చార్జ్ అజ్జుగుట్టు రఘునాథ్ రెడ్డి ,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి ,ఏపీ ఎడ్యుకే షనల్ డైరెక్టర్ అన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి,పులివెందుల పట్టణ మాజీ టీడీపీ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, తొండూరు మండల టీడీపీ ఇంచార్జ్ శివ మోహన్ రెడ్డి, చక్రయాపేట మండల టీడీపీ ఇంచార్జ్ మహేశ్వర రెడ్డి, వేంపల్లె మండల టీడీపీ ఇంచార్జ్ మునిరెడ్డి, వేముల ఇంచార్జ్ బ్రహ్మయ్య ,తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయం మంజూరు కు అనుమతులు ఇవ్వండి

**కేంద్ర విద్యాశాఖామంత్రికి వినతి వత్రం అందజేసిన ఎంపీలు**

ప్రజాభూమి,పులివెందుల టౌన్



ప్రొద్దుటూరుకు నూతనంగా కేంద్రీయ విద్యాలయం ను మంజూరు చెయ్యాలని పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి,తిరుపతి ఎంపీ గురుమూర్తి లు ఢిల్లీ లో కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో అతిపెద్ద పట్టణ కేంద్రంలో ప్రొద్దుటూరు ప్రాంతం ఒకటని, ప్రొద్దుటూరు ప్రాంతాన్ని రెండవ ముంబాయి గా పిలుస్తారన్నారు. కావున ఆంధ్ర ప్రదేశ్ లోని కడప జిల్లా లో ఉన్న ప్రొద్దుటూరుకు కేంద్రియ విద్యాలయ మంజూరు చేయటానికి అనుమతులు ఇవ్వాలని వారు కోరారు. పెరుగుతున్న జనాభా, సేవలలో గణనీయమ్మైన ఉనికి, రైల్వేస్, తపాలా, బ్యాంకింగ్, డిఫెన్స్ సంబంధిత సేవలలో పనిచేసే వారితోపాటు ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉన్నాయన్నారు. కేంద్రీయ విద్యాలయం లేకపోవడంతో అన్ని వర్గాల ప్రజలకు కష్టతరమవుతుందన్నారు. కావున ప్రొద్దుటూరులో కేంద్ర విద్యాలయం మంజూరుకు కృషి చేయాలని వారు కేంద్ర మంత్రిని కోరారు.

## వైఎస్ఆర్సిపి బలోపేతమే లక్ష్యం

ప్రజాభూమి, వేంపల్లి





మండలంలోని అల్లిరెడ్డివల్లి గ్రామపంచాయతీలో వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీలు ఎన్నిక చేయడం జరిగింది మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి సింగారెడ్డి రోహన్ మాట్లాడుతూ, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్సిపి పార్టీ బలోపేతానికి రాబోయే స్థానిక సంస్థ ల్లో వైఎస్ ఆర్సిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు తెలియజేశారు అల్లి రెడ్డి పల్లి గ్రామపంచాయతీలో, కోర్ కమిటీ , రైతు విభాగం మహిళా విభాగం ఎస్సీ విభాగం బీసీ విభాగం సోషల్ మీడియా విభాగం యువజన విభాగం విద్యార్థి విభాగాలు తెలియజేసి ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో కటిక చంద్ర మైనార్టీ మెంబర్స్ అల్లిరెడ్డిపల్లి మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ వేంపల్లి చంద్రశేఖర్ రెడ్డి ఎంపీటీసీ వేంపల్లి ప్రదీప్ కుమార్ రెడ్డి మాజీ ఎంపిటిసి వి వెంకట వెంకటనారాయణ మాజీ సర్పంచ్ నాగు సుబ్బారెడ్డి సర్పంచ్ నాగరాజా మాజీ ఎంపీటీసీ ముద్ది గంగయ్య వి కృష్ణారెడ్డి రామచంద్ర వైయస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు మహిళలు రైతులు పాల్గొన్నారు.

## నేడు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలోకి భారీ చేరికలు

ప్రజాభూమి, వేంపల్లె




కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై టిడిపి పార్టీలోకి చేరుతున్నట్లు స్థానిక పట్టణంలోని పుల్లయ్య తోట వీధికి చెందిన దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మాంగే) తెలిపారు. దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి తో పాటు ఆయన ఆధ్వర్యంలో భారీగా చేరికలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇంచార్జ బీటెక్ రవి పాల్గొంటారని తెలిపారు. పార్టీ లోకి చేరుతున్న కుటుంబాలకు బీటెక్ రవి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలను ఆకర్షితుల్ని చేస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉం టుందని చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు.

## ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి రబీ ప్రణాళిక పై 5 రోజుల శిక్షణ

ప్రజాభూమి,పులివెందుల

కడప జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఐ వి ఆర్ సి ఎల్ లో వ్యవసాయ కళాశాల లో రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాల మేరకు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి కొనసాగాలంటే సిబ్బంది అందరు సొంత పొలం లో మోడల్స్ వేస్తూ సిబ్బంది పరిధిలో రైతులకు క్యాడర్ సొంత పొలం లో శిక్షణ ఇస్తూ ప్రకృతి వ్యవసాయం చేయించాల న్నారు. అలాగే రాష్ట్ర స్థాయి రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు టి.విజయకుమార్ రిటైర్డ్ ఐఏఎస్ మాట్లాడుతూ ప్రతి రసాయన రైతు ఖచ్చితంగా ప్రకృతి వ్యవసాయం చెయ్యాలని, భవిష్యత్తు లో అందరు ఆరోగ్యంగా ఉండాలన్న, పంట ల వైవిధ్యత ఎక్కువగా ఉండాలన్నారు. ప్రధాన పంట తో పాటు అంతర పంటలు వేసుకోవాలనీ, రైతుకు ఆదాయం తో పాటు ఆరోగ్యం, భూమి సారవంతం అయి ఖర్చు తగ్గి దిగుబడి వస్తుంద న్నారు. ప్రతి క్యాడర్ సొంత ఫీల్డ్ లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఇతర రైతులకు చూపిస్తూ, చేయించాలి అని వివరించారు. అలాగే ఈ శిక్షణ లో అందరు బాగా నేర్చుకొని, అందరు మార్కెటింగ్ కుడా చేసుకోవాలి అని తెలియజేసారు. ఈ ట్రైనింగ్ లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ట్రైనర్స్ పాల్గొన్నారు.



## ఆలయ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి - దేవస్థానం ఛైర్మన్ పివి.రమణ

ప్రజాభూమి,వేంపల్లె



వేంపల్లి శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు కేటాయించి తోడ్పాటు ఇవ్వాలని దేవస్థానం ఛైర్మన్ పి. వెంకటరమణ అన్నారు. మంగళవారం తిరుమలలో ఉన్న టిటిడి జెఇఓ వీరబహ్మాం, టిటిడి పాలకమండలి మెంబర్ భాను ప్రకాష్ రెడ్డిని దేవస్థానం ఛైర్మన్ పివి రమణ, ఆలయ ప్రధాన అర్చకులు హరి ప్రవీణ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ లు కలిసి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం వైఫల్యం కారణంగా శ్రీ లక్ష్మివృషభాషలేశ్వర స్వామి దేవస్థానంలో అసంపూర్తిగా పనులు నిలిచి పోయినట్లు చెప్పారు. ఎద్దుల కొండపైన తూర్పు, పడమర రాజగోపురాలు, ప్రకారంనకు నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని టిటిడి అధికారులను, పాలకమండలి సభ్యులను కోరడంతో వారు కూడ స్పదించినట్లు తెలిపారు. నిధులు కేటాయించేందుకు టిటిడి ఛైర్మన్ దృష్టికి తీసుకొని వెళ్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు విజయలక్ష్మి, పాలక మండలి సభ్యులు ఎన్.సునీల్, ఏనుగొండ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంధులకు అన్నదాన కార్యక్రమం

ప్రజాభూమి,పులివెందుల




పులివెందుల పట్టణంలోని స్థానిక శ్రీ వీర నారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో దివంగత రిటైర్డ్ సబ్ జైలు వార్డెన్ ఆలూరు గంగులప్ప 17వ వర్ధంతి సందర్భంగా గంగులప్ప సతీమణి ఆలూరు తులశ మ్మ, కుమారులు ఆలూరు నరసింహులు, ఆలూరు గంగాధర కుమార్, కోడలు ఉమాదేవి, జయంతి, మనవళ్లు మనవరాళ్లు కలిసి అంధులకు మాంసా హారంతో కూడిన భోజనాన్ని వడ్డించారు.ఈ సంద ర్భంగా ఆలూరు నరసింహులు మాట్లాడుతూ తన తండ్రి గంగులప్ప జ్ఞాపకార్థం అంధులకు భోజనం వడ్డించడం చాలా సంతోషంగా ఉందన్నా రు. ప్రతి ఏడాది తన తండ్రి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం తమకు తోచిన విధంగా అంధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని ఆయన కోరారు.

## యూనిఫైడ్ సర్వేకు పురపాలక ప్రజలందరూ సహకరించాలి



ప్రజాభూమి,పులివెందుల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యూని ఫైడ్ సర్వేకు పురపాలక ప్రజలందరూ సహకరిం చాలి అని మున్సిపల్ కమిషనర్ డి.రాముడు కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యూనిఫైడ్ సర్వే ప్రారంభం కాబో తుందని ఈ సర్వే ద్వారా ప్రజల నుండి సమగ్ర కుటుంబ, ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ సంబంధ సమాచారం సేకరించే విధముగా ఈ సర్వేను ప్రభుత్వం రూపకల్పన చేశారన్నారు. సుమారు నెల రోజులపాటు మున్సిపాలిటీ పరిధి లోని ప్రతి గడపకు వెళ్లి ఆ కుటుంబంలోని ప్రతి వ్యక్తి యొక్క సమాచారాన్ని సేకరించి వారికి ఈ.కె.వై.సి ద్వారా సర్వే చేయవలసి ఉంటుందని సిబ్బందికి తెలిపారు. ఈ సర్వే ప్రభుత్వం నుంచి అందే పథకాలు మరియు ఇతర ప్రయోజనాల కొరకు ఉపయోగపడునని తెలియజేసారు. కావున పులివెందుల పురపాలక సంఘంలోని ప్రజలందరూ ఈ సర్వే కి సహకరించవలసినదిగా కోరడమైనదని మునిసిపల్ కమీషనర్ రాముడు కోరారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారు లు,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## యర్రబల్లె చెరువుకు జలకళ

**జలహారతి ఇచ్చిన జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి**


ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మండల ప్రజల, రైతుల చిరకాల వాంఛ, మండల జీవనాడి అయిన యర్రబల్లి చెరువుకు కృష్ణా జలాలు పరవళ్ళు తొక్కుతూ చేరుకున్నాయి. ఈ శుభ తరుణంలో పులివెందుల తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి చెరువు వద్దకు చేరుకుని, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా జలహారతి సమర్పిం చారు.ఈ సందర్భంగా లతా రెడ్డి మాట్లాడుతూ యర్రబల్లె చెరువుకు నీరు రావడం తనకు పట్టరాలే నంత ఆనందాన్ని ఇస్తోందని ఉద్వేగంగా తెలిపారు. 1400 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తూ ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో జారీ చేయడం శుభప రిణామమని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన వెంటనే రైతుల కష్టాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన నీటిని విడుదల చేయడం హర్షణీయం అని యర్రబల్లే చెరువు నిండుతుంటే ఈ ప్రాంత రైతుల కళ్ళల్లో ఆనందం కనిపిస్తోంద న్నారు. ఇంతటి గొప్ప కార్యానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు కు పులివెందుల రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞ తలు తెలియజేస్తున్నాను అని లతారెడ్డి పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు రైతులు, పాల్గొన్నారు.

## అబాకస్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వైష్ణవి పాఠశాల విద్యార్థులు

ప్రజాభూమి పోరుమామిళ్ల :




పోరుమామిళ్ల పట్టణం మైదుకూరు రోడ్డు నందు గల శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఆదివారం మైదుకూరులో మాంటోసారి హైస్కూల్ నందు జరిగిన 2025 26 విద్యా సంవత్సరానికి గాను విశ్వం ఎడ్యుకేట్ వారు నిర్వహించిన జోనల్ స్థాయి జిల్లాస్థాయి అబాకస్ వేదిక్ మ్యాథ్స్ కాంపిటీషన్ లలో శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి బహుమతులను గెలుచుకున్నారు. అబాకస్ జూనియర్స్ లెవెల్ రెండో విభాగంలో బెస్ట్ పెర్ఫార్మర్ బహుమతిని బి.సాయి చేతన్ మరియు అబాకస్ సీనియర్ లెవెల్ మూడోవ విభాగంలో ఛాంపియన్ బహుమతిని గురుదీపక్ బహుమతులను పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవ్వడం జరిగింది. బహుమతులు పొందిన విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ .ఆర్. వి. రామకృష్ణ అభినందించారు తమ పాఠశాల అన్ని పోటీలలో ముందుంటుందని. ఎంతటి లక్ష్యాన్ని అయినా తమ విద్యార్థులు సాధిస్తారని తెలిపారు. అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. కళ్యాణి విద్యార్థుల ప్రతిభ పట్ల హర్షం వ్యక్తం చేశారు. బహుమతుల గెలుకున్న విద్యార్థులను స్కూల్ ఇన్చార్జ్ కేశవరాయుడు, వైస్ ప్రిన్సిపాల్ నమిత ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు అన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి ఉపాధ్యాయులకు అభినందనలు,కృతజ్ఞతలు తెలిపారు.

## పోలేరమ్మ దేవస్థానం గుడి దగ్గర సర్వే చేసి హద్దులు నిర్ణయించండి

**ఆర్డీవో కి వినతిపత్రం ఇచ్చిన హిందూ ఐక్యవేదిక నాయకులు**

ప్రజాభూమి,పులివెందుల టౌన్



పట్టణంలోని పోలేరమ్మ గుడి దగ్గర సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని హిందూ ఐక్యవేదిక అధ్యక్షుడు కొంగనపల్లి మురళి, ప్రధాన కార్యదర్శి చదలవాడ శ్రీనివాసులు, కన్వీనర్ కోప్పల శ్రీనివాస్ రెడ్డి ఆర్డీవో ను కలిసి వినతి పత్రం అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ పోలేరమ్మ గుడి ఎదురుగా పాతిన కాషాయ జెండా గురించి రెండు రోజుల క్రితం ఆర్డీవో హిందూ ఐక్యవేదిక నాయకు లకు నోటీసులు ఇచ్చి వివరణ ఇమ్మన్నారని ఆర్డీవోను కలిసి వివరణ ఇచ్చామన్నారు.పూర్వం సర్వే నెంబర్ 80బి 1బి 2 లొ గల స్థలంలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామ దేవర జరిపే వారమని అలాగే అమ్మవారి గుడి ప్రాంగణా న్ని శుభ్రం చేయడానికి ఆ స్థలంలో ఉన్న బావిలో నుంచి నీరు తెచ్చేవారమని ప్రస్తుతం ఈ స్థలం అక్రమణకు గురైందన్నారు.ఈ సమస్యకు పరిష్కా రం లభించాలంటే మసీదు ఉన్నటువంటి ప్రాంతా న్ని మొత్తాన్ని సర్వే చేసి హద్దులను నిర్ణయించా లని ఆర్డీవో కు వినతిపత్రం ఇచ్చామన్నారు ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

బుధవారం 17 డిసెంబర్ 2025

# విగ్రహాలు, ఆలయాల తొలగింపుకు ఒకరోజు గడువు పెంపు

## సంక్రాంతి ఉత్సవాల వరకు కొండచుట్టు మండపానికి గడువు



ప్రజాభూమిప్రతినిధి – నగరి

జాతీయ రహదారి వెడల్పులో బాగంగా రోడ్డుపక్కనే ఉన్న ఆలయాలు, శిలావిగ్ర హాలు, మండపాలు తొలగించుకోవాలని లేనిచో ఈ నెల 17వ తేదీన తామే తొలగిస్తామని ఆర్డీవో హెచ్చరికలు జారీచేసిన సంగతి విధితమే. అయితే నెలరోజుల్లో సంక్రాంతి ఉత్సవాలు ఉండటం ఆ ఉత్సవాల్లో కొండచుట్టు మండపంకు ప్రాధాన్యత ఉండటంతో ఉత్సవ నిర్వాహకులు, గ్రామస్తులు ఆమెను కలసి సంక్రాంతి పండుగ వరకు గడువు ఇవ్వాలని మొరపెట్టుకున్నారు. ఈ దశలో మంగళవారం రోడ్డు పక్కన ఆలయాలు, మండపాలు, శిలావిగ్రహాల సంబంధీకులతో ఆర్డీవో సమావేశమయ్యారు. తొలగింపులు స్వచ్ఛందంగా చేసుకోవాలని కోరారు. పలు సమస్యలను సంబంధీకులు తెలపడంతో తొలగింపుకు ఒకరోజు గడువును పొడిగిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే ఉన్నతాధికారులతో చర్చించిన మేరకు కొండచుట్టు మండపం తొలగింపుకు వచ్చే నెల 20వ తేదీ వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# వంటవాళ్లపై గ్రామస్తుల ఆగ్రహం స్పందించని అధికారులు

ప్రజాభూమిప్రతినిధి – వెంకటగిరిరూరల్



వెంకటగిరి రూరల్ మండల పరిధిలోని కలవలపూడి గ్రామ పంచాయతీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వ్యవహారంపై మంగళవారం గ్రామస్తులు ఆందోళ న వ్యక్తం చేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. భోజనంలో అన్నం, కూరలు, గుడ్లు సరైన విధంగా సప్లై చేయడం లేదని తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదులను స్వీకరించిన పాఠశాల చైర్మన్ దట్టం బాలసుబ్రమణ్యం కమిటీ సభ్యులతో కలిసి హెచ్‌ఎం, ఎంఈఓ వద్ద పలు మార్లు వినతిపత్రాలు సమర్పించారు. కానీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు చివరికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను సంప్రదించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే ఎమ్మెల్యే స్పందించి, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా వంటవారిని మార్చి భోజన నాణ్యతను మెరుగుపరచాలని ఆదేశించినట్లు సమాచారం. అయితే, ఇప్పటివరకు పైస్థాయి అధికారులు చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థుల సమాచారం ప్రకారం, పాఠశాల హెడ్‌మాస్టరు అపర్ణ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం జరగకుండా అడ్డుకుంటూ, పాఠశాల సమయాల్లో ఊర్లోకి వెళ్లి స్వలాభ రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రామప్రజలతో పాటు పాఠశాలవిద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాధ్యతాయుత చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు.

# అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ తనిఖీ చేసిన డీఎం అండ్ హెచ్‌వో



ప్రజాభూమి ప్రతినిధి – నగరి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి మంగళవారం నగరి నియోజకవర్గ పరిధిలోని పుదుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని రికార్డులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఎన్సీడీ సర్వే ప్రతిరోజు కచ్చితంగా క్వాలిటీగా చేయాలని వైద్యులకు సూచించారు. అలాగే అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రతిరోజూ మానిటర్ చేస్తూ లాప్స్ ఉన్న వాటిని రెక్టిఫై చేసి అన్ని ఆప్స్‌ను వందశాతం పూర్తి చేయాలన్నారు. యూపీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ బిందు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

ప్రజాభూమిప్రతినిధి – నగరి

బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని ఎంఈవో నమశ్శివాయం అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలికో న్నత పాఠశాలలో బాల్యవివాహ్ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. సమాజంలో ఎక్కడ బాల్యవివాహాలు జరిగినా వాటిని అడ్డుకోవలని చైల్డ్ హెల్ప్ నెంబరు 1098ను వినియోగించుకోవాలన్నారు. బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్యామిని, ఇందిర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# చల్ల కాలువ బ్రిడ్జికి పొంచి ఉన్న ప్రమాదం- ఆదమరిస్తే ప్రమాదమే

- గత నెలలోనే రెండు వేరు వేరు దగ్గర ప్రమాదాలు..ఆందోళనలో ప్రజలు
- ప్రమాదాలు జరుగుతున్న తూతూ మంత్రంగాపనులు చేస్తున్న ఆర్‌అండ్‌బి అధికారులు
- కోట ఆర్ అండ్ బి సబ్ డివిజన్ అధికారులు నిద్ర పోతున్నారా.?





ప్రజాభూమి ప్రతినిధి – కోట




తిరుపతి జిల్లా కోట మండలం కోట – విద్యానగర్ రోడ్డు మార్గంలో గతంలో చల్ల కాలువ పై రోడ్డు లేక వర్షాల సమయంలో ఈ ప్రాంత ప్రజానీకం పలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి మాజీ మంత్రి స్వర్గీయ నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఈ కాలువ పై బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత వాసులకు కోట నుంచి వాకాడు, చిట్టమూరు, ప్రాంతాల ప్రజలు నేరుగా గూడూరు నెల్లూరు వెళ్లేందుకు బ్రిడ్జి కం రోడ్ నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత వాసుల కష్టాలను తీర్చి అందరి మన్ననలు అందుకున్నారు. అలాంటి బ్రిడ్జి నిర్మాణం నేడు మూన్నాళ్ళ ముచ్చటగానే తయారయింది. కేవలం ఆర్ అండ్ బి శాఖ, బిఎస్ఎన్ఎల్ టెలికం శాఖ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా బ్రిడ్జి ముందు భాగంలో గోతుల మయంగా మారి నిత్యం ప్రాణాలతో చెలగాటమాడే పరిస్థితి నెలకొని ఉంది. కోట –విద్యానగర్ రెండు ప్రాంతాల ప్రజలు ఈ చల్ల కాలువ కారణంగా జంట నగరాల్లో విడివిడిగా ఉంటున్నాయి. చల్ల కాలువ పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నాయి. దానికి పర్యవేక్షణ లేక, మెయింటినెన్స్ సరిగా లేక పోవడంతో అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని ప్రాంతాలలో బీటలు వారి బ్రిడ్జికి ముందు భాగంలో విద్యానగర్ – కోటకు వెళ్లే దారిలో పెద్ద పెద్ద లోతైన గుంటలు తయారై పగలు రాత్రి అని తేడా లేకుండా నిత్యం ప్రజలు ప్రమాదాలకు లోనవుతున్నారు. టెలికంశాఖ అధికారులు గుంటలు తీస్తున్నారే కానీ వాటిని పూడ్చడం మరుస్తున్నారు. ఈ సమస్య కారణంగా గత వర్షాలకు టెలికం శాఖ తీసిన గుంటలు కారణంగా ఒ లారీ ఆ గుంటలలో దిగబడిపోయింది, మరొక ఆర్టీసీ బస్సు గుంటలలో కూరుకుపోయి ఒరిగిపోతున్న సమయంలో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికుల ప్రాణాలు నిలబెట్టాడు. దీని పై ప్రజల ఆగ్రహానికి పత్రికల వారి కథనాలకు స్పందించిన ఆర్ అండ్ బి శాఖ తూతూ మంత్రంగా మట్టిని పై పైన కప్పి పనులు చేశామని అన్నారు. ఇది ఇలా ఉంటే ఈ బ్రిడ్జికి రెండు వైపులా కట్ట నిర్మించారు. వర్షాల సమయంలో బ్రిడ్జి సమీపంలో లోతైన గుంటలు ఉండడంతో అక్కడ వేసిన గ్రావెల్ కొట్టుకుపోయి లోతైన గుంటలుగా ఏర్పడి ఉన్నాయి. వర్షాలలో వచ్చే వర్షపు నీటి కారణంగా ఇలా జరుగుతూ ఉండడంతో రోడ్ మార్జిన్ వరకు గ్రావెల్ పోయి బ్రిడ్జికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి నెలకొని ఉంది. దీంతో పాటు టెలికంశాఖ తమ వైర్లను బ్రిడ్జి పై మరియు అటు, ఇటు వాళ్ల కేబుల్స్ వెళ్లేందుకు రిపేర్లు పురస్కరించుకొని అను నిత్యం ఆ కేబుల్ మరమ్మత్తుల నిమిత్తం లోతైన గుంటలు తవ్వుతున్నారు. వాటిని పుడవటం మురుస్తున్నారు. దీని కారణంగా రోడ్డు మార్గంలో లోతైన గుంటలు తీయడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో ఆ గుంటలలో వాహనాలు ఇరుక్కొని ప్రమాదాలకు లోనవుతున్నారు. భారీ వాహనాల పరిస్థితి ఇలా ఉంటే వాహన చోదకులు ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళలో అక్కడ ఆర్ అండ్ శాఖ వారు కాని టెలికం శాఖ వారు కానీ ఎలాంటి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి పగలు తేడా లేకుండా వాహన చోదకులు ప్రమాదాలకు లోనఅవుతున్నారు. ఆసుపత్రి పాలవుతున్నారు. ఇది ఆర్ అండ్ బి శాఖ నిర్లక్ష్యమా లేక టెలికంశాక వారి నిర్లక్ష్యం అని ఈ ప్రాంత వాసులు గగ్గోలు పెడుతూ ఘోషిస్తున్నా..సంబంధిత అధికారులు మాత్రం స్పందించక చెవిటి వాడి చెవిలో శంఖం ఊదినట్లు మిన్న కుండా ఉండిపోతున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి 40 సంవత్సరాలు పైబడిన కారణంగా బ్రిడ్జికి సంబంధించిన అప్రోచ్ గోడలు దెబ్బతిని ఉన్నాయి. శిలా ఫలకాలు నిర్మించిన ప్రదేశంలో లోతైన గుంటలు అక్కడ పిల్లర్స్ కు బీటలు వాలి ఉన్నాయి. వీటిని గమనించి మరమ్మత్తులు చేయాల్సిన కోట ఆర్ అండ్ బి శాఖ నిద్రపోతున్న కారణంగా అధికారుల వైఫల్యం కారణంగా ఈ చల్ల కాలువ బ్రిడ్జికే ప్రమాదం నెలకొని ఉంది. దీని పై రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికారులు, స్థానిక నేతలు, స్పందించి ఈ బ్రిడ్జికి మరమ్మత్తులు చేపట్టకపోతే ఏ క్షణంలోనైనా బ్రిడ్జి మనుగడకే ప్రశ్నార్థకమవుతుంది. దాని కారణంగా ప్రజల సంక్షేమం కోసం ఆనాటి దివంగత మంత్రి స్వర్గీయ నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆశయం నెరవేరకపోగా..మళ్లీ పాత రోజులు గుర్తుకు వచ్చేలా తలపించేలా పరిస్థితి నెలకొని ఉంది. దీని పై రాష్ట్ర ప్రభుత్వం స్థానిక శాసనసభ్యుల బ్రిడ్జిని పరిశీలించి నిధులు మంజూరు చేయించి మరమ్మత్తులు చేపట్టాలని, టెలికంశాఖ వారు రోడ్డు పై గుంటలు తవ్వకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, బ్రిడ్జి కింద నుంచి వారి కేబుల్ వైర్లను డిష్ వైర్లను ఏర్పాటు చేయించుకోవాలని, ప్రమాదాలను నివారించాలని, ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. కోట – విద్యానగర్ రోడ్డు మార్గంలో హెచ్పి పెట్రోల్ బంకు వద్ద డివైడర్లు ఏర్పాటు చేశారే కానీ అక్కడ ఎలాంటి సూచిక బోర్డు లేకపోవడంతో ఏడాది కాలంలో ఎన్నో ప్రమాదాలు జరిగిన ఆర్ అండ్ బి శాఖ స్పందించకపోవడం విచారకరం అని స్థానిక ప్రజలు అంటున్నారు...

# ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాలతో బి.ఎన్ కండ్రిగలో ట్రాఫిక్ పై ప్రత్యేక డ్రైవ్

## - హెల్మెట్ అవగాహనతో పాటు నిబంధనల ఉల్లంఘనల పై చలానాలు






ప్రజాభూమి ప్రతినిధి – బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండల పరిధిలోని వాహన దారులు సీట్ బెల్ట్, హెల్మెట్, ధరించాలని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతూ..బి.ఎన్ కండ్రిగ మండలంలో స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో హెల్మెట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుల పై చలానాలు విధిస్తూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డ్రైవింగ్ మరియు ట్రాఫిక్ నిబంధనల పై వాహనదారులకు పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని డ్రైవింగ్ లైసెన్స్



లేకుండా వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. బి.ఎన్ కండ్రిగలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ దగ్గర హెల్మెట్ లేనిదే పెట్రోల్ లేదు అని హెచ్చరిక బోర్డు జారీ చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం, త్రిపుల్ రైడింగ్, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి ఉల్లంఘనల పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు పాటించని పలువురు వాహనదారులకు చలానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరిప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు మరింత కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాలని ఆయన కోరారు. అలాగే ప్రభుత్వానికి ప్రజల చలనాలు ముఖ్యం కాదు వారి ప్రాణ భద్రతే మాకు ముఖ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొని రహదారి భద్రత పై అవగాహన కల్పించారు...

# ఫ్లెమింగో ఫెస్టివల్ ను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

- జనవరి 10, 11 తేదీలలో ఘనంగా నిర్వహించనున్న పక్షుల పండగ
- ఫ్లెమింగో ఫెస్టివల్ - 2026 ను నిర్వహించేందుకు ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించాలి

ప్రజాభూమి ప్రతినిధి – తిరుపతి కలెక్టరేట్:



ఫ్లెమింగో ఫెస్టివల్ –2026 ను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లో ని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు ఫ్లెమింగో ఫెస్టివల్–2026 నిర్వహణపై కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మరియు జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ డా.రమణ ప్రసాద్ లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పులికాట్ సరస్సు పరిసర ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం జరుగుతున్న ఫ్లెమింగో పక్షుల వలస నేపథ్యంలో, 2026 జనవరి మాసంలో 10 మరియు 11 తేదీలలో రెండు రోజులు పాటు నిర్వహించబోయే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మరింత శాస్త్రబద్ధంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సంబంధించిన మైక్రో ప్లాన్ సిద్ధం చేయడం, తేదీలు ఖరారు చేయడం, కార్యక్రమాలు, పర్యాటక సదుపాయాలు, వేదికల ప్రణాళిక, పులికాట్ – నేలపట్టు, బి వి పాల్యం, అటకానితిప్ప, ఇరక్కం ఐలాండ్ , ఉబ్బలమడుగు, పెరియపాల్యం తదితర ప్రాంతాలల్లో ఏర్పాట్లు చేయుటపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌ను రాష్ట్రంలోని ముఖ్య పర్యాటక ఉత్సవంగా నిలబెట్టే విధంగా సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, అన్ని శాఖలు తమ తమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని సూచించారు. అలాగే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. వీటికి సంబంధించి పోస్టర్ , లోగో, పబ్లిసిటీ, బ్యానర్లు, డిజిటల్ బోర్డు ద్వారా విస్తృత ప్రచారం చేసేందుకు ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్–2026ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక మరియు సాంస్కృతిక అధికారి ఎం. జనార్ధన్ రెడ్డి, ఏపీటీడీసీ ఈఈ సుబ్రమణ్యం, పర్యాటక శాఖ సిబ్బంది, ఈవెంట్ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.




# రైతులకు అండగా మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు

- పంట నష్టంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు రాయితీ విత్తనాలు
- తిరుపతి పార్లమెంటరీ రైతు అధికార ప్రతినిధి మారం రెడ్డి జనార్దన్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి – చిట్టమూరు



ద్విత్వ తుఫాను నష్టాల్లో రైతులకు అండగా ప్రభుత్వం రాయితీ విత్తనాల పంపిణీ వేగవంతం. ద్విత్వ తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిని తీవ్ర నష్టాలను ఎదుర్కొన్న రైతులకు ప్రభుత్వం ఉపశమన చర్యలను వేగవంతం చేసింది. వరి పంటలు పూర్తిగా నష్టపోయిన రైతులకు రాయితీతో విత్తనాల పంపిణీ చేపట్టడం రైతులకు పెద్ద ఊరటనిచ్చింది. ఈ చర్యపై రైతులు స్పందిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గూడూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు చిట్టమూరు, అలేటిపాడు, పిట్టువానిపల్లి, పదార్తివారి కండ్రిక, రంగనాథపురం గ్రామాల్లో తుఫాను ప్రభావిత రైతుల గుర్తింపు, నష్టాల అంచనా, ఉపశమన చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. వరి పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80% సబ్సిడీతో కేఎన్ఎం 1638 రకం విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి పేదల పాలిట దైవంగా పేరుగాంచిన మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు పర్యవేక్షణ వహించారు. పలు గ్రామాల్లో పంట నష్టాన్ని ఎదుర్కొన్న రైతులకు రాయితీతో విత్తనాల పంపిణీ కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించబడింది. రైతుల సమస్యలను సమీపంగా అర్థం చేసుకుంటూ సహాయక చర్యల్లో ముందుండే వ్యక్తిగా పేరుగాంచిన తిరుపతి పార్లమెంటరీ రైతు అధికారి ప్రతినిధి మారం రెడ్డి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో చిట్టమూరు రైతు భరోసా కేంద్రంలో విత్తనాల పంపిణీ జరిగిం ది. తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులు తిరిగి సాగు పనులు ప్రారంభించేందుకు ఈ రాయితీ విత్తనాలు ఉపయోగపడనున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తమ సమస్యలను స్థానిక నాయకులకు వివరించగా, అధికారులు అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరూరు గ్రామ టిడిపి అధ్యక్షులు నెల్లమల్లి ముత్తు రాజా, మండల వ్యవసాయ అధికారి, అగ్రికల్చర్ అసిస్టెంట్ సురేష్, మండల సీనియర్ నాయకులు మనోజ్ రెడ్డి, బాబు నాయుడు, మైనార్టీ సెల్ అధ్యక్షులు రషీద్ భాయ్, దొడ్డగా వెంకటరమణయ్య, అంకబాబు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనలు, నష్టాల అంచనా, రైతులకు సాంకేతిక సూచనలు వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రైతుల పునరావాసానికి మరిన్ని చర్యలు చేపట్టేందుకు అధికారులు సమన్వయం చేస్తున్నారు.

# భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

- ముంబైలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయం నిర్మాణం
- తిరుమలలోని రహదారులకు శ్రీవారి నామాలతో పేర్లు

- టీటీడీ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం
- టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు

ప్రజాభూమిప్రతినిధి - తిరుమల.



తిరుమల తిరుపతి దేవస్తానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర?యాలు టిడిపి చైర్మన్ బిఆర్ నాయుడు తెలుపుతూ టిటిడి ఆలయాలకు ధ్వజస్తంభం, రథాలు తయారు చేసేందుకు పలమనేరులో 100 ఎకరాలలో దివ్య వృక్షాలు పెంచేందుకు నిర్ణయం. తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు అదనంగా రూ.48 కోట్లు మంజూరుకు ఆమోదం. టీటీడీ బోర్డు విద్యాశాఖ సబ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా టీటీడీలోని 31 విద్యా సంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, అందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌లు, అవసరమైన సిబ్బంది, తదితర సౌకర్యాలను కల్పించేందుకు ఆమోదం. ముంబైలోని బాంద్రా ప్రాంతంలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయం నిర్మాణానికి ఆమోదం. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలోని 20 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ప్లానింగ్ కొరకు, ఆర్కిటిక్ నియామకానికి ఆమోదం. దాతల కాటేజీల నిర్వహణ, నిర్మాణాలపై నూతన సమగ్ర విధానం తీసుకురావాలని నిర్ణయం. తిరుపతి జిల్లా తలకోనలోని శ్రీ సిద్దేశ్వర స్వామివారి ఆలయ పునః నిర్మాణ పనులలో భాగంగా రెండవ దశలో రూ.14.10 కోట్లు మంజూరు. (మొదటి దశలో రూ.4 కోట్లు మంజూరు). తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఉన్న 2100 హాస్టల్ సీట్లకు అదనంగా మరో 270 హాస్టల్ సీట్లు పెంచాలని నిర?యం. టిటిడి ఇంజనీరింగ్ విభాగంలో నాలుగు కేటగిరిలలో ఖాళీగా ఉన్న 60 పోస్టులకు ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా త్వరలో భర్తీ చేసేందుకు నిర?యం. తిరుపతిలో టీటీడీ నిర్వహిస్తున్న రోడ్ల నిర్వహణ, మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ కొనసాగించాలని నిర్ణయం. శ్రీవారి పోటులో నిబంధనల మేరకు నూతనంగా 18 పోటు సూపర్‌వైజర్ (పాచక) పోస్టులు ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయం. తిరుమలలోని రహదారులు, ప్రధాన కూడళ్ళ పేర్లను వైష్ణవ పురాణాలు, ఆళ్వార్లు, అన్నమాచార్య సంకీర్తనలలోని శ్రీవారి నామాలు, తదితర పేర్లతో మార్చేందుకు కమిటీ ఏర్పాటు చేశాం. ఈ కమిటీలో జాతీయ సంస్తృత విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం డైరెక్టర్ డా. చక్రవర్తి రంగనాథన్, అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా.మేడసాని మోహన్, పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా.డి.ప్రభాకర్ కృష్ణమూర్తిలతో కమిటీ ఏర్పాటు. శ్రీవారి ఆలయంలో ఒక ప్రధాన సన్నిధి యాదవతో పాటు అదనంగా మరో సన్నిధి యాదవ పోస్టుల ఏర్పాటు, నిబంధనల ప్రకారం భర్తీకి ఆమోదం. తిరుమలలోను, కాలిబాటలో ఉన్న పురాతన ప్రాశస్త్యం గల నిర్మాణాల పరిరక్షణ కొరకు ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేసి, అనుభవం గల అధికారుల నియమకానికి ఆమోదం. రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలులో ఉన్న మధ్యాహ్న భోజన పథకం తరహాలో టీటీడీ ఎస్వీ జూనియర్ కళాశాల, ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో డేస్కాలర్‌లకు మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయం. టిటిడి అనుబంధ ఆలయాలలో పని చేస్తున్న 62 మంది అర్చక, పరిచారక, పోటు వర్కర్లు, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్లకు వేతనాలు పెంచాలని నిర్ణయం. ఇందులో అర్చకులకు 25,000 రూపాయలు నుండి 45,000 లకు, పరిచారకులకు 23,140 రూపాయలు నుండి 30,000 లకు, పోటువర్కర్లకు 24,279 రూపాయలు నుండి 30,000 లకు ప్రసాదం డిస్ట్రిబ్యూటర్లకు 23,640 రూపాయలు నుండి 30,000 లకు పెంచడమైనది టిటిడి చైర్మన్ తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో వీరబ్రహ్మం పాల్గొన్నారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు

- ప్రకృతి వ్యవసాయంలో పలు రకాల ప్రయోగాలు
- స్థిరమైన ఆదాయంతో ఆర్థిక ఎదుగుదల
- పలువురు ప్రశంసలు, క్షేత్ర సందర్శనలు
- ప్రకృతి సాగులో హరికృష? ఆదర్శం : డిపిఎం షణ్ముగం





ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం

తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం వెంకట్రామాపురం గ్రామం దగ్గర తిరుపతికి చెందిన హరికృష్ణ ఇంజనీరింగ్ చదివిన యువకుడు పది సంవత్సరాలు అనేక సాఫ్ట్వేర్ కంపెనీలలో పనిచేసి గత రెండు సంవత్సరాలుగా వెంకట్రామపురం గ్రామం దగ్గర మూడెకరాల భూమిని లీజుకు తీసుకొని ప్రకృతి వ్యవసాయంలో అనేక ప్రయోగాలు చేసి ప్రతి మనిషికి నిత్యం అవసరపడే ఆకుకూరలు కూరగాయలు దాదాపు 20 రకాలు పంటలు పండిస్తూ యువతలకు ఆదర్శంగా నిలిచారు. మంగళవారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మరియు రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరణ మరియు శిక్షణ కొరకు, తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం వారి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఫార్మర్ మాస్టర్ ట్రైనర్స్ మరియు ఐ సి ఆర్ పి కు ఐదు రోజులు శిక్షణలో భాగంగా హరికృష్ణ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను 150 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో సందర్శించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రిందట తనకు వ్యవసాయం గురించి పూర్తిగా తెలియదని, తను పది సంవత్సరాలుగా దేశ ఇతర దేశాలలో పలు సాఫ్ట్వేర్ కంపెనీలలో పని చేశానని అన్నారు. తను వివిధ రకాల వ్యాపారాలు చేయాలని ఆలోచనలతో మొదలైనదే ప్రకృతి వ్యవసాయ సాగుతో పలు రకాల కూరగాయలు ఆకుకూరలు పండించే విధానాలకు శ్రీకారం చుట్టానన్నారు. ప్రకృతి వ్యవసాయం, ఆర్గానిక్ వ్యవసాయం గురించి అనేకమంది రైతులతో కలిశానని వారి యొక్క సూచనలు సలహాలతో వ్యవసాయాన్ని ప్రారం భించామన్నారు. తిరుపతిలో ప్రత్యే కంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అమ్మే విధంగా షాప్లు ప్రారంభించాను అన్నారు. ప్రస్తుత కాలంలో కలుషితం లేని ఆహారం ప్రతి ఒక్కరికి అవసరమని, అలాంటి ఆహార ఉత్పత్తుల కొరకు ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. శిక్షణలో భాగంగా విచ్చేసిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు తన యొక్క సూచనలు విధానాలు తెలియపరిచారు. ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు వాళ్లు పండించే పంటలకు మంచి మార్కెట్ అందించగలరని భరోసా ఇచ్చారు. మొదట భూమిని సారవంతం చేస్తేనే మంచి దిగుబడి వస్తుందన్నారు. ముఖ్యంగా మనం ప్రకృతి వ్యవసాయ రైతులుగా కొనుగోలు దారులకు మంచి నమ్మకం కలిగించాలని సూచించారు. ఈ సందర్భంగా డిపిఎం షణ్ముగం మాట్లాడుతూ లక్షల్లో జీతం తీసుకుంటూ లగ్జరీగా జీవించే యువకుడు హరికృష్ణ ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తూ అందరికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రకృతి వ్యవసాయ రైతులు కార్యకర్తలు లకు మంచి మార్కెటింగ్ సదుపాయాలను హరికృష్ణ సమన్వ యంతో పెద్ద ఎత్తున మన తిరుపతి జిల్లాలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు పండించి మనం ఆర్థికంగా ఎదగడమే కాక ప్రజల ఆరోగ్యాలను భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ హరికృష్ణ విధానాలను అలవరించుకొని జిల్లాలోని రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పి బానుమూర్తి, భూలక్ష్మి సీఈవో గంగాధరం, మధు, నీలమ్మ, జేతుంబి, శ్రీదేవి, బాబాసాహెబ్,అయ్యప్ప నాయుడు, 150 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు దారుణం

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రద్దు బిల్లును దగ్ధం చేసి నిరసన

ప్రజాభూమి ప్రతినిధి నారాయణవనం



కేంద్ర ప్రభుత్వం నిన్న పార్లమెంటులో గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుచేస్తూ పెట్టిన బిల్లును ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పుత్తూరు అంబేద్కర్ కూడలి వద్ద దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందఠరేగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ నాడు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ యూపీఏ ప్రభుత్వంలో వలస కూలీల నివారణ కొరకు జాతిపిత అయిన మహాత్మా గాంధీ పేరుతో గ్రామీణ ఉపాధి హామీ పథకం గా చట్టం చేసి కూలీలకు సంవత్సరానికి 100 రోజులు కల్పించేందుకు చట్టం చేసి తగిన బడ్జెట్ ను కేటాయించడం జరిగింది అని తెలిపారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీని ఒకవైపు పొగుడుతూ మరోవైపు ఆయన పేరుతో ఉన్న పథకాన్ని పూర్తిగా రద్దుచేసి మరో కొత్త పథకాన్ని తీసుకురావడం దారుణం అన్నారు. కొత్తగా వచ్చిన పథకంలో పేరుకు 125 రోజులు పెంచినప్పటికీ రైతులకు వ్యవసాయ పనుల సీజన్లో 60 రోజుల పనిని నిషేధించారని తెలిపారు. ఉపాధి హామీ చట్టంగా కాకుండా కేవలం కేంద్ర ప్రభుత్వం పథకంగా మార్చారని ఆరోపించారు . గతంలోఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు మంజూరు చేసి, రాష్ట్ర ప్రభుత్వం 10% జమ చేస్తాయని గుర్తు చేశారు. ప్రస్తుత నూతన చట్టం వల్ల 60 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విధంగా చూస్తే వ్యవసాయ కూలీలకు కడుపు కొట్టే పనిని బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిందని దుయ్యబట్టారు. ఈ నూతన చట్టంపై రాష్ట్ర ప్రభుత్వాలు మరో చట్టం చేయాలని రాష్ట్రాలు ఆదేశించడం చూస్తే ఈ పథకం అమలు ప్రశ్నార్థకంగా భవిష్యత్తులో ఉంటుందని ఆందోళన వెలుబుచ్చారు భవిష్యత్తులో ఈ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు కూడా ఉద్యోగ భద్రత లేదని తెలిపారు, ఉపాధి కూలీలకు గ్యారెంటీగా కల్పించే ఎంఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని రద్దు చేయడం దారుణమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే పాత పద్ధతిలోనే పథకాన్ని కొనసాగించి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి, రోజుకు 600 రూపాయల వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కూలీలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ముని శంకర్ ,రాజేష్, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, చిన్నబ్బ ,నరసింహులు, రమేష్ ,ఆటో యూనియన్ నాయకులు విజయ్, దళిత గిరిజన సంఘం నాయకుడు నందయ్య తదితరులు పాల్గొన్నారు

# సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

**-ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ ధర్నా కార్యక్రమం**
**-కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి చిరంజీవి రెడ్డి, రామానాయుడు**

ప్రజాభూమి ప్రతినిధి - తిరుపతి కలెక్టరేట్:



సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని తిరుపతి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి చిరంజీవి రెడ్డి, గూడూరు డివిజన్ రామానాయుడు డిమాండ్ చేయడం జరిగినది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్ ఆఫీస్ నందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సహకార శాఖ అధికారిని నాగవర్ధనకి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సభ్యులు అర్జీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సహకార సంఘ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



# బుగ్గ వీధిలో ఉన్న మిర్యాల బాబా దర్గాను దర్శించుకున్న బొజ్జల బృందమ్మ

ప్రజాభూమిప్రతినిధి - రేణిగుంట



రేణిగుంట పట్టణంలోని దర్గాను బొజ్జల బృందమ్మ దర్శించుకున్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీతో పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గెలుపు సాధిస్తే దర్గా దర్శనం చేసుకుంటానని బొజ్జల బృందమ్మ మొక్కుకున్నారు. ఆ మొక్కును తీర్చుకునే క్రమంలో ఈ దర్గా ను సందర్శించినట్లు అమె తెలిపారు. ఈ సందర్భంగా రేణిగుంట పట్టణ మైనార్టీ అధ్యక్షుడు మహబూబ్ బాషా తో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కలిసి దర్గా లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నాయకత్వంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ఆయనకు ఇంకా ఉన్నతమైన బాధ్యతలు లభించాలని ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు. అలాగే శ్రీకాళహస్తి ప్రజలు సుఖసంతోషాలతో, శాంతియుతంగా జీవించాలని ప్రార్థనలు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనారు.

# తిరుపతి రూరల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

**-ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యే నాని, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి హాజరు**

ప్రజాభూమిప్రత్యేకప్రతినిధి - తిరుపతి



చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తిరుపతి రూరల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డిలు పాల్గొన్నారు. అందులో మండలంలోని ఉమ్మడి పద్మావతిపురం, శ్రీనివాసపురం పంచాయతీలకు చెందిన స్మశానవాటికలో అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే టెంకాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం డ్రైనేజ్ కాలువ నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలలో ప్రారంభత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే, తుడా చైర్మన్ లకు మండల స్థాయి అధికారులు కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.సుమారు 13లక్షల 35 వేల తుడా నిధులతో డ్రైనేజ్ కాలువ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, తుడా చైర్మన్ భూమి పూజ చేసి ప్రారంభించారు.కార్యక్రమంలో అధికారులు,కూటమి ప్రభుత్వంనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి సమన్వయ సమావేశం

ప్రజాభూమిప్రతినిధి - బుచ్చినాయుడుకండ్రిగ



తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని వెలుగు కార్యాలయంలో రైతు సాధికార సేవా సంస్థ స్వయం ఉపాధి గ్రామీణ మహిళా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద కొత్తగా ఎంపికైన గ్రామాలపై మండల స్థాయి మహిళా సమాఖ్య సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి కె షణ్ముగం, వ్యవసాయ విస్తరణ అధికారి మునెయ్య, మండల సమాఖ్య నిర్వాహకురాలు ప్రభావతి, సమాఖ్య సమన్వయకులు, సమాజ వనరుల వ్యక్తులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాల అమలు, రైతుల ఆరోగ్య పరిరక్షణ, మహిళా సంఘాల పాత్ర, గ్రామస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి ఖర్చులు తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

## సామజిక సేవలో కండ్రిగ శిరీష మరో ముందడుగు

ప్రజాభూమిప్రతినిధి - శ్రీకాళహస్తిటౌన్



మహారాష్ట్ర స్టేట్ ఔరంగాబాద్ జిల్లాలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. అవార్డులు వచ్చినవారిలో శ్రీకాళహస్తి చెందిన శిరీష కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్ శ్రీకాళహస్తి పట్టణ కార్యాలయంలో ఆమెకు శాలువాతో సత్కరించి అభినందించారు. మానవ హక్కుల పోరాటంలో పేదవారికి చేసిన సేవలను గుర్తించి ప్రపంచ మానవ హక్కుల మండలి ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్ చేతులు మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ అవార్డు వచ్చినందుకు చాల సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా రానున్న రోజుల్లో మానవ హక్కుల సేవల్లో పేదవారి లేని సమాజంగా చేయాలన్నదే నా లక్ష్యమని శిరీష ఈ కార్యక్రమంలో మానస, విష?వర్ధన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు, పంచాయితీ భవనాల పనులు త్వరితగతిన చేపట్టాలి

**- కలెక్టర్, ఆర్ అండ్ బి, పీఆర్ అధికారులకు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి**

ప్రజాభూమి ప్రతినిధి నారాయణవనం



సత్యవేడు నియోజకవర్గం లోని దుస్థితిలో ఉన్న రోడ్లు, మంజూరైన పంచాయితీ భవనాలు పనులు త్వరిత గతిన ప్రారంభించి, పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఈఈ రాజా నాయక్, పంచాయితీ రాజ్ ఈఈ మధుసూదన్ లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఆర్ అండ్ బి మరియు పంచాయితీ రాజ్ కార్యాలయాలకు ఎమ్మెల్యే చేరుకొని కలెక్టర్ మరియు ఇంజనీరింగ్ ఉన్నతాధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగలాపురం టౌన్ లో రోడ్డు అధ్వానంగా తయారయ్యిందని, వెంటనే సిమెంట్ కాంక్రీట్ రోడ్డు వేయించాలని కోరారు. కెవిబి పురం మండలంలోని సికె పూడి కాజ్ వే ఇప్పటికి 5 సార్లు కొట్టుకు పోయిందని, ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అలాగే సత్యవేడు నియోజకవర్గంలో మంజూరైన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. తన వినతులకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు సహా ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం వెల్లడించారు.



## నా బిడ్డకు ప్రాణ బిక్షపెట్టండి

**ప్రాణాపాయం నుండి కాపాడండి - ఓ తల్లి వేడుకొలు**

ప్రజాభూమి ప్రతినిధి - కోట



తిరుపతి జిల్లా గూడలి గ్రామముకు చెందిన ధనరాసి.మల్లిఖార్జున్ కి ఇటీవల చిట్టేడు దగ్గర ఆటో ఢీ కొట్టడంతో జరిగిన ఆక్సిడెంట్ లో తీవ్రంగా గాయపడిన మల్లికార్జున్, ప్రాణాలు కోల్పోయిన మల్లికార్జున భార్య లావణ్య. ప్రస్తుతం మల్లిఖార్జున ప్రాణా పాయ స్థితిలో వెంటిలేటర్ మీద ఉన్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం 12 లక్షలు అవుతుందని డాక్టర్లు తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడాని ఆ తల్లి అంత డబ్బులు పెట్టుకునే స్థితి లేక కొడుక్కి ప్రాణ బిక్ష పెట్టమని దాతులను వేడుకుంటుంది. మానవతా దృక్పథంతో దాతలు తన బిడ్డ ప్రాణాలు నిలుపుటకు సహాయం చేయాలని వేడుకుంటుంది. దాతలు ఎవరైనా ఉంటే ఈ అకౌంట్ నెంబర్ కి సహాయం చేయగలరని ప్రాధేయపడుతుంది...



## భవన నిర్మాణ కార్మిక సంఘం జెండా ఆవిష్కరణ

### విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి -సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పీఎం తిరుమలరెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి - సత్యవేడు: విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి4 2026 తేదీ వరకు జరుగు అఖిలభారత్ సిఐటియు ఈ మహాసభల సందర్భంగా రాష్ట్ర కమిటీ రాష్ట్రమంతటా వాడవాడలా సిఐటియు కార్మిక జెండాలు ఎగరవేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీఐటీయూ జెండా ఎగుర వేసి అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పీఎం తిరుమలరెడ్డి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సత్యవేడు మండలం మదనంబేడు భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ రోజు ఉదయం ఏడు గంటలకు భవన నిర్మాణ కార్మిక సంఘం మదనంబేడు గ్రామ అధ్యక్షులు యేసయ్య సీఐటీయూ జెండాను ఆవిష్కరణ చేసినట్లు తెలియజేశారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభలు ప్రధానంగా ఉద్యోగ కార్మికులు అసంఘటిత రంగ కార్మికులు స్కీం వర్కర్లు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన డిమాండ్ల మీద ఐదు రోజులు మహాసభలలో చర్చించి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాబోవు మూడు సంవత్సరాల కాలంలో కార్మికులు చేయవలసిన పోరాటాలు సాధించుకోవాల్సిన విజయాల మీద దిశ నిర్దేశం చేస్తారని కార్మికులందరూ విశాఖలో జరిగే అఖిలభారత మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులందరికీ విజ్ఞప్తి చేశారు. మహాసభ డిమాండ్ లేబర్ కోడ్లను రద్దు చేయాలి, కనీస వేతనం నెలకి 26,000 ఇవ్వాలి, బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ బోర్డును పునరుద్ధించాలి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి, విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి, కనీస పెన్షన్ నెలకు 9000 ఇవ్వాలి, ఓపిఎస్ ను అమలుపరచాలి. మొదలగు ప్రధాన డిమాండ్ల అమ్ములు కోసం మహాసభ జరుగుతుందని తెలియజేశారు ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మునస్వామి. దినకరన్ ఢిల్లీ బాబు ఎం జి నాగరాజ్ రామ్మూర్తి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సారు ఓపెన్ చెయ్యండి సర్కారు ఆసుపత్రి

- బత్తలవల్లం సచివాలయం పరిధిలో కానరాని వైద్య ఆలయ సిబ్బంది
- వైద్య సేవ కోసం నిరీక్షిస్తున్నవృద్ధులు షుగర్ పేషంట్లు
- వైద్య సిబ్బందిని ప్రజలకి అందుబాటులో ఉంచాలని ఓడూరు ఉజ్వలరెడ్డి డిమాండ్




ప్రజాభూమిప్రతినిధి - వరదయ్యపాలెం తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం పంచాయతీ సచివాలయ కేంద్రంలో ప్రజారోగ్యంపై సంబంధిత అధికారులు పరిహాసం చేసినట్లుగా పలువురు ప్రజలు వాపోతున్నారని ఓడూరు ఉజ్వలరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వరదయ్యపాలెం మండలంలో పెద్ద పంచాయతీలో ఒకటిగా గుర్తింపు పొందిన బత్తలవల్లం పంచాయతీ ప్రస్తుతం స్థానిక పంచాయతీ జనాభాతో పాటు ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా గుర్తింపు పొందిన శ్రీసిటీ పరిశ్రమల్లో సుధీర ప్రాంతాల నుండి ఇక్కడ పనిచేస్తున్న వారి జనాభా సంఖ్య వేళ్ళలో ఉంది కానీ ఈ సచివాలయ పరిధిలో గత కొన్ని రోజులుగా వైద్య సిబ్బంది కానరాకపోవడంతో వైద్యం కోసం వచ్చిన వృద్ధులు, షుగర్ పేషెంట్లు గంటల తరబడి ఎదురు చూసి చూసి చివరకు తీవ్ర మనో వేదనకు గురై నీరసంతో వెనిదిరిగిపోవడం సర్వసాధారణం అయిపోయింది. ఇక్కడ సిబ్బందికి ఫోన్ చేసై మేము సర్వేలో ఉన్నాం పిహేచ్ లో ఉన్నాం అంటూ సమాధానం ఇస్తున్నారు అని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన ప్రజారోగ్యం ప్రజల చెంతకే అన్న నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని ఈ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ ప్రజారోగ్యాన్ని పరిహాసం చేస్తున్నట్లు వ్యవహరిస్తుంది అనడానికి నిదర్శనం ఈ కానరాన్ని వైద్య సిబ్బందే ఇందుకు నిదర్శనం కోడూరు ఉజ్వల రెడ్డి కూటమి ప్రభుత్వంపై ఆరోపించారు. దానితోపాటు రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేక పోవడంతో రోగులు తీవర ఇబ్బందులకు గురౌతున్నారు ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి ఈ పంచాయతీలో గతంలో జరిగిన అనుభవాలు దృష్టిలో ఉంచుకుని మళ్లీ అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఇకనైనా పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో సత్యవేడు నియోజకవర్గాల్లో అన్ని ఆరోగ్య కేంద్రాలలో వైద్యసిబ్బందిని రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజారోగ్యం కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన గుర్తు చేశారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలకు జీవనోపాధినిస్తోంది-ఎంజిఎన్ఆర్ఇజిఎస్

- పథకాన్ని కేంద్ర ప్రభుత్వం చక్కగా అమలు చేస్తోంది-ఉపాధి హామీ పథకం పేదలకు భరోసా నిస్తోంది-చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు
- ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం అమలుకు సంబంధించిన వివరాలను కోరిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు
- చిత్తూరు ఎంపీ ప్రశ్నకు సమాధానమిచ్చిన కేంద్రప్రభుత్వం



ప్రజాభూమిప్రతినిధి - చిత్తూరు బ్యూరో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలకు జీవనోపాధినిస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు.లబ్ధిదారుల ఖాతాలకు వేతన చెల్లింపులు చేస్తూ, వారికి భరోసా నిస్తోందన్నారాయన. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం చక్కగా అమలు చేస్తోందని కొనియాడారు.న్యూఢిల్లీ పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన వివరాలను లిఖిత పూర్వకంగా రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన శాఖలు తక్షణం స్పందించి, లిఖిత పూర్వకంగా జవాబులు ఇస్తున్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు వివరించారు.

**ఇందులో భాగంగా మంగళవారం గత ఐదేళ్లలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వథకం ఎంజిఎన్ఆర్ఇజిఎన్**

కింద ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నిధులు, పంపిణీ చేసిన నిధుల మొత్తం వివరాలు,ఏజిల్లాలకు ఎంత నిధులు విడుదల చేయబడ్డాయిఏ రకాల పనులు చేపట్టబడ్డాయి. అలాగే కేటాయించిన పనిదినాలు,బకాయిలు, ఎంత మంది పేదలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అన్న అంశాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని లిఖిత పూర్వకంగా, సంవత్సరంతో పాటు జిల్లాలవారికి తమకు అందించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కమలేష్ పస్వాన్ కోరగా, ఇందుకు ఆయన తక్షణమే స్పందించి వివరాలను అందజేసినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. 2025-12-10వ తేదీ నాటికి, ఆంధ్రప్రదేశ్‌లో వేతన చెల్లింపు బకాయిలు ?413.72 కోట్లు, సామగ్రి భాగానికి బకాయిలు ?573.62 కోట్లు ఉన్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అందించిన సమాచారాన్ని బట్టి తెలుస్తోందని ఆయన చెప్పారు. డిమాండ్-ఆధారితవేతన ఉపాధి పథకమైన ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్రపాలిత ప్రాంతం-వారీగా నిధుల కేటాయింపు లేదని చెప్పిన చిత్తూరుఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, 2024-25-7,707.21 కోట్లు, 2023-24-7,353.67 కోట్లు, 2022-23-8,008.81 కోట్లు, 2021-22-7,195.81 కోట్లు, 2020-21-10,306.30 కోట్ల రూపాయలు ఆంధ్రప్రదేశ్కు కేటాయించినట్లు కేంద్ర మంత్రి ఇచ్చిన సమాధానం ద్వారా తెలుస్తోందనిచిత్తూరుఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు.

## శ్రీసిటీలోని స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తులు

### -లాంఛనంగా తరలించిన శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి - శ్రీసిటీ వరదయ్యపాలెం శ్రీసిటీలోని స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తులను మొట్టమొదటగా సోమవారం మార్కెట్ లోకి విడుదల చేశారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున పరుచూరి సమక్షంలో శ్రీసిటీ డైరెక్టర్ సీఎస్సార్ నిరీషా సన్నారెడ్డి లాంఛనంగా కంపెనీ ఆవరణ నుంచి ఉత్పత్తుల వాహనాన్ని తరలించారు. వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు శానిటరీ న్యాప్‌కిన్స్ తయారు చేసే ఈ కంపెనీ ఈ ఏడాది 5న వి ఎస్ ఎన్ ఎల్ మాజీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి చేతుల మీదుగా ప్రారంభమైంది. శరవేగంగా ఉత్పత్తులు మొదలు పెట్టి సుమారు 10 లక్షల రూపాయల విలువ చేసే తొలి ఉత్పత్తులను విజయవాడకు పంపింది. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ.. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యతతో కూడిన ఉత్పత్తులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ తొలి ఉత్పత్తుల విడుదలతో వాణిజ్య కార్యకలాపాలకు శ్రీకారం చుట్టామని రాబోయే రోజుల్లో మరిన్ని కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శ్రీసిటీలో అనుకూల పారిశ్రామిక వాతావరణం, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ మద్దతు తమ వ్యాపార అభివృద్ధిలో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. స్మైల్ ఎకో ఉత్పత్తులు మార్కెట్ కు విడుదల పట్ల కంపెనీ ఎండీ, సిబ్బందికి నిరీషా సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. స్థానికుడు, శ్రీసిటీ ఉద్యోగి నుంచి పారిశ్రామికవేత్తగా మల్లికార్జున పయనం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. స్థానిక యువతకు మరింత ఉపాధి కల్పించే దిశగా కంపెనీ ఇంకా వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు...

## శ్రీకాళహస్తి నారాయణ పాఠశాలలో విజయ్ దివాస్ వేడుకలు ఘనంగా



ప్రజాభూమిప్రతినిధి - శ్రీకాళహస్తి టౌన్ శ్రీకాళహస్తి పట్టణంలోని నారాయణ పాఠశాలలో విజయ్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వర్ మాట్లాడుతూ, భారతదేశం పాకిస్తాన్ మధ్య 1971లో జరిగిన యుద్ధంలో భారత్ సాధించిన చారిత్రాత్మక విజయాన్ని స్మరించుకునే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం డిసెంబర్ 16న విజయ్ దివాస్‌ను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. 1971 డిసెంబర్ 16న పాకిస్తాన్ సైన్యం భారత్ ముందు లొంగిపోవడంతో బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా అవతరించిందని ఆయన వివరించారు. ఈ విజయం ద్వారా భారత సైన్యపు ధైర్యం, త్యాగం, వ్యూహాత్మక ప్రతిభ ప్రపంచానికి స్పష్టంగా తెలిసిందని పేర్కొన్నారు.విజయ్ దివాస్ దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్లకు నివాళి అర్పించే రోజుగా, భారత సైన్యం సాధించిన అత్యంత ఘన విజయాల్లో ఒకటిగా, దేశభక్తి మరియు జాతీయ ఐక్యతను మరింత బలపరచే సందర్భంగా ప్రాముఖ్యతను సంతరించుకున్నదని ఈశ్వర్ అన్నారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు భారత ఆర్మీ సైనికులవిద్యార్థిని విద్యార్థులు స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు వేషధారణలో, విద్యార్థిని విద్యార్థులు స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైదాపురం ను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలి



ప్రజాభూమి ప్రతినిధి - సైదాపురం: సైదాపురం మండలంను నెల్లూరు జిల్లాలోని కొనసాగించాలని ఉమ్మడి ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నినాదాలతో నిరసన కార్యక్రమం ను నిర్వహించారు. తదుపరి తహసిల్దార్ సుభద్రా కి వినతి పత్రం అందజేశారు.అనంతరం




పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా డిపి పోలయ్య మాట్లాడుతూ నెల్లూరు జిల్లాతో అనాది కాలం నుండి ప్రాంతీయ యాస భాష బంధు వర్గంతో ముడిపడి ఉన్నందున సైదాపురం మండలం ను నెల్లూరు జిల్లాలోని కొనసాగించాలన్నారు.

## భువనేశ్వరి దేవి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలక కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రజాభూమి ప్రతినిధి - గూడూరు టౌన్ తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని భువనేశ్వరి దేవి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలక కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పాశం.సునీల్



కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం నూతన పాలక కార్యవర్గ కమిటీ చైర్మన్‌గా అరికట్ల బాలకృష్ణ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు కమిటీ సభ్యులు కూడా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పాశం.సునీల్ కుమార్ మాట్లాడుతూ..దేవస్థానాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు. సామాన్యులకు కూడా కమిటీ పదవులు ఇవ్వడం ద్వారా దేవాలయ పాలన మరింత పారదర్శకంగా, ప్రజలకు అనుకూలంగా మారుతుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు...

## మహిళలకు ఉచిత వైద్య శిబిరం




ప్రజాభూమిప్రతినిధి - నగరి స్థానిక ఏజేఎస్ కళ్యాణ మండపంలో సఖీ సురక్ష పథకంలో మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మెప్మా పీడీ రవీంద్ర ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యము పై అవగాహన పెంచుకొని ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నేషనల్ అర్బన్ మిషన్ క్రింద థైరాయిడ్ ,షుగర్ ,విటమిన్ లోపం ,సర్వైకల్ క్యాన్సర్ ,బ్రెస్ట్ క్యాన్సర్ ,హైజీనిక్ క్యాన్సర్, ఎనీమియా , ప్రోటీన్ లోపం, మెంటల్ ఇల్‌నెస్ కౌన్సిలింగ్ వంటి 16 రకాల టెస్ట్ లు చేస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ మెప్మా ద్వారా నిర్వహిస్తున్న సఖి సురక్ష స్క్రీనింగ్ టెస్ట్‌లు ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ఈ క్యాంప్ పెట్టడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో 530 మంది మహిళలు బ్లడ్ శాంపిల్ ఇచ్చి పరీక్షలు చేసుకొన్నారు. ఈ శిబిరంలో విజయవాడ నుండి విచ్చేసిన వైద్యసిబ్బంది వైద్యసేవలు అందించారు. నగరి టిడిపి పట్టణ అధ్యక్షులు గుణశేకర్, కార్యదర్శి శ్రీనివాసన్, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ హిమబిందు, మెప్మా సీఎంఎం ప్రసాద్, కమ్యూనిటీ ఆర్గ నైజర్లు, రిసోర్స్ పర్సన్లు, హెల్త్ రిసోర్స్ పర్సన్లు, డ్వాక్రామహిళలు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో చోళ యంస్ జనరల్ ఇన్సూరెన్స్ బాధితుడుకి ప్రమాద బీమా చెక్కు అందజేత




ప్రజాభూమి ప్రతినిధి - శ్రీకాళహస్తి టౌన్ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, ఎగువవీధి బ్రాంచ్ ఆధ్వర్యంలో చోళ యంస్ జనరల్ ఇన్సూరెన్సు ద్వారా పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్సు క్లెయిమ్ ను విజయవంతంగా పరిష్కరించడంజరిగింది. చుక్కలనిడిగల్లి గ్రామానికి చెందిన సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యురాలు పి.రాధ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పర్సనల్ యాక్సిడెంటల్ స్కీముకు ఎన్రోల్మెంట్ జరిగినది. ఇటీవల జరిగిన యాక్సిడెంట్లో పి రాధ మరణించడం జరిగినది. ఆమె నామినీ కి చోళ యంస్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు రూ.5,00,000/- రూపాయలు విలువైన చెక్కును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ పి.ప్రకాష్ రత్న బాబు చేతుల మీదుగాచెక్కునుఅందజేయడం జరిగింది. ఈ చెక్కు పంపిణీ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ పి. ప్రకాష్ రత్న బాబు, చోళ యంస్ జనరల్ ఇన్సూరెన్సు మేనేజర్ యస్వంత్, బ్రాంచ్ మేనేజర్ యస్. బాల నరసింహం, ఇన్సూరెన్సు రిప్రెసెంటేటివ్స్ మరియు బ్రాంచ్ స్టాఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ పి.ప్రకాష్ రత్న బాబు మాట్లాడుతూ..ఈ బీమా మొత్తాన్ని చనిపోయిన పి.రాధ కుమార్తె భవిష్యత్ విద్యా మరియు కెరీర్ అభివృద్ధి కోసం వినియోగించుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మరియు చోళ యంస్ జనరల్ ఇన్సూరెన్సు సంస్థలు వినియోగదారుల సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉన్నాయని తెలియజేశారు...

## అస్వస్థతకు గురైన కాగితాలు ఏరుకునే పేద కార్మికుడికి, ఏఎన్ఎం, ఆశా వర్కర్ల సేవలు



ప్రజాభూమి ప్రతినిధి - తిరుచానూరు స్థానికంగా కాగితాలు ఏరుకునే పేద కార్మికుడు అనారోగ్యానికి గురవడంతో..ఏఎన్ఎం కుమారి, ఆశా వర్కర్లు టీ.జ్యోతి, యశోదలకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన వారు అక్కడికి వచ్చి బాధితుడిని పరిశీలించి అవసరమైన వైద్యం అందించారు. అతనికి తగిన మందులు, మాత్రలు అందజేయడంతో పాటు, ఏం తినాలి, ఏం తినకూడదు అనే అంశాల పై స్పష్టమైన ఆరోగ్య సలహాలు ఇచ్చారు. అలాగే విశ్రాంతి తీసుకోవాలని అవసరమైతే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యతతో పనిచేస్తూ, పిలిచిన వెంటనే స్పందించి సేవలు అందించిన ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు స్థానికులు అభినందనలు తెలిపారు...

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ప్రజాభూమిప్రతినిధి - విజయపురం చదువుకునే వయస్సులో చదువు మీద మాత్రమే ఏకాగ్రత కలిగి ఉండాలని, ఇతర ఆకర్షణలకు లోనైతే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేరని, బాల్య వివాహాలు చేసుకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయని సీడీపీవో ఇందిరాప్రియదర్శి అన్నారు. వంద రోజుల జాతీయ ప్రచారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పన్నూరు ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ 18 సంవత్సరం నిండ కూడా ఆడ పిల్లలు ఎవ్వరు వివాహం చేసుకోకూడాదని ఆమె తెలిపారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు బాల్య వివాహంపై అవగాహన ఇవ్వాలని సూచించారు. ఎక్కడైన బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే స్థానిక అంగన్‌వాడీ, ఏఎన్ఎం, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం బాల్యవివాహంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కే శ్యామల, లక్ష్మి, విద్యార్థిణిలు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 11

మంగళవారం 16 డిసెంబర్ 2025


# తొండవాడ పంచాయతీలో 8 సం" చిన్నారికిడెంగ్యూ జ్వరం నిర్ధారణ..!

## -సమాచారం అందిన తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే పులివర్తి నాని..

## -ఎమ్మెల్యే ఆదేశాలతో వైద్య శాఖ, పంచాయతీ శాఖ అధికారులు-వెంటనే స్పందన..

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి మండలం, తొండవాడ పంచాయతీలో డెంగ్యూ జ్వర భయం నెలకొంది. గత వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన 8 సంవత్సరాల చిన్నారికి తీవ్ర జ్వరంతో వైద్య పరీక్షలు నిర్వహించగా, డెంగ్యూ జ్వరం అని నిర్ధారణ అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.అయితే ఘటన జరిగిన వారం రోజుల అయినా గ్రామాన్ని పరిశీలించని అధికారులు. అధికారులు స్పందించక పోవడంతో గ్రామస్తులు



ఎవరికి వారే తమ ఇండ్ల చుట్టు పక్కల ప్రాంతాలను స్వయంగా శుభ్రం చేసుకుంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమేనని ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ విషయమై స్థానికులఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని ఎంపీడీవోతో మాట్లాడి సమస్యపై చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో,ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైద్యశాఖ, పంచాయతీ శాఖ అధికారులు గ్రామంలో పరిస్థితిని పరిశీలించారు. డెంగ్యూ జ్వరానికి గల కారణాలను తెలుసుకునేందుకు సమీప పరిసరాలను వైద్య మరియు పంచాయతీ సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ విషయంపైవైద్య సిబ్బంది స్థానికులకు ఆరోగ్య సూచనలు అందిస్తూ, దోమల



నుంచి రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడం వల్లే దోమలు వృద్ధి చెంది డెంగ్యూ వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నట్లు అధికారులు గుర్తించారు. తక్షణమేగ్రామంలో శానిటేషన్ పనులు చేపట్టి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రపరిచి, బ్లీషింగ్ చల్లించారు. ఈసందర్భంగా అధికారులు ప్రజలతోమాట్లాడుతూ ఇంటి ఆవరణంలో నీరు,వ్యర్థాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎక్కడైనా ఆరోగ్య సమస్యలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.విషయం తెలుసుకొని అధికారులను గ్రామంలోకి పంపించిన ఎమ్మెల్యే పులివర్తి నాని కి స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# సురుటుపల్లి మహాశివరాత్రి ఏర్పాట్లకు సీల్డ్ టెండర్లు

నాగలాపురం ప్రజా భూమి ప్రతినిధి

శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం నందు 2026 ఫిబ్రవరి నెలలో జరగబోవు మహాశివరాత్రి బ్రహ్మోత్సవములకు పలు ఖర్చులు నిమిత్తం సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించారు. వచ్చిన సీల్డు కొటేషన్లను ఆలయ చైర్మన్ పద్మనాభ రాజు ఆధ్వర్యములో ఆలయ కార్య నిర్వహణాధికారిణి లత సమక్షములో సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమమునకు పర్యవేక్షణ అధికారిగా రామగిరి గ్రూపు దేవాలయముల కార్యనిర్వహణాధికారి హేమచంద్ర పాల్గొన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సీల్డ్ కొటేషన్ల ద్వారా తక్కువ కొటేషన్ ఈ క్రింది విధంగా వచ్చాయని ఈవో



తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవములకు 11 రోజులకు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తుల ఊరేగింపునకు మరియు దేవతామూర్తులకు పూలమాలలు సప్లై చేయటకు గాను కాంచీపురం కు చెందిన మూర్తి 4,52,000/- రూపాయలతో తక్కువ కొటేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు . ఆలయమునకు, ఆలయ ప్రాకారమునకు ప్రత్యేక విద్యుత్ అలంకరణ కొరకు తిరుత్తనికి చెందిన ఎస్.గోకుల్ రు.6,45,000/- లతో తక్కువ కొటేషన్ దాఖలు చేశారన్నారు. ఆలయం నందు వసతి గృహములకు, ప్రహరీ గోడ, అన్నదాన భవనము, టూరిజం కారిడార్ భవనమునకు, మొదలకువాటికి రంగులు వేయుటకు రంగులు సరఫరా చేయటకు గాను ఊతుకోటకు చెందిన సుజాత ట్రేడర్స్ వారు రు.1,76,743/-లు తక్కువ కొటేషన్ వేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవములు 11 రోజులకు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులు ఊరేగింపును గాను మోత మోయుటకు తిరుత్తని కి చెందిన కే. మహేష్ రు.1,56,000/- తక్కువ కొటేషన్ దాఖలు చేయగా, మహాశివరాత్రి బ్రహ్మోత్సవంలో 11 రోజులకు యాగశాల పూజలు, వేద పారాయణం, పరిచారకత్వం నిర్వహించుటకు అర్చకుల సంభావన కొరకు ఎస్.రాజేష్ రామ్ అర్చకులు రు.1,48,000/- లతో తక్కువ కొటేషన్ దాఖలు చేసారు. యాగశాల కొరకు నైవేద్య ప్రసాదములు మరియు త్రికాల నైవేద్యములు, భక్షణ ప్రసాదములు తయారు చేయుటకు గాను ప్రసాదం తయారు చేయు అర్చకుల సంభవన కొరకు రోజుకు రు.6,000/- లు తక్కువ కొటేషన్ దాఖలు చేయడమైనది. మిగిలిన ఖర్చులకు అనగా ఆలయం నందు బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక పుష్పాలంకరణ కొరకు, నిత్య అన్నదానం తయారు చేయు బ్రాహ్మణులకు మరియు స్వామి అమ్మ వాళ్ల ఉత్సవమూర్తులు అలంకరణ చేయు బ్రాహ్మణుల సంభావన కొరకు ఏ ఒక్కరు డిపాజిట్ చెల్లించి కొటేషన్ దాఖలు చేయనందున ఈ పద్దులకు వాయిదా వేసినట్లు ఈవో లతా తెలిపారు.

# ఆర్థిక అక్షరాస్యతతోనే కుటుంబ భద్రత...

## -ముడియూరులో విఐడిఎస్ సంస్థ అవగాహన ర్యాలీ - రిజర్వ్ బ్యాంకు అనుబంధంతో గ్రామస్థుల్లో చైతన్యం

ప్రజాభూమి ప్రతినిధి - పిచ్చాటూరు :

మండలం లోని ముడియూరు గ్రామంలో రిజర్వ్ బ్యాంకు అనుబంధంతో విఐడిఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో భారీ ర్యాలీ నిర్వహించారు. బ్యాంకింగ్ సేవలు, బీమా ప్రాధాన్యత, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు స్పష్టత కల్పించేలా ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ జానకిరామయ్య మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా భవిష్యత్ భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరు తప్పనిసరిగా బీమా పథకాల్లో చేరాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో సంవత్సరానికి రూ.20 ప్రీమియం చెల్లిస్తే, ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యం కలిగినప్పుడు రూ.2 లక్షల వరకు బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. ఈ పథకానికి 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గలవారు అర్హులని వివరించారు. అలాగే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలో సంవత్సరానికి రూ.436 ప్రీమియం చెల్లిస్తే, సహజ మరణానికి రూ.2 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు ఈ పథకానికి 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు అర్హులని తెలిపారు. ఈ రెండు బీమా పథకాలను సమీపంలోని అధికృత బ్యాంకులను సంప్రదించి ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ శశి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# రైతులకు సబ్సిడీ పై వరి విత్తనాలు పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి - కోట

ద్విత్వ తుఫాను కారణంగా వరి పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ పాసిం.సునీల్ కుమార్ సూచనల మేరకు బుధ వారం కోట మండలం ఊను గుంటపాలెం గ్రామ సచివాలయం దగ్గర 80 శాతం రాయితీ పై ప్రభుత్వం కేఎన్ఎం 1638 వరి విత్తనాలను ఏఎంసీ చైర్మన్ మర్రి ప్రమీల, కోట మండలం టిడిపి అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, మరియు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్.జలీల్ అహ్మద్ జిల్లా రైతు కార్యదర్శి మోహన్ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు చేతుల మీదుగా ఊనుగుంటపాలెం రైతులకు బయోమెట్రిక్ విధానం ద్వారా వరి విత్తనాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల రైతు అధ్యక్షులు మారంరెడ్డి.శ్రీధర్ రెడ్డి రఘురాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు...





# తిరుపతిని సరస్సులు - చెరువుల నగరంగా తీర్చిదిద్దే ప్రణాళిక శ్రీకారం - తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాభూమి ప్రత్యేక ప్రతినిధి - తురక అమరనాథ్ - తిరుపతి



తిరుపతిని సరస్సులు - చెరువుల నగరంగా అభివృద్ధి చేయాలనే ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా..తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి చొరవతో తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ తుడా సమగ్ర ప్రణాళికను రూపొందిస్తోంది. ఈ మేరకు సాగునీటి శాఖ అధికారులతో పాటు అంతర్జాతీయ సంస్థల సహకారంతో డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ డిపిఆర్ సిద్ధం చేయనుంది. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఇటీవల న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా చేసిన అభ్యర్థన మేరకు సౌత్ ఏసియా సెక్రెటరీ డైరెక్టర్ సౌమ్య చతుర్వేదుల మరియు డిప్యూటీ సెక్రటరీ జనరల్ మని కుమార్ మంగళవారం తుడాను సందర్శించారు. ఈ సందర్భంగా వారు పెరుమాళ్లపల్లి గ్రామాన్ని సందర్శించి స్థానిక పంచాయతీ అధికారులు, గ్రామస్తులు మరియు తుడా అధికారులతో కలిసి గ్రామాన్ని



క్లైమేట్ స్మార్ట్ విలేజ్గా అభివృద్ధి చేసే అవకాశాల పై అధ్యయనం చేశారు. గ్రామంలోని డ్రైనేజ్ వ్యవస్థలు, ఎల్ఈడీ వీధి దీపాలు, సాలిడ్ వెస్ట్ ప్రాసెసింగ్ సెంటర్, నిష్క్రమణ వ్యవస్థలను వారు పరిశీలించారు. మురుగు నీటి ప్రవాహం - గ్రామ జనాభా ఆధారంగా కాన్సెప్ట్ నోట్ అందజేస్తామని ప్రతినిధులు తెలిపారు. అనంతరం పేరూర్ చెరువు, అవిలాల చెరువులను సందర్శించి సాగునీటి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర ప్రసాద్తో కలిసి చెరువులకు సంబంధించిన సరఫరా కాలువలు, నీటి ప్రవాహ మార్గాల పై చర్చించారు. ఈ సందర్భంగా తుడా కార్యదర్శి డా.ఎన్.వి.శ్రీకాంత్ బాబు మాట్లాడుతూ..మొదటి దశలో ఇరవై చెరువుల పునరుద్ధరణకు జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిపుణుల సూచనలతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. నగర వరద నియంత్రణ, వాటర్షెడ్ అధ్యయనం, భూగర్భజల పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, గాలి నాణ్యత నిర్వహణ, సౌరశక్తి వినియోగం, జీవ వైవిధ్య సూచిక వంటి అంశాల్లో నైపుణ్యాన్ని వినియోగించుకోనున్నట్లు తుడా తెలిపింది. ఈ కార్యక్రమంలో తుడా ఇంజినీర్లు కృష్ణా రెడ్డి, రవీంద్రయ్య, బాషా, పాల్గొన్నారు...



# రైతులకు శిక్షణా కార్యక్రమం

ప్రజభూమి, ప్రతినిధి,వాకాడు

తిరుపతి జిల్లా వాకాడు మండలం కొండాపురం పంచాయతీలోని రైతు సేవ కేంద్రం కార్యాలయం నందు అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగార్జునసాగర్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ)సౌజన్యంతో రైతులకు వివిధ రకాల తెగుల్ల గురించి మందులు ఎలా వాడాలి ఎప్పుడు ఎప్పుడు వాడాలి ఏ తెగులుకి ఏ మందు ఎట్లా వాడా లో రైతులకు





అవగాహన కల్పించారు.దిత్వ తుఫాను ద్వారా నష్టపోయిన వాళ్లకు విత్తనములు 80 శాతం రైతులకు రేపటి నుండి రైతు సేవ కేంద్రం వద్ద 217 రూపాయలకే ఇవ్వబడును అని అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు. రైతులు వేసిన ప్రతి పంట కూడా ఈక్రాప్ ఆన్లైన్లో చేసుకుంటే ప్రభుత్వం ద్వారా వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే రాయితీలను పొందవచ్చునని తెలిపారు.డిసెంబర్ 31 వరకు పంటల బీమా ఎకరాకు630 రూపాయలు కట్టి రైతు సేవ కేంద్రం వద్ద నమోదు చేయించుకోవాలని నష్టపరిహారి కింద 1,5000 వస్తుందని దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాము అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ దీప తెలుగుదేశం పార్టీ నాయకులు మోహన్ నాయుడు గోపి నాయుడు వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు...

# టీటీడీకి రూ.60 లక్షలు విరాళం

ప్రజాభూమిప్రతినిధి - తిరుమల

టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు మంగళవారం రూ.60 లక్షలు విరాళంగా అందింది. బెంగుళూరుకు చెందిన కె.యన్. నయన, వి.ప్రభా, రాజేష్, కె.యన్.రాజేష్, గుంటూరుకు చెందిన దేవరశెట్టి రితీష్, దేవరశెట్టి సత్యనారాయణలు వేర్వేరుగా రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు దాతలు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను చైర్మన్ అభినందించారు.







# నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే లక్ష్యంతో విలేజ్ హెల్త్ క్లినిక్ ల నిర్మాణం కు రూ.7.246 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాభూమిప్రతినిధి - నగరి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నగరి నియోజకవర్గంలో స్థానిక ప్రజలకు విలేజ్ హెల్త్ క్లినిక్, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ నిర్మాణాలు కోసం నిధులు మంజూరు చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రభుత్వం కు విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ విజ్ఞప్తి మేరకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గంకు మంజూరు అయిన 30 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 3 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ మంజూరు చేసి రు. 7.246 కోట్లు నిధులు మంజూరైనట్లు మంజూరైన వివరాలతో ఎమ్మెల్యేకి లేఖను పంపారు.దీంతో నగరి నియోజకవర్గం కు 30 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 3 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షల పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి - చిల్లకూరు

తిరుపతి జిల్లా గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి చిల్లకూరు మండల స్థాయి పరీక్షలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. స్థానిక ఎల్.ఏ.పి. స్కూల్ నందు డా.కుడుముల.వెంకటనారాయణ దాతృత్వంలో విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. జే.వి.వి. ఉపాధ్యక్షులు చెంచు నారాయణ మాట్లాడుతూ.. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులలో మూఢ నమ్మకాలు పోగొట్టేందుకు ప్రతి సంవత్సరం చెకుముకి సైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన కల్పించి తద్వారా సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను పోగొట్టవచ్చని తెలిపారు. జన విజ్ఞాన వేదిక మంచి సమాజమే లక్ష్యంగా పనిచేస్తుందని అందులో భాగంగానే గత 32 సంవత్సరాలుగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మాకు అన్ని విధాలా సహకరిస్తున్న ఎల్.ఏ.పీ.స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. మా ఎగ్జామ్స్ కి సహకరిస్తున్న ప్రతి స్కూలు ఉపాధ్యాయులకు అదే విధంగా పరీక్ష రాసిన విద్యార్థులకు అందరికీ కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, పురుషోత్తమరావు, చెంచు నారాయణ, సుబ్బారావు, ప్రభాకర్, ఆనంద్, శ్రీనివాసాచారి, ఎల్.ఏ.పి స్కూల్ హెచ్.ఎం సురేష్, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు...

# 25.04 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం



-ఖరీఫ్ 2025–26 ధాన్యం

**సేకరణలో రాష్ట్ర చరిత్రలోనే మైలురాయి -ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

విజయవాడ ప్రజాభూమి ప్రతినిధి

ఖరీఫ్ 2025–26 సీజన్‌లో మునుపెన్నడూ లేని విధంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారా 16 డిసెంబర్ 2025 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 3,96,854 మంది రైతుల నుండి రూ.5,938.20 కోట్ల విలువ గల 25.04 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించటం జరిగింది. ఇది రాష్ట్ర చరిత్రలోనే చెప్పుకోదగ్గ మైలురాయిగా మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ఇప్పటివరకు 3,79,538 మంది రైతులకు రూ.5,682. 77 కోట్ల రూపాయలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. మిగిలిన రూ.255.43 కోట్ల రూపాయలు తదుపరి బ్యాంకు బ్యాచ్ ప్రాసెస్‌లో రైతుల ఖాతాల్లో జమ చేయబడతాయని తెలిపారు.రైతులకు మద్దతు ధర (MSP) అందించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా గోనె సంచులు, రవాణా వాహనాలు, టార్పాలిన్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచామని పేర్కొన్నా రు. రైతులు తమ ధాన్యం విక్రయంలో ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే, విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం: 1967 ను సంప్రదించవచ్చని, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల మేరకు 24 గంటల లోపు మద్దతు ధర (MSP) పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3,500 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. దళారులను ఆశ్రయించి మద్దతు ధరకన్నా తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారానే తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డుకు సరికొత్త శోభ

## ప్రత్యేక చొరవతో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు పచ్చదనానికి మెరుగులు

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:


ఇంద్రకీలాద్రి పైన కొలువై ఉన్న కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే దిశగా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) శ్రీ సీనా నాయక్ గారు గత 15 రోజులుగా చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులు సత్ఫలితాలనిస్తున్నాయి. ముఖ్యంగా కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు ప్రహరీ గోడ బోర్డర్ ప్రాంతాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.



గత కొంత కాలంగా ఘాట్ రోడ్డు వెంబడి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండి అస్తవ్యస్తంగా, అనాకర్షణీయంగా ఉన్న బోర్డర్ ప్రాంతంపై ఈఓ ప్రత్యేక దృష్టి సారించారు. ఇంజనీరింగ్ విభాగం సమన్వయంతో గత రెండు వారాలుగా నిరంతరాయంగా శ్రమించి, ఆ పిచ్చి మొక్కలను తొలగించి క్లీన్ చేయించారు. కేవలం శుభ్రం చేయడమే కాకుండా, ఇప్పుడు ఆ బోర్డర్ ప్రాంతానికి ఆకర్షణీయమైన రంగులు వేయించి, పర్యాటకులు మరియు భక్తులు దూరంగా ఉన్నప్పుడు కూడా ఘాట్ రోడ్డు మార్గం స్పష్టంగా, అందంగా కనిపించేలా తీర్చిదిద్దారు.



ఈ సం దర్భంగా ఈఓ మాట్లాడుతూ, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ఇంద్రకీలాద్రి పర్యావరణం కూడా ఆహ్లాదాన్ని పంచాలనే లక్ష్యంతో ఈ పనులు చేపట్టామన్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు మరియు సిబ్బంది అంకితభావంతో పనిచేసి ఘాట్ రోడ్డుకు కొత్త రూపాన్ని తీసుకువచ్చారని ఆయన అభినందించారు. ప్రస్తుతం ఇంద్రకీలాద్రి కొండ కింద నుండి చూసినా లేదా ఘాట్ రోడ్డులో ప్రయాణించినా స్వచ్ఛమైన, అందమైన బోర్డర్ భక్తులకు కనువిందు చేస్తోంది.





# నీటి పన్ను బకాయిల చెల్లించక పోతే చర్యలు



## కుళాయి కనెక్షన్ల తొలగింపు

## ఇంచార్జి కమిషనర్ ఎన్ వి వి సత్యనారాయణ

ప్రజాభూమి ప్రతినిధి కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పెరుకు పోయిన నీటి పన్ను బకాయిల వసూలు కోసం కఠిన చర్యలు ప్రారంభించినట్లు నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు.

ఈ క్రమంలో మంగళవారం నుండి నగరంలో పలు ప్రాంతాలలో బకాయి ఉన్న వినియోగదారుల కుళాయి కనెక్షన్ల తొలగింపు కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో ఉన్న కమర్షియల్ మరియు నివాస గృహ యజమానులు తమపై పెండింగ్‌లో ఉన్న నీటి పన్నును తప్పనిసరిగా 2025 డిసెంబర్ 25వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

నిర్దేశిత గడువు లోగా నీటి పన్ను చెల్లించని పక్షంలో సంబంధిత కుళాయి కనెక్షన్లు తొలగించబడతాయని, ఒకసారి తొలగించిన కనెక్షన్లను తిరిగి పునరుద్ధరించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. అంతేకాకుండా బకాయి మొత్తాల వసూలు కోసం చట్టపరమైన చర్యలు కూడా తీసుకోబడతాయని ఇంచార్జ్ కమిషనర్ అన్నారు.కాకినాడ నగర అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీటి సరఫరా నిర్వహణ సజావుగా సాగాలంటే ప్రజలు బాధ్యతగా పన్నులు చెల్లించాలని ఆయన కోరారు. నీటి పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వహించకుండా, వెంటనే బకాయిలను చెల్లించి సహకరించాలని నగర ప్రజలకు ఇంచార్జ్ కమిషనర్ ఎన్ వి వి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

# పీజీఆర్ ఎస్ అర్జీలకు నూరుశాతం సంతృప్తికరమైన పరిష్కారాలు ఇవ్వాలి



**బాల్ వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల కార్య క్రమంపై గోడపత్రికను ఆవిష్కరించిన... కాకినాడ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**

ప్రజాభూమి ప్రతినిధి కాకినాడ

జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్ వివాహ ముక్తభారత్ 100 రోజులు కార్యక్రమంపై రూపొందించిన గోడ పత్రికను మంగళవారం కాకినాడ కలెక్టరేట్ జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్ ఐసీడీఎస్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ బాల్య వివాహాలు సామాజిక దురాచారమని, వీటి వల్ల బాల బాలికలు తమ బాల్యాన్ని కోల్పోవడమే కాకుండా వారి యొక్క విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధి, భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అదేవిధంగా బాల్య వివాహాలు నిర్మూలించుటలో ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని ఆయన తెలియజేశారు. బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమం మూడు దశలుగా విభజించబడిన 100 రోజుల ఇంటెన్సివ్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ మార్చి 8, 2026న ముగుస్తుందని, మొదటి దశలో (డిసెంబర్ 31 వరకు) పాఠశాలలు, కళాశాలలు మరియు విద్యా సంస్థల ద్వారా అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టాలన్నారు. రెండవ దశలో, జనవరి 1 నుండి జనవరి 31, 2026 వరకు, మతపరమైన ప్రదేశాలతో పాటు దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, వివాహ మందిరాలు మరియు బ్యాండ్ పార్టీలు వంటి వివాహ సంబంధిత సేవా ప్రదాతలపై దృష్టి పెట్టాలన్నారు. మార్చి 8 వరకు మూడవ మరియు చివరి దశలో, కమ్యూనిటీ స్థాయి యాజమాన్యాన్ని బలోపేతం చేయడానికి గ్రామ పంచాయతీ మరియు మునిసిపల్ వార్డులపై దృష్టి సారిస్తోంది అని ఆయన తెలియజేశారు. బాల్యవివాహాలు లేని జిల్లాగా కాకినాడ జిల్లా సాధనకై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ పీడీ సీహెచ్.లక్ష్మి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాలు అరికట్టేందుకు బాల్ వివాహ్ ముక్త్ -100 రోజుల కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమన్వయ విభాగాలతో బాల్ వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినదని ఆమె తెలిపారు. అనంతరం జేసీ అపూర్వ భరత్.. జిల్లా అధికారులు అందరితో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ జె.నరహింనాయక్, బాలల పరిరక్షణ అధికారి సి.హెచ్.వెంకటరావు, బాలల పరిరక్షణ విభాగం సంరక్షణాధికారులు కె.శ్రీనివాసరావు, జె.విజయ, సోషల్ వర్కర్స్ ఎస్.చిన్నబాబు, ఆర్.దుర్గ భవాని ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ ఎస్ అర్జీలకు నూరుశాతం సంతృప్తికరమైన పరిష్కారాలు ఇవ్వాలి

**అర్జీదారునితో అధికారులు హుందాగా, గౌరవంగా ప్రవర్తించాలి.. కాకినాడ జిల్లా మీకోసం పీజీఆర్ఎస్ సమీక్షలో అధికారులకు స్పష్టం చేసినజేసీ అపూర్వ భరత్**



ప్రజాభూమి ప్రతినిధి కాకినాడ

ప్రతి సోమవారం జిల్లాలో జరుగుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నూరు శాతం సంతృప్తికరమైన పరిష్కారాలు ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో జేసీ అపూర్వ భరత్..డీఆర్వో వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, శ్రీరమణి, కాకినాడ డివిజన్ అభివృద్ధి అధికారి పి.వాసుదేవ రావుతో కలిసి "మీకోసం పీజీఆర్ఎస్" పై అన్ని శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో జేసీ మాట్లాడి, పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. గత సంవత్సరం 2024, జూన్ 15 నుంచి కాకినాడ జిల్లాలో 41,694 అర్జీలు స్వీకరించగా 2025, డిసెంబర్ 10వరకు 36,463 అర్జీలను పరిష్కరించామన్నారు. మిగిలినవి ఎస్ఎల్ఏ పరిధిలో ఉన్నాయని ఆయన వివరించారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడంతో పాటు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యవంతమైన పరిష్కారాలు అందించాలని జేసీ అధికారులను ఆదేశించారు. ప్రాముఖ్యంగా అర్జీదారులతో మాట్లాడే సందర్భాల్లో సంబంధిత అధికారులు హుందాగా ప్రవర్తిస్తూ, గౌరవప్రదంగా మాట్లాడాలన్నారు. అర్జీదారని సమస్యను దృష్టిలో ఉంచుకుని సరైన పరిష్కారం ఇవ్వాలన్నారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం పట్ల కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. ఇందుకు జిల్లాస్థాయి అధికారులు తరచుగా తమ పరిధిలోని కార్యాలయాలను తనిఖీ చేయాలని అని సూచించారు. ఒకే అంశంపై మళ్ళీ మళ్ళీ దఖలయ్యే దరఖాస్తులను సంబంధిత జిల్లా స్థాయి అధికారులు స్వయంగా పరిశీలించి అర్జీదారునితో నేరుగా మాట్లాడాలన్నారు. సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎక్కువ భాగం రెవెన్యూ, రీ సర్వే ఇతర భూ తగాదాలకు సంబంధించిన సమస్యలే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు దాఖలవు తున్నాయన్నారు. వీటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలోని రెవెన్యూ, సర్వే ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తప్పనిసరిగా గడువులోపు పరిష్కరించాలని జేసీ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాణ నష్ట నివారణకు హెల్మెట్ తప్పనిసరి

## - ప్రజల్లో విస్తృత స్థాయి అవగాహన

## - సీఐ టి.నరసింహులు

ప్రజాభూమి, వేంపల్లె

రోడ్డు భద్రత విషయంలో ప్రాణ నష్ట నివారణకు హెల్మెట్ తప్పనిసరి అని సీఐ టి.నరసింహులు వెల్లడించారు. కడప జిల్లా ఎస్పీ, పులివెందుల డిఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు బైక్ ర్యాలీ చేపట్టి, ప్రజల్లో విస్తృత స్థాయి అవగాహన కల్పించారు.

వాహనదారులు ఇంటి బయటకు వచ్చే సందర్భాల్లో సంబంధిత పత్రాలతో పాటు హెల్మెట్ తప్పనిసరి కలిగి ఉండాలన్నారు. వాహనదారునికీ హెల్మెట్ అనేది ప్రాణ రక్షక సాధనం అన్నారు.



రోడ్డు బద్రత నియమాలు పాటించి, ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రంగరావు, తిరుపాల్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at sri lakshmi narasimha artprinters, H.NO. 28-5-257,housing board colony, Anantapur-515001, Andhra Pradesh.and Published from H.NO. 28-5-257,housing board colony, ANANTAPUR-515001, Andhra Pradesh. Editor : A.RAMAMOHANREDDY.RNI NO:APTEL/2023/90641, Cell: 9502116677

ప్రజాభూమి
జనరల్ 13
బుధవారం 17, డిసెంబర్ 2025

# ఆధార్ అప్డేట్, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం

## కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి–అమలాపురం

ఆధార్ అప్డేట్, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయమని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అన్ని విద్యాసంస్థలలో చదువుతున్న 5 నుండి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థుల ఆధార్ కార్డులకు తప్పని సరిగా బయోమెట్రిక్ అప్డేషన్ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. ఆధార్ జారీ సంస్థ నిబంధనల ప్రకారం పిల్లలకు 5 సంవత్సరాలు, 17 సంవత్సరాల వయస్సులో రెండు సార్లు బయోమెట్రిక్ అప్డేట్ ఫోటో, వేలిముద్రలు, ఐరిస్ చేయడం తప్పనిసరన్నారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథార్టీ ఆఫ్ ఇండియా ఇటీవల ప్రకటించిన మార్పుల ప్రకారం 5 నుండి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ పై నిర్దేశించిన ఛార్జీలు ఒక సంవత్సరం పాటు మిన హాయిం చబడ్డాయన్నారు. దీని ద్వారా కోట్లాది విద్యా ర్థులకు లాభం చేకూరనుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందన్నారు. విద్యార్థుల స్కూల్ అడ్మిషన్‌లు, స్కాల ర్‌షి ప్‌లు, పోటీ పరీక్షల నమోదు, వివిధ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పథకాలు సునాయాసంగా పొంద డానికి ఆధార్‌లో తాజా బయోమెట్రిక్ వివరాలు ఉండటం అత్యంత అవ సరమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు .5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సులో పిల్లలకు బాల ఆధార్ జారీ చేసినప్పుడు కేవలం ఫోటో మరియు ఇతర డెమోగ్రఫిక్ వివరాలు మాత్రమే నమోదు చేస్తారని ఆ దశలో వేలిముద్రలు, ఐరిస్ డేటా తీసుకోరన్నారు పిల్లలు 5 సంవత్సరాల వయస్సు పూర్తిచేసిన తరువాత తప్పనిసరిగా మొదటి మాండేటరీ బయో మెట్రిక్ అప్డేట్ చేయాలని ఆయన సూచించారు 15 సంవత్సరాల వయస్సు వచ్చినప్పుడు రెండవ మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్ చేయాలన్నారు ఈ రెండు బయోమెట్రిక్ అప్డేట్‌లు 5–7 సంవత్సరాలు మరియు 15–17 సంవత్సరాల మధ్య పూర్తి చేస్తే ఉచితంగా చేయించుకోవచ్చునని,పెండింగ్‌లో ఉన్నవారు అప్డేషన్ చేయించుకొని వచ్చునని అధికా రిక మార్గదర్శకాలు సూచి స్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిధిలోని ప్రభుత్వ, అనుబంధ, అంగీకృత ప్రైవేట్ పాఠ శాలల ప్రధానా ధ్యాపకులు, నిర్వహణలు తమ తమ స్కూల్‌లలో చదువుతున్న 5–17 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థుల కు కూడా ఆధార్ బయోమెట్రిక్స్ తప్పని సరిగా నవీకరించబడేలా తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని దగ్గరలోని ఆధార్ నమోదు,అప్డేట్ కేంద్రాలను ఈనెల 16 నుండి 20 వరకు మొదటి దఫాగా రెండో దఫాగా ఈనెల 22 నుంచి 24 వరకు ఆయా పాఠశాలల్లో క్యాం పులు నిర్వహించి మొత్తం 8 రోజులలో జిల్లా వ్యాప్తంగా గణాంకాలు సూచిస్తున్న 27, 472 మందికి ఆధార్ అప్డేషన్ సుమారు 90 కిట్లతో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ యొక్క అవకాశాన్ని విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు స్కూల్ ద్వారా నిర్వహించే ప్రత్యేక క్యాంపుల సేవలను తప్పని సరిగా ప్రస్తుత భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వినియోగించుకోవాలన్నారు. అదనపు పత్రాలు అవసరం లేదని విద్యార్థులందరూ ఈ సౌకర్యాన్ని సకాలంలో వినియోగించుకొని, భవిష్యత్‌లో స్కాలర్ షిప్‌లు, పరీక్షల నమోదు, శాసనబద్ధ పథకాల లబ్ధిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుగానే ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు భోజనం పొట్లాలు పంపిణీ చేసిన వివేకానంద సేవా సమితి సభ్యులు



ప్రజా భూమి ప్రతినిధి–ఏలేశ్వరం

తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు,కౌన్సిలర్ బొద్దిరెడ్డి గోపి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ యువకుడైనా గోపాల కృష్ణ (గోపి) ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని,భగవంతుని దయతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మూది నారాయణస్వామి,కోణాల వెంకటరమణ, ఎండగుండి నాగబాబు, సిహెచ్ చైర్మన్ వాగు రాజేష్,సిహెచ్ వైస్ చైర్మన్ జొన్నాడ వీరబాబు, బుగతా శ్రీను,గొల్లపూడి త్రిమూర్తులు, పలివెల శ్రీనివాస్,పెండ్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన పంచాయతీ భవనం నిర్మించాలి

### ఎంపీడీవోకు వినతి పత్రం అందించిన తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కణితి మధు



ప్రజాభూమి ప్రతినిధి–ఎటపాక

లక్ష్మీపురం పంచాయతీ నూతన భవనాన్ని నిర్మించాలని ఎంపీడీవో కు వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశిస్తూ కణితి మధు మాట్లాడుతూ పంచాయతీ భవనం చాలా ఇరుకుగా ఉన్నదని , రామగోపాలపురం పంచాయతీ ప్రజలకు కూడా లక్ష్మీపురం సచివాలయం లో సేవలు అందుతున్నాయని అందువల్ల రెండు పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నూతన పంచాయతీ భవనం నిర్మించి పంచాయతీ ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని కణతి మధు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఉండేటి రమేష్,బోప్పని దిలీప్, వెట్టి లక్ష్మయ్య, ఎర్రయ్య , రాజు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం మన బాధ్యత

### డి.ఎం.అండ్ హెచ్. ఓ డాక్టర్ ఎం. దుర్గారావు దొర



ప్రజాభూమి ప్రతినిధి–అమలాపురం

ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం మనందరి బాధ్యతని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం దుర్గారావు దొర మంగళవారం ఒక ప్రకటనలో ద్వారా పిలుపునిచ్చారు. డిసెంబర్ 21 వ తేదీ ఆదివారం పల్స్ పోలియో దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని తద్వారా పోలియో రహిత సమాజ స్థాపనకు సమా జంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత వహించాలన్నదే మన లక్ష్యం కావాలన్నారు. ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారికి పోలియో చుక్కలు వేయిం చడం మన బాధ్యత అన్నారు. మన పిల్లల ఆరోగ్య భవిష్యత్తు కోసం రెండు చుక్కలు జీవితాంతం రక్షణ అని, అందరం కలసి పోలియో ను పూర్తిగా నిర్మూలిద్దామ న్నారు. ఈనెల 21 న పల్స్ పోలియో నిర్మూలన దినోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు 5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పని సరిగా వేయిం చాలని పిలుపు నిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 5 ఏళ్ల లోపు పిల్లలకు బూత్ లలో పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఈనెల 21 న బూత్‌ల వద్ద చుక్కలు వేసి నా, మిస్ అయిన పిల్లలకు 22, 23 తేదీల్లో బృందాలు ఇంటింటికీ వెళ్లి వేస్తాయ న్నారు మెడికల్ అధికారులు, ఇతర క్షేత్ర స్థాయి సిబ్బంది ఫార్మ సిస్టులు, నర్సులు, పర్య వేక్షకులు పాల్గొంటారని మొబైల్ బృందాలు స్లమ్ లు, నిర్మాణ స్థలాలు, వలస ప్రాంతాలు కవర్ చేస్తాయన్నారు. ట్రాన్సిట్ పాయింట్లుబస్ స్టాండ్లు, ఆస్పత్రులు, మేళాలు, బజార్లలో 21 నుంచి 23 వరకు మొబైల్ బృందాలు పర్యటిస్తాయన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా చుక్కలు వేయించి, పోలియో రహిత భారత్‌కు సహకరిం చాలన్నారు.

## మండల మహిళా సమాఖ్యలో ఏపీసీఎన్‌ఎఫ్ కన్వర్జెన్సీ మీటింగ్



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

రావులపాలెం – మండల మహిళా సమాఖ్య సమావేశంలో రైతు సాధికారత సంస్థ (ఏపీసీఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్తపేట డివిజన్ ఇన్‌చార్జి ఎల్. ప్రసాద్ పాల్గొని, గ్రామ స్థాయిలో అమలు చేయాల్సిన ఎన్‌ఎంఎన్‌ఎఫ్ (నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్) కార్యక్రమాలపై వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం వాడకంతో కలిగే ప్రయోజనాలను వివరించి, ప్రత్యక్షంగా డెమో నిర్వహించి విత్తన శుద్ధి విధానాన్ని చూపించారు. అలాగే రావులపాలెం డ్వాక్రా ఏపీఎం విజయ్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా భూమి ఆరోగ్యంతో పాటు మన ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ప్రతి డ్వాక్రా సభ్యురాలి భాగస్వామ్యం అవసరమని, అందరూ తమ ఇళ్ల వద్ద కనీసం కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం. దేవి పార్వతి, కార్యదర్శి బి. అన్నపూర్ణ, ఏపీఎం విజయ్, సీసీలు, వీవోఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసీఆర్పీలు, యూనిట్ ఇన్‌చార్జి శాంతి కుమారి, ప్రసాద్‌తో పాటు డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌కు వెల్లువెత్తిన అర్జీదారులు

### అర్జీదారులకు భరోసా ఇచ్చిన మంత్రి సుభాష్.



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమ, మంగళవారాల్లో నిర్వహించిన ప్రజా దర్బార్ కు విశేష స్పందన లభించింది. రామచంద్రపురం నియోజవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలుతో మంత్రి క్యాంపు కార్యాలయం కిటకిటలాడింది. మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు 950 వరకూ అర్జీలు అందాయని మంత్రి కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటన ద్వారా తెలిపారు.సుభాష్ తో పాటు, వివిధ శాఖల అధికారులు, మంత్రి తండ్రి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, బిజెపి నాయకులు దూడల శంకర్ నారాయణ, కె గంగవరం, కాజులూరు మండలాల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, చవ్వాకుల నారాయణమూర్తి, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, జనసేన అధ్యక్షులు చిర్రా రాజ కుమార్ లు పాల్గొన్నారు. మంగళవారం కాజులూరు, కె గంగవరం మండలాల ప్రజలకు ప్రజా దర్బార్ నిర్వహించారు. దివ్యాంగుల పెన్షన్, దివ్యాంగ ఉపకరణాలు, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఇళ్ల స్థలాలు, ఉద్యోగ అవకాశాలు, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డ్స్ తదితర సమస్యలపై అధికంగా అర్జీలు అందాయి. మంత్రి సుభాష్ స్వయంగా ఆర్జీలు పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులును ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీ నమోదు చేసి, దాని పరిష్కారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటూ, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డి ఈ రాంబాబు, కాజులూరు తహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్,వివిధ శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల సభను జయప్రదం చేయండి

### –సీపీఎం జిల్లా కార్యదర్శి కిరణ్



ప్రజాభూమి ప్రతినిధి–ఎటపాక

రాంగోపాలపురం గ్రామంలో జరిగిన సీపీఎం ఎటపాక మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ నెల 21 న చింతూరులో జరిగే అమరవీరుల సభను జయప్రదం చేయవలసినదిగా పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ తెలియజేశారు .ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు,మండల కార్యదర్శి కాకా అర్జున్, సవలం. రాము, బుద్దుల భద్రయ్య, నక్క సూరిబాబు, హుస్సేన్ , తోట శ్రీను, పూసం బాబు, ముత్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలో మంగళవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఏపీ ఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రత్నాలరావు విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన వకృత్వం, చిత్రలేఖనం పోటీ లు నిర్వహించారు. ఈసందర్భంగా రామచంద్రపురం మోడరన్ కాలేజ్ యందు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు 196 విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. నారాయణ స్కూలు, మోడరన్ స్కూలు, మున్సిపల్ హైస్కూల్ చింతపల్లి సూరన్నగర్, పిల్లవారీ హైస్కూల్లో మరియు గవర్నమెంట్ ప్రభుత్వ ఎస్ కే పి జి ఎన్ హై స్కూ, రత్న పేట హై స్కూల్, ప్రగతి హై స్కూల్, సెంట్ ఎంక్వైరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లకు చెందిన తదితర విద్యార్థులు పాల్గొన్నారు . ఇందులో భాగంగా రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రత్నాల రావు , అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్ వి రమణ, భాస్కర్ కుమార్, జి శ్రీనివాస్, వాసు, ఏ శ్రీనివాసు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్స్ క్రికెట్ పోటీల్లో ఉప్పలగుప్తం జట్టు విజయం



ప్రజాభూమి ప్రతినిధి–ఉప్పలగుప్తం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తంలో భమనపల్లి టీచర్స్ క్రికెట్ పోటీలలో ఉప్పలగుప్తం జట్టు ఫైనల్గా చేరుకుంది శ్రీ జిఎంసి బాలయోగి స్టేడియం, అమలాపురం నందు జరిగిన టీచర్స్ క్రికెట్ పోటీలలో ఉప్పలగుప్తం జట్టు మమ్మిడివరం టీచర్స్ జట్టుపై 25 పరుగులు తేడాతో విజయం సాధించి ఫైనల్ గా చేరుకుంది, రేపు అంబాజీపేటలో జరుగు ఫైనల్ పోటీల్లో పాల్గొంటుంది, ఈ పోటీలలో సి పి ఓ జి మమ్మీ,ఎ ఎం ఓ బొరుసు సుబ్రహ్మణ్యం విచ్చేసి ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ ఆటలు శారీరక మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని పని ఒత్తిడి తగ్గించడానికి ఈ ఆటలు ఎంతో ఉపయోగపడతాయని అందరూ ప్రతి రోజు మాట్లాడాలని ఆమె సూచించారు , మొదట ఉప్పలగుప్తం జట్టు 15 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేసింది అత్తిలి సురేష్ 35 పరుగులు, రాజు 22 పరుగులు సౌరవ్ చంటి 23 పరుగులు చేసాడు అనం తరం బ్యాటింగ్ చేసిన మమ్మిడివరం జట్టు 15 ఓవర్లలో 109 పరుగులు చేసింది ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ సెక్రటరీ కొండేపూడి ఈశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సెక్రటరీ బొంతు వివిఎస్ మూర్తి, మండల విద్యాశాఖ అధికారి గౌరీశంకర్ ప్రధానో పాధ్యాయులు నూకల సత్యనారాయణ, విత్త నాల శ్రీనివాసరావు, తోట రవి, కామన్ మధు, గోలకోటి ఫణి పాల్గొన్నారు.

## చాదస్తం ఫుడ్స్క ఏక్స్ లెన్స్ ఇన్ ట్రెడిషన్ ఫుడ్ ప్రోడక్ట్స్ అవార్డు

ప్రజాభూమి ప్రతినిధి–ఆత్రేయపురం





ఆత్రేయపురం – విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్ పో కార్యక్రమం లో ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వద్ద సంప్రదాయ రుచులు అందిస్తున్న చాదస్తం ఫు డ్స్క ఏక్స్ లెన్స్ ఇన్ ట్రెడిషన్ ఫుడ్ ప్రోడక్ట్స్ అవార్డ్ లభించింది. విజయవాడలో ఈ నెల 12 నుండి 14 వరకు నిర్వహించిన ఏ పి ఛాంబర్ ఆఫ్ బిజినెస్ ఎక్సపో లో సాంప్రదాయ ఆహార ఉత్పత్తుల రంగంలో తన విశిష్ట సేవలకు గాను ఈఅవార్డ్ అందజేశారు. సాంప్రదాయ పద్ధతు ల్లో, స్వచ్ఛత, నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ ఎలాంటి కృత్రిమ రంగులు లేదా ప్రిజర్వేటివ్స్ ఉప యోగించకుండా తయారు చేస్తున్న ఉత్పత్తులకుగాను ఈ అవార్డు దక్కించుకుంది. ముఖ్యంగా ఆత్రేయపురం పూతరేకులు సంప్రదాయ మిఠాయిలు, పిండి వంటలు, స్నాక్స్, కారం పొడులు, సీజనల్ పచ్చళ్ళతో చాదస్తం ఫుడ్స్ వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించింది. ఈ సంద ర్భంగా చాదస్తం ఫుడ్స్ వ్యవస్థాపకులు సాయిప్రసన్న మాట్లాడుతూ, ఈ అవార్డు మా కృషికి, మా బృందానికి, గ్రామీణ మహిళల శ్రమకు, లభించిన గౌరవం అని ఆనందం వ్యక్తం చేశారు. మాపై నమ్మకం ఉంచిన మమ్ములను ఆదరించిన కస్టమర్లకు ఈ అవార్డును అంకితం చేస్తున్న ట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా సంప్రదాయ రుచులను అదే స్వచ్ఛతతో ముందుకు తీసుకె ళ్లేందుకు కృషి చేస్తామని అన్నారు.

## ప్రజలు మెచ్చిన నాయకుడు సానా సతీష్ బాబు

### డాక్టర్ చప్పిడి



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

ప్రజల మెచ్చిన నాయకుడుమన సాన సతీష్ బాబు అని ఎప్పుడూ ప్రజల అందరికీ అందుబాటులో ఉంటూ సమస్య వస్తే నేనున్నాను అంటూ రాజ్యసభ ఎంపీగా సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆయన అభినందనీయులు అని హెల్త్ అవేర్ సంస్థ అధ్యక్షులు రాష్ట్ర శెట్టి బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పాయకరావుపేట నియోజకవర్గం పరిశీలకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు కరప మండలం నడకుదురు గ్రామంలో ఉన్న జనావళి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి వేడుక జరుపుకోవడం జరిగింది వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది సానా సతీష్ బాబు మరిన్ని ఉన్నత పదవులు చేయాలని జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని కోరారు డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ సుమారు 16 కోట్ల రూపాయల విలువైన పనులు చేయించడం జరిగిందని నిన్ననే గాంధీనగర్ పార్కులో గ్రంథాలయం టాపు వేయటం నిమిత్తము లక్ష రూపాయలు సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఇవ్వడం జరిగిందని కాకినాడకు సుమారు పదహారు ఎకరాల విస్తీర్ణంలో క్రికెట్ స్టేడియం తీసుకురావడానికి కూడా కృషి చేస్తున్నారని ఇలా అనేక రంగాలు మన ప్రభుత్వాసుపత్రిలో క్యాన్సర్ మిషన్ తెప్పించడం జరిగింది అలాగే విద్య వైద్య ఉద్యోగ అనేక రంగాలలో ప్రజలందరికీ సహకరిస్తూ ముందుకు సాగుతున్న సానా సతీష్ బాబు గారిని కూటమి కుటుంబ సభ్యుల తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను అని వివరించారు కార్యక్రమంలో కరప మండల టిడిపి అధ్యక్షులు దే వు వెంకన్న మహిళా అధ్యక్షులు కోన వెంకటలక్ష్మి యువ నాయకులు కొప్పిశెట్టి సాయి సూర్య, రాజీవ్, అనూష భవాని,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

జనరల్ 14

బుధవారం 17, డిసెంబర్ 2025


## సస్పెన్షన్ కు గురైన ప్రధానోపాధ్యాయిని, డిప్యూటీ వార్డెన్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

### ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ డిమాండ్



ప్రజాభూమి – బుట్టాయగూడెం

ఇటీవల అంకన్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న బాలిక గర్భవతి అయ్యిందనే నెపంతో బాధ్యులు కాని ప్రధానోపాధ్యాయిని, డిప్యూటీ వార్డెన్ లను సస్పెండ్ చేయడం సరైన చర్య కాదని, వెంటనే వారి సస్పెన్షన్ రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక పత్రికలకు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రాంబాబు ఈ సంఘటన జరగడానికి కారణం ఉన్నత అధికారుల నిర్లక్ష్యం వల్లనే జరిగిందని చెప్పారు. గతంలో చాలా సార్లు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎం,నైట్ వాచ్ మెన్ పోస్టులు మంజూరు చేసి, తాత్కాలిక ప్రాతిపదికన నియమించి, గిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలని గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమీషనర్ లకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ, వాటిని బుట్ట దాఖలాలు చేశారు తప్ప, ఎటువంటి చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. గర్భధారణ పరీక్షలు చేయాలంటే నైపుణ్యం ఉన్న ఏఎన్ఎంలు ఉంటేనే ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉంటాయని, ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం లను నియమించాలని అన్నారు. జరిగిన సంఘటనకు బాధ్యులు కానీ ప్రధాన ఉపాధ్యాయుని, డిప్యూటీ వార్డెన్ల సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దుచేసి విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ టి ఎ నాయకులు తెల్లం రాములు, సోడెం రాజు, సరియం నాగేశ్వర రావు, కుంజం రమేష్, తెల్లం గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబాల మధ్య అనుబంధాల కోసం ఆత్మీయ సమ్మేళనాలు



ప్రజాభూమి – బుట్టాయగూడెం

కుటుంబాలతో కలిసి ఆత్మీయ సమ్మేళనాలు జరుపుకోవాలని, తద్వారా కుటుంబాల మధ్య అనుబంధాలు బలపడతాయని ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షుడు కె.వి. రమణ అన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్ ఫోటో, వీడియో అండ్ మిక్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో మంగళవారం కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మంది రెడ్డి రవీంద్ర కుమార్ మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చే సిన ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు కెవి రమణ మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనాలు ఆదర్శవంతమైన భావాలతో జరుపుకోవలసిన అవసరం ఉందని అన్నారు.అలా జరుపుకుంటున్నందుకు యూనియన్ సభ్యులందరికీ ఐ ఎఫ్ టి యు జిల్లా కమిటీ తరపున అభినందనలు చెప్పారు. ఈ ఆత్మీయ సమ్మేళనాలు కుటుంబాలతో కలిసి, కుల, మతాలకతీతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో వ్యాసరచన పోటీలు, దేశభక్తి రచనలు, మహిళలకు పాటల పోటీలు, తదితర ప్రగతిశీల భావాలతో కలిగిన విజ్ఞానం కలిగించేవి అన్నీ నిర్వహించాలని, ఆటలాడించాలని అన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు సోమరాజు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ యూనియన్ సభ్యుల కుటుంబాల మధ్య ఆత్మీయ, అనుబంధాలు పెరగడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, ఇటువంటివి ముందు ముందు మరిన్ని జరుపు కోవడం కోసం ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిహెచ్ జగన్, గౌరవ అధ్యక్షులు వై. సూరిబాబు, కోశాధికారి సిహెచ్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కే శ్రీను, కార్యదర్శులు సిహెచ్ శ్రీను, వి వాసుదేవరా, ఎన్ రవికుమార్, డి.చండీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బుట్టాయగూడెం వీఆర్ఏ మంగ మృతి

ప్రజాభూమి – బుట్టాయగూడెం



స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న పటేల్ మంగ (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. మండలంలోని అంతర్వేదిగూడెం కు చెందిన చెందిన పటేల్ మంగ మంగళవారం సాయంత్రం జంగారెడ్డిగూడెంలోని రాజ్ కో ఎలక్ట్రానిక్స్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదవశాత్తు మృతురాలిని లారీ ఢీకొనడంతో ముందు చక్రం కింద పడిన మంగ మృతి చెందినట్లు తెలుస్తుంది. మంగ మృతితో అంతర్వేది గూడెంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. వీఆర్ఏ మంగ మృతికి తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## రాష్ట్రంలో మొదటిసారిగా 22 ఏ కేసుల పరిష్కారంపై ఏలూరులో ప్రత్యేక వేదిక

- గత ప్రభుత్వం రాజకీయ కక్షల కారణంగా భూ సమస్యలు పెరిగాయి
- జిల్లాలోని 22 ఏ భూ సమస్యలలో 90 శాతం ఈరోజే పరిష్కరిస్తాం
- దేవాదాయ భూములు, వంటి వాటిని 1 లేదా 2 వారాలలో పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటారు
- ఏలూరులో మంగళవారం నిర్వహించిన 'మెగా 22 ఏ భూ సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుండి వినతులు స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించిన జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్



ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా

ఏపీ రాష్ట్రంలోనే మొదటిసారిగా ఏలూరు జిల్లాలో 22 ఏ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక పరిష్కార కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఏలూరు జిల్లా మార్గదర్శకం అవుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం 'మెగా 22 ఏ భూ సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో పాల్గొని ప్రజలు, రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జేసి అభిషేక్ గౌడ, శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, డా. కామి నేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన రాజకీయ కక్షల కారణంగా రాష్ట్రంలో 22 ఏ భూ సమస్యలు అతి పెద్ద సమస్యగా రూపొందాయని, ప్రైవేట్ భూములను కూడా ఉద్దేశ్య పూర్వకంగా 22 ఏ జాబితాలో చేర్చారని, గత ప్రభుత్వ నేతల కు అనుకూలంగా లేని వారి భూములను 22 ఏ, చుక్కలు భూములు వంటి వివాదాస్పద భూముల జాబితాలో చేర్చారన్నారు. దీనికారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు రాష్ట్రంలో అతి పెద్ద సమస్యగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ శాఖ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. 22 ఏ కింద నమోదైన భూములలో జిరాయితీ భూములు ఉండడంతో సదరు భూ యజమానులు తమ భూములు అమ్ముకునేందుకు గత కొన్ని సంవత్సరాల నుండి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటికి శాశ్వత పరిష్కారం అందించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అన్ని జిల్లాలోనూ 22 ఏ కింద పొరపాటుగా నమోదైన భూములను సదరు జాబితా నుండి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రులను ఆదేశించారన్నారు. జిల్లాలోని 27 మండలాలకు చెందిన రైతులు, ప్రజలు 22 ఏ జాబితాలో పొరపాటుగా నమోదైన భూముల వివరాలను సదరు యజమానులు నుండి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఈరోజు కలెక్టరేట్లో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటుచేయడం జరిగిందని, ఈ కార్యక్రమంలో అందిన ప్రతీ అర్జీని పరిశీలించి 90 శాతం వరకు అదేరోజు పరిష్కరించడం జరుగుతుందన్నారు. దేవాదాయ భూములు, వంటి సమస్యలు ఉన్న భూములను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో 1 లేదా 2 వారాలలో తప్పనిసరిగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. 22 ఏ భూ సమస్యల పరిష్కార విషయంలో ఏలూరు జిల్లా రాష్ట్రంలో రోల్ మోడల్‌గా నిలుస్తుందని మంత్రి మనోహర్ చెప్పారు. జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ, జిల్లా సర్వే అధికారి అన్సారీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, జిల్లాలోని 27 మండలాల తహసీల్దార్లు, రెవిన్యూసిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితులకు నష్ట పరిహారాలు త్వరితగతిన అందేలా చూడాలి

- గిరిజనుల హక్కులు కాపాడాలి
- నిర్వాసితుల విషయంలో నిర్లక్ష్యం వేడాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగుజ్జుల ఈశ్వరయ్య




ప్రజాభూమి ప్రతినిధి – వేలేరుపాడు

పోలవరం ప్రాజెక్టు వలన సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు కాంటూరుతో సంబంధం లేకుండా నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండలంలోని ఇప్పలగుంపు గ్రామంలో మండల కార్యదర్శి బాడిశ రాము అధ్యక్షతన మండల జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. 45 కంటూర్ పరిధిలోని 86 వేల నిర్వాసిత కుటుంబాలకు 32 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వకుండా ప్రభుత్వాలు దాటవేసే ధోరణి అవలంబిస్తున్నాయన్నారు. 32 వేల కోట్లు బహుళార్థక ప్రాజెక్టుకు ఖర్చు చేయటానికి లేవు కానీ లక్షల కోట్లతో అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. పూర్తిస్థాయి నిర్మాణం చేపడితేనే లక్షల ఎకరాలకు నీరు అదుతుందన్నారు. అలాంటి ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తున్నారని అలాగే కొనసాగితే ఏడు మండలాల నిర్వాసితులు, రాష్ట్ర ప్రజలతో ఉధృతమైన పోరాటాల కొనసాగిస్తామన్నారు. కట్ ఆఫ్ తేదీలతో సంబంధం లేకుండా తరలించే నాటికి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్యాకేజీ వర్తింప చేయాలన్నారు. నిర్వాసితులకు పూర్తి పరిహారం అందించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. జాతీయ ప్రాజెక్టుగా పోలవరం ప్రకటించిన నిర్వాసితులకు ఒరిగిందేమీ లేదన్నారు. తరతరాలుగా పోడు భూములకు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్ట్ వెంటనే చేపట్టి రైతులకు అండగా నిలవాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేల సంఖ్యలో ఖమ్మంకు తరలి రండి : సిపిఐ శత జయంతి వేడుకల్లో భాగంగా జాతీయస్థాయిలో ఖమ్మంలో ఈనెల 18 న నిర్వహించే మహాసభకు వేల సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలో నిర్వహించే మహాసభ ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా ఉండాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి100 ఏళ్ల సుదీర్ఘ కాలంలో ఎన్నో ఉద్యమాలు అనేక పోరాటాలు చేసి లక్షల కుటుంబాలకు భూమి పంచిన చరిత్ర ఉందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు పేద బడుగు బలహీన వర్గాలకు సిపిఐ అండగా నిలబడిందన్నారు. బూర్జువ పార్టీల మాయాజాలంలో వెనుతిరగని పోరాటాలతో వందేళ్ళ చరిత్ర కలిగి ఉండటం కమ్యూనిస్టులు గర్వించదగ్గ విషయమన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని మహాసభ విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకులు ఎండి మునీర్, ఏపీజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం మండల కార్యదర్శులు కొన్నే లక్ష్మయ్య, రమణరాజు, సోడియం దుర్గ, బేతిన కిషోర్, ఒకే చంద్రం, అశ్వరావుపేట మండల నాయకులు ముక్కంటి, రవి స్థానిక నాయకులు పిట్ట వీరయ్య, బంధం అర్జున్, మడివి కామయ్య కరటం సీతామహాలక్ష్మి, కరటం వెంకటేశ్వర్లు, సోడే ప్రసాద్, నాగేశ్వరరావు, మడకం ఇందిరా, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం




ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా

ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై తగ్గిన అవగాహన కలిగి ఉండాలని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ అన్నారు. మంగళవారం జిల్లా పంచాయితీ అధికారి కార్యాల యంలో సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పంచాయతీ అధికారి అనురాధ మాట్లాడుతూ ఉద్యోగులు సమాచారహక్కు చట్టం గురుంచి తెలుసుకోవడం తెలుసుకోవాలన్నారు. సమాచార హక్కుట చట్టం గురుంచి మీ హక్కు, చెప్పడం ప్రభుత్వం భాద్యత అనే నినాదం తో ఏలూరు జిల్లా పంచాయితీ కార్యాలయం నుండి సెయింట్ ఆన్స్ కాలేజ్ రోడ్ మీదుగా పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ ప్రజలకు ఆర్టీఐ వారోత్సవాలు మీద ఆర్టీఐ మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యాలయ పౌర సమాచారం అధికారి జి.లీలా కృష్ణ కుమారి, కార్యాలయ సిబ్బంది తదితులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే లక్ష్యంగా పల్లె నిద్ర కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి – ఆగిరిపల్లి

ఏలూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నూజివీడు డీఎస్పీ సూచనలతో, నూజివీడు గ్రామీణ సీఐ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ తన సిబ్బందితో కలిసి ఆగిరిపల్లి మండలం చిన్న ఆగిరిపల్లి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై హెచ్చరికలు జారీ చేశారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటి దొంగతనాల నివారణకు సీసీ కెమెరాల అవసరాన్ని వివరించారు. సైబర్ నేరాలకు గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని, మత్తు పదార్థాలపై సమాచారం ఉంటే 1972కు తెలియజేయాలని తెలిపారు. గ్రామాల్లో భద్రత పెంపుదలే పల్లె నిద్ర కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు.

## ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిష్కరించాలి

### పండుగ వాతావరణంలో జనవాణి : పోలవరం శాసనసభ్యుడు చిర్రి బాలరాజు



ప్రజాభూమి – బుట్టాయగూడెం.

జనవాణి కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పొందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిష్కరించాలని పోలవరం శాసన సభ్యులు సిరి బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం పోలవరం నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణి కార్యక్రమం పండుగ వాతావరణం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసమే జనవాణి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ గిరిజనాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆదివాసి గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం, విద్య, వైద్యం, రహదారులు, తదితర మౌలిక సదుపాయాల రూపకల్పనకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో జరిగిన భేటీలో పోలవరం నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు . రాష్ట్ర ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పై ప్రజలు పెట్టుకున్న ఆశలను నెరవేర్చే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకొని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి చంద్రమోహన్ మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేస్తున్న కృషిని అభినందించారు. జనవాణి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించవలకోవాలని అన్నారు. జనసేన పార్టీ కార్యదర్శి గడ్డమణుగు రవి కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందిస్తున్న సహకారంతో పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె. రాములు నాయక్, ఎంపీడీవో కె. జ్యోతి, ఎంఈఓలు తెల్లం బాబురావు, నరేంద్ర రాయ్, ఎస్సై దుర్గా మహేశ్వర రావు, పోలవరం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ, బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వంకా కాంచనమాల, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఎం. బుచ్చిరాజు, పాదం నాగకృష్ణ, తీగల గోపాలకృష్ణ, ఏలేటి ఏడుకొండలు, కట్రెడ్డి ఉమ, పులపర్తి స్వరాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఐక్య క్రైస్తవ సమైక్య ఆధ్వర్యంలో 31వ సెమీ క్రిస్మస్ వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లా ఐక్య క్రైస్తవ సమైక్య వారి 31వ వార్షిక సెమీ క్రిస్మస్ వేడుకలు గ్రాండ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సమైక్య సభ్యులు ఆధ్వర్యంలో స్థానిక నవాబుపేట కాలనీ ప్రజల సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు జిల్లా అదనపు ఎస్పి నక్క సూర్యచంద్రరావు పాల్గొన్నారు. అతిథిగా,కె.రత్నప్రకాష్, ముఖ్య ప్రసంగీకులుగా, యం స్వరూప్ రాజు, సభాధ్యక్షులుగా,9 మంది సమైక్య సభ్యులు ఐక్యమత్యంతో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుక,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు., దైవ సందేశం, క్యాండిల్ లైట్ సర్వీస్, కేక్ కటింగ్,పలహారం పంపిణీ వంటి కార్యక్రమలతో ఘనంగా జరిగాయి.